ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం; తిథి: పంచమి ఉ.7.43 వరకు; నక్షత్రం: మృగశిర సా.5.41 వరకు; అమృతకాలం: ఉ.8.38 నుంచి 10.16 వరకు; వర్జ్యం: ఆదివారం తె.2.09 నుండి 3.46 వరకు; దుర్ముహూర్తం: ఉ. 6.13 నుండి 7.46 వరకు; రాహుకాలం: ఉ.9.07 నుండి 10.34 వరకు; యమగండం: మ.1.27 నుండి 2.54 వరకు;

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



మీ నమ్మకమే మా తరగని సంపద

KAPIL GROUP

Visit Us: www.kapilchits.com

39 YEARS Safeguarding Trust

కపిల్ చిట్స్

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



సంపుటి:58 • సంచిక: 180 • శనివారం 19 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore




సుప్రీం కొత్త సీజే

## జస్టిస్ బొబ్డే

**సీజే గొగోయ్ సిఫారసు**



ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు

## ఆర్నెల్లు జైలు

**దాడి కేసులో కోర్టు తీర్పు**



ఐఎన్ఎక్స్ మీడియా కేసు

## చిద్దూపై చార్జిషీట్

**భార్య, కొడుకు పేరు కూడా**



**కల్కి లెక్కలేని నగదు**

## 500 కోట్లు

ఐటీ సోదాల్లో వెలుగులోకి

వివరాలు 9లో...



**సాగర్ కాల్వలోకి**

## స్కార్పియో

ఆరుగురు జలసమాధి

7

# చర్చలకు పిలవండి




## ఆర్టీసీ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

- ప్రజాగ్రహానికి గురికారాదు.. ఎండీని ఎందుకు నియమించలేదు?
- కార్మికుల డిమాండ్లలో ఆర్థిక సంబంధం లేనివి కూడా ఉన్నాయి
- 45 డిమాండ్లలో 20 న్యాయబద్ధమైనవే.. హైకోర్టు వ్యాఖ్య
- కార్మికులవి గొంతెమ్మ కోరికలు.. హైకోర్టుకు ప్రభుత్వం నివేదన
- సమ్మె విరమించాలని ఆర్టీసీ కార్మికులను ఆదేశించండి
- పిటిషనర్ తరపు న్యాయవాది.,. 28కి విచారణ వాయిదా

3



అర్ధరాత్రి దాకా చర్చలు



# అడుగులెటు?

- హైకోర్టు కీలక సూచనల నేపథ్యంలో తర్జనభర్జన
- ఉన్నతస్థాయి అధికారులతో సీఎం కేసీఆర్ భేటీ
- న్యాయస్థానం వ్యాఖ్యలపై ఏజీ వివరణ
- నేటి బంద్‌పై సమీక్ష.. ప్రత్యామ్నాయాలపై చర్చలు
- వీలైనన్నీ ఎక్కువ బస్సులు తిప్పాలని హుకుం
- హైదరాబాద్‌లో బస్సులు పెంచాలని సూచన
- సోమవారం నుంచి బదులు.. జాగ్రత్తగా ఉండండి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మిక సంఘాల సమ్మె, హైకోర్టు తాజాగా ఇచ్చిన సూచనల నేపథ్యంలో ఎలా ముందడుగు వేయాలన్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ సంఘాలను చర్చలకు పిలిచేలా ఆర్టీసీ యాజమాన్యానికి సూచించాలా, ఒకవేళ అలా చేయకపోతే తరువాతి పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపై విస్తృతంగా చర్చించారు. శుక్రవారం రాత్రి ప్రగతి భవన్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, రవాణాశాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్టీసీ ఉన్నతాధికారులు, అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆర్టీసీకి మేనేజింగ్ డైరెక్టర్‌ను నియమించాలని, సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలను చర్చలకు పిలవాలని హైకోర్టు ధర్మాసనం సూచించిన 3వ పేజీలో...



19న ఆర్టీసీ రాష్ట్ర బంద్‌కు సంఘీభావంగా లక్ష్మణ్ నేతృత్వంలో బీజేపీ బైక్ ర్యాలీ

# నేడు బంద్



3

- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు సంఘీభావం
- వివిధ ప్రజా సంఘాలు, పలు రాజకీయ పార్టీల మద్దతు



# హుజోర్ ఎవరిది!?

నేటితో హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారం పరిసమాప్తం • ఆఖరి రోజు అగ్రనేతల రోడ్ షోలు.. సభలు.. సమావేశాలు • ఊపందుకున్న బెట్టింగ్‌లు • సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు కాంగ్రెస్.. పాగా వేయాలని తెరాస • పట్టు సాధించేందుకు తెదేపా, బీజేపీ యత్నం • 21న పోలింగ్ • ఈసీ ఏర్పాట్లు పూర్తి

8

# పరిశ్రమల అభివృద్ధికి ఐఐఐ

- యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- ఇంటింటా ఇన్నోవేటర్ సక్సెస్
- పరిశ్రమలకు మౌలిక వసతుల ఏర్పాటు
- పారిశ్రామిక అవార్డుల ప్రదానోత్సవంలో పరిశ్రమలు, ఐటీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కార్పొరేట్ పన్ను తగ్గింపు వంటి సంస్కరణలతో దేశం ప్రపంచంలోనే ఇతర దేశాలతో పోటీపడే స్థితి నుంచి అధిగమించే స్థాయికి చేరుకుంటుందని, అందులో హైదరాబాద్ మరింత అనువైందిగా గుర్తింపు పొందిందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం సీఐఐ సదస్సులో 2వ పేజీలో...








# కొత్త కొలువుల్లో తెలంగాణ 1

- 1,17,177 మందికి ఉద్యోగాలతో జాతీయ రికార్డు
- విద్యుత్ శాఖలో అత్యధికంగా 34,808 నియామకాలు
- త్వరలో మరో రెండు వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
- జీతాల చెల్లింపులోనూ పెద్దచేయి.. అందులోనూ రికార్డే



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యకు కళ్లెం వేయటంలో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం జాతీయ రికార్డును నెలకొల్పింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వివిధ శాఖల్లో ఇప్పటివరకు 1,17,177 ఉద్యోగాలు కల్పించగా, అందులో సింహభాగం విద్యుత్ శాఖలోనే భర్తీ అయ్యాయి. దేశంలో విద్యుత్ విభాగంలో, ఇంత భారీ స్థాయిలో నియామకాలు మరే రాష్ట్రంలో గాని, కేంద్రంలోగానీ జరగకపోవడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జెన్‌కో, ట్రాన్స్‌కోతోపాటు ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ విద్యుత్ పంపిణీ సంస్థల ద్వారా సగటున ఏటా ఏడువేల మందికి ఉద్యోగాలు కల్పించాయి. 34808 మందికి ఉద్యోగాలు కల్పించింది. త్వరలో మరో 2వేల పోస్టులు భర్తీ చేయనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడుగాని లేదా దేశంలోని మరే రాష్ట్రంలోగాని విద్యుత్ శాఖల్లో ఇంత పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు. అంతే కాకుండా విద్యుత్ సంస్థలకు వస్తున్న రాబడిలో సగటున 9శాతం రాబడిని 2వ పేజీలో...

# నిరాబడికి బంధనాలు

- ఖాళీ ప్లాటుకూ వేకెంట్ ట్యాక్స్
- నివాసాలకు ప్రాపర్టీ ట్యాక్స్
- ఇప్పటికే మాంద్యం ఎఫెక్ట్
- అటకెక్కిన ఆర్ఆర్ఆర్
- నిలిచిన క్రయవిక్రయాలు
- రిజిస్ట్రేషన్ తాజా నిర్ణయం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రియల్ ఎస్టేట్ రంగంపై మరో పిడుగు పడింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలకు రాబడి పెంపు దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు స్వయంగా పన్నుల వసూళ్లతో స్వయం సమృద్ధి సాధించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా రిజిస్ట్రేషన్ శాఖతో పాటు రియల్ రంగంపై చెడు ప్రభావం చూపుతోంది. తాజాగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లకు, ఇండ్లు, ఖాళీ ప్లాట్ల విక్రయాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ అసెస్‌మెంట్ (వీఎల్‌టీఏ), ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (పీటీఐఎన్) తప్పనిసరి చేసింది. ఆర్థిక మాంద్యంతో రిజిస్ట్రేషన్లు 2వ పేజీలో...

ఔరా..!



# హైదరాబాద్‌లో హార్వర్డ్ పరిశోధనా కేంద్రం

వెల్లడించిన ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బి వినోద్ కుమార్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హైదరాబాద్ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరనుంది. భాగ్యనగరంలో ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనా కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ బి వినోద్‌కుమార్ తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో లక్ష్మీమిట్టల్ అండ్ ఫ్యామిలీ సౌత్ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్, హార్వర్డ్ వర్సిటీ ప్రతినిధి సవిత జి.అనంత్‌తో సమావేశమయ్యారు. సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్ ఆచార్య ఆర్ లింబాద్రి, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పరిశోధనల హబ్‌గా తెలంగాణ

ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం విద్యా, పరిశోధనల హబ్‌గా మారుతుందని అన్నారు. బిల్డింగ్ భారత్ బోస్టన్ బయోసైన్స్ (బీ4) అనేది స్ఫూర్తినిచ్చే కార్యక్రమం అన్నారు. వైద్య రంగంలో పలు అంశాలపై పరిశోధనలు జరిపేందుకు హార్వర్డ్ వర్సిటీ త్వరలోనే హైదరాబాద్‌లో పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించడానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. అదేవిధంగా గిరిజన ప్రాంతాల్లో తలసీమియావంటి వ్యాధులు ప్రబలుతున్నందున అలాంటి వ్యాధులపై పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వపరంగా అన్నిరకాల సహాయ సహకారాలను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రతినిధి బృందం కొద్దిరోజుల క్రితం హార్వర్డ్ వర్సిటీలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సవిత జీ అనంత్ ఉన్నత విద్యా మండలి అధికారులతో భేటీ అయ్యారు. హార్వర్డ్ వర్సిటీలోని ముఖ్య కార్యక్రమాల్లో బీ4 ఒకటని పాపిరెడ్డి తెలిపారు. బయోసైన్స్‌లో కొత్త జ్ఞానాన్ని ప్రోత్సహించడానికి, మరియు కొత్త సృష్టించడానికి ప్రోత్సహిస్తారని తెలిపారు. హార్వర్డ్ వర్సిటీ, బోస్టన్‌లోని ఇతర సంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి లైఫ్‌సైన్సెస్ విద్యార్థులకు 18 నెలలపాటు ఫెలోషిప్ ఇవ్వనున్నారు. యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడానికి యంగ్ సైంటిస్ట్ డెవలప్‌మెంట్ కోర్సును రెండు వారాలపాటు ఇవ్వనున్నారు. భారతదేశ నగరాల్లో ఏటా రెండు సెమినార్లు నిర్వహించడం ఇందులో భాగమన్నారు. హార్వర్డ్ వర్సిటీ తమ వర్సిటీ నుంచి పరిశోధనలు చేయడానికి అధ్యాపకులను పంపించడమే కాకుండా అందుకు అవసరమైన సహకారం కూడా అందించనుంది.

## పరిశ్రమల అభివృద్ధికి ఐఐఐ



(మొదటిపేజీ తరువాయి)

3వ పారిశ్రామిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐఐ భాగస్వామ్యంతో మ్యానుఫాక్చరింగ్ ఎక్సలెన్స్ (మానెక్స్-2019)ను ఆవిష్కరించి మాట్లాడారు. పారిశ్రామిక రంగాన్ని ముందుక ు తీసుకెళ్లేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా నూతన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సీఐఐకి పిలుపునిచ్చారు. ఇంటింటా ఇన్నోవేటర్ అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చి కొత్త ప్రమాణాలు సాధించిన జయేష్ రంజన్‌ను కేటీఆర్ అభినందించారు. ఇన్నోవేటర్లు పెద్ద కంపెనీల మనసును గెలుచుకున్నారని తెలిపారు. మూడు ఐలు అయిన ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజివ్ గ్రోత్ ఎంతో కీలకమని వివరించారు. పరిశ్రమలకు కావలసిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించటానికి స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియాలకు సమానంగా తెలంగాణలో టీహబ్, వీహబ్, టీ వర్క్స్ వంటి వేదికలను ఏర్పాటు చేశామన్నారు.

### ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాలకు చేయూత

పెట్టుబడులకు మంచితరుణం ఇదే అని, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం టాస్క్ వంటి సంస్థలను ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. 500 మంది సిబ్బంది అవసరమైన చోట తాము 1,000 మంది నిపుణులను అందిస్తున్నామని తెలిపారు. టీఎస్ ఐపాస్ వచ్చేనెలతో ఐదేళ్ల మైలు రాయి దాటుతుందన్నారు. ఇప్పటివరకు 11వేల కంపెనీలకు అనుమతులిచ్చామన్నారు. లక్షా 70వేల ఎకరాలను ఇండస్ట్రియల్ పార్కులకు సిద్ధం చేశామని తెలిపారు. ప్రత్యక్షంగా 17లక్షల మందికి ఉపాధి కల్పించామన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల ప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందల కంపెనీల నుంచి 15 పరిశ్రమలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సీఐఐ తెలంగాణ చైర్మన్ డి.రాజు, గ్లోబల్ లింకర్ మాళవిక జగ్గి, తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్ డైరెక్టర్ ఎర్రం రాజు, ఐటీసీ లిమిటెడ్ పీఎస్ పీడీ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ్ సింగ్, జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా ఆటో డివిజన్ ఉపాధ్యక్షుడు వీఎస్ రామ్, నాట్కో ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ బీఆర్ రెడ్డి పాల్గొన్నారు.

# కొత్త కొలువుల్లో తెలంగాణ 1

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలకే వెచ్చిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ జాతీయ స్థాయిలో మరో అరుదైన రికార్డును నెలకొల్పింది. మిగిలిన రాష్ట్రాల్లోని విద్యుత్ శాఖల్లో సిబ్బంది జీతాలు 5నుంచి 7శాతానికి మించి జీతాలకు వెచ్చించిన దాఖలాలు లేవు. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ శాఖలన్నింటిలో అవసరమైన ఉద్యోగాల భర్తీకోసం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ రికార్డులను కూడా తెలంగాణ విద్యుత్ సంస్థలు అధిగమించి మరో రికార్డును సాధించాయి.

### టీఎస్‌పీఎస్‌సికన్నా మేటి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ప్రభుత్వం వివిధ శాఖల్లో 36,474 ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇచ్చింది. ఇందులో ఇప్పటివరకూ 30,786 మందికి మాత్రమే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగాలు లభించాయి. మిగతా వాటి ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పెండింగ్‌లో ఉన్న 5,688 ఉద్యోగాలకు నియామకపు ఉత్తర్వులు పూర్తయ్యేసరికి విద్యుత్ సంస్థల్లో ఇంతకు రెట్టింపు ఉద్యోగాలను భర్తీ చేసే అవకాశాలు ఉంటాయంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకూ 1,77,177మందికి ఉద్యోగావకాశం లభించగా వీటిలో విద్యుత్ శాఖ ద్వారా లభించిన ఉద్యోగాలే 29శాతం ఉన్నాయి. పోలీసు శాఖ 17,276 మందికి ఉద్యోగావకాశం కల్పించి 14.6శాతంతో రెండవస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ 11,935 మందికి ఉద్యోగావకావకాశాలు కల్పించి పదిశాతం రికార్డుతో మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో అతిపెద్ద ఎంప్లాయిమెంట్ నెట్‌వర్క్‌గా పేరుమోసిన సింగరేణి సంస్థ 10,500 మందికి ఉద్యోగావకాశాలు కల్పించి 9శాతం రికార్డుతో నాలుగవ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ద్వారా 12,751 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులను నియమించినప్పటికీ ఇదివరకు ఉన్న కార్యదర్శులను అటుంచితే కొత్త ఉద్యోగాల నియామకంలో పంచాయతీరాజ్ శాఖ ఐదవ స్థానంలో నిలిచింది.

### పటిష్టవ్యూహంతో ఫలించిన ఉపాధి

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విభాగాలను పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగానే తెలంగాణ విద్యుత్ సంస్థల్లో భారీగా ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు సాధ్యపడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 7778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉండేది. గడిచిన ఐదేళ్లకాలంలో 8441 మెగావాట్ల విద్యుత్ అదనంగా అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు రాష్ట్రంలో మొత్తం 16,219 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. వ్యవసాయంతోపాటు ఇతర అన్నిరంగాలకు 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తుండటంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది. పెరిగిన విద్యుత్ డిమాండ్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాల్సి రావటంతో ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఆ దిశగా ప్రణాళికలు రూపొందించుకుని వాటి అమలుకు చర్యలు చేపట్టింది. కేవలం జెన్‌కో ద్వారానే 5,880మెగావాట్ల మేరకు థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలను తలపెట్టింది. విద్యుత్ శాఖ ద్వారా రూ.25,661కోట్ల వ్యయంతో కొత్త సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు , లైన్ల ఏర్పాటు వంటివాటితో విద్యుత్ రంగ వ్యవస్థను పటిష్టం చేసింది. అందుకు అనుగుణంగానే విద్యుత్ సంస్థల్లో భారీ నియామకాలు చేపట్టాల్సి వచ్చింది.

### సీఎం చొరవ వల్లనే నియామకాలు :సీఎండి

తెలంగాణ విద్యుత్ సంస్థలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే ప్రజలకు మెరుగైన సేవలు అందించటం సాధ్యమనే కేసీఆర్ నిర్ణయం ఫలితంగానే తమ సంస్థలు విజయాలు సాధిస్తున్నాయని జన్‌కో-ట్రాన్స్‌కో సీఎండి డి.ప్రభాకర్ రావు అన్నారు. అన్నిశాఖల్లోకెల్లా విద్యుత్ శాఖలోనే ఎక్కువ నియామకాలు జరగటం ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ ఫలితమే అన్నారు. ప్రైవేటులో కాకుండా జెన్‌కో ద్వారానే విద్యుత్ ఉత్పత్తి జరగాలని సీఎం నిర్ణయించారని, దీనివల్ల ఉత్పత్తి ప్లాంట్లలో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టామన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా, ఏజెన్సీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన 22,637 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో విలీనం చేసుకోవాలనే సీఎం మానవతా నిర్ణయం కూడా స్ఫూర్తినిచ్చిందన్నారు. వారి సర్వీసు నిబంధనలను కూడా హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందిస్తున్నట్టు తెలిపారు. పెద్ద ఎత్తున నియామకాలు జరపడమే కాకుండా , కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని సీఎండి ప్రభాకర్ రావు పేర్కొన్నారు.



## టమాటా అక్కడ రూపాయి! ఇక్కడ రూ.40

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కూరగాయల్లో ప్రధానమైన టమాటో ఈ ఏడాది చితవిచిత్రమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది. కొరత ఏర్పడిన సందర్భంలో కిలో రూ.80 దాటి అమ్ముడుపోయినప్పటికీ ప్రస్తుతం ఆ ధర తెలుగు రాష్ట్రాల్లో ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో టమోటోను కొనే దిక్కులేక రైతులు రోడ్డుపైనే పారబోయాల్సిన దుస్థితి నెలకొంది. పత్తి కొండ టోకు మార్కెట్‌లో 30 కిలోల టమాటో బుట్టకు రూ.30 కూడా ధర పలక డం లేదు. అంటే గడిచిన దశాబ్దకాలంగా ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం కిలో టమా టో ధర రూపాయికన్నా తక్కువకు పడిపో యింది. అదే సమయంలో తెలంగాణలో ఈ ధర 40 రెట్లు అధికంగా పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటో రూ.40 దాటి అమ్ముతున్నారు. రెండు నెలల క్రితం టమాటో కొరత ఏర్పడి ధర కిలో రూ.80 వరకు పెరిగిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రెండు రాష్ట్రాల్లోనూ రైతులు ఈ పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. దీంతో ధర అమాంతం పడిపోయింది. కానీ తెలంగాణలో మాత్రం ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రైవేట్ డ్రైవర్లంతా బీజీ కావడంతో ట్రక్కులు, ఇతర వాహనాలేవీ రోడ్డుపై తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో సరుకు రవాణా స్తంభించి మార్కెట్‌లో కిలో టమాటో రూ.40కి పెరిగింది. పట్టణాలు, నగరాల్లోనైతే ఈ ధర రూ.60కి చేరుకుంది.



# రాబడికి నిబంధనాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే తగ్గుముఖం పట్టగా మరోవైపు రిజిస్ట్రేషన్ల శాఖ తాజాగా జారీ చేసిన ఉత్తర్వులతో మరింత రాబడి తగ్గుతోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఇప్పటివరకు అమలు చేస్తున్న విధానంలో రిజిస్ట్రేషన్ల శాఖ మార్పులు తెచ్చింది. ఇకమీదట ఇంటినీ లేదా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే గతంలో లాగా దాని డోర్ నెంబర్ ఇస్తే సరిపోదు. ఇకపై దాని పీటీఐఎన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, సీడీఎంఏ ప్రాంతాల్లో ఖాళీ ప్లాటును అమ్మాలంటే ప్లాట్ నెంబర్, సర్వే నెంబర్‌తో పాటు వీఎల్‌టీపీ కూడా ఇవ్వాల్సిందే. లేదంటే రిజిస్ట్రేషన్లు చేయవద్దని రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్ జారీ చేశారు. 3న జారీ చేసిన ఈ ఉత్తర్వులతో రిజిస్ట్రేషన్లపై ప్రభావం పడింది.

### సరైన పత్రాలుంటేనే రిజిస్ట్రేషన్

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా తీసుకున్న ఈ నిర్ణయాల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, స్థానిక అర్బన్ సంస్థలు తీసుకోవాల్సిన చర్యలను కూడా రిజిస్ట్రేషన్ల శాఖ ప్రస్తావించింది. రిజిస్ట్రేషన్ల సమయంలో ఎదురవుతున్న సమస్యలు, సహకారలేమి, ఇప్పుడున్న విధానాల్లో ఆయా సంస్థల్లో తీసుకోవాల్సిన మార్పులను పేర్కొంది. మ్యుటేషన్లకు డీడీలను తీసుకోవడంతో పాటు ఆయా సంస్థలకు పంపించడంలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరింది. 22ఏ కింద నిషేధిత ఆస్తులు, భూముల వివరాలను కలెక్టర్లు నిర్ధారించి జాబితాను నోటీస్‌పై చేయాలని కోరింది. ఈ వివరాలన్నీ సరిగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలని, లేనిపక్షంలో చేయకూడదని అన్ని కార్యాలయాలకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ చిరంజీవులు ఆదేశాలు జారీ చేశారు.

### రియల్‌పై మాంద్యం ప్రభావం

ఇప్పటికే స్థిరాస్తి రంగంలో మాంద్యంతో పాటు పెరిగిన ధరల కారణంగా స్తబ్ధత నెలకొంది. ఆర్ఆర్ఆర్‌పై నీలి నీడలు కమ్ముకోవడం కూడా సుదూర ప్రాంతాల్లో రియాల్టీ రంగంలో మార్పులకు కారణంకాగా, మాంద్యంతో నిర్మాణ రంగంలో కూడా పెనుమార్పులు నమోదవుతున్నాయి. ఫలితంగా గతేడాది ఉన్న ఉత్సాహం ఈ రంగంలో లేకుండా పోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.2,426 కోట్ల రాబడి సమకూరగా, ఈ నెలలో కేవలం రూ.110 కోట్ల ఆదాయం మాత్రమే రావడం గమనార్హం. శుక్రవారం 6,057 రిజిస్ట్రేషన్లతో రూ.27కోట్ల రాబడి మాత్రమే ఖజానాకు చేరింది.

### తగ్గిన ఆదాయం

ఈ శాఖలో అక్రమాలు, అవకతవకలకు ఆస్కారం లేకుండా తీసుకున్న చర్యలతో కూడా రెవెన్యూ తగ్గింది. ఇందుకు సాంకేతికత సాయంతో అక్రమాలకు కళ్లెం వేస్తున్నారు. ముందుగా స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లకు ప్రాధాన్యతనిస్తున్న ఈ శాఖలో అక్రమాలకు నిలయమైన అనేక అవకాశాలను పూర్తిగా కట్టడి చేస్తున్నారు. గతంలో ఈసీలు, సీసీలకు ఇష్టానుసారం ఉన్న వెసులుబాటుకు కూడా ఉన్నతస్థాయిలో తీసుకున్న నిర్ణయంతో చెక్ పెట్టారు. వెబ్‌సైట్‌లో నిర్దేశిత రుసుము చెల్లించి, సదరు రశీదు నెంబర్‌ను ఎంటర్ చేసిన తర్వాతే ఈసీలు, సీసీలు జనరేట్ అయ్యేలా మార్పులు తీసుకొచ్చారు. డాక్యుమెంట్ రైటర్లు తమకిష్టం వచ్చినట్లుగా ముందువచ్చిన క్రయవిక్రయదారుల డాక్యుమెంట్లను పక్కనపెట్టి.. తమ పరపతితో స్కానింగ్ చేయించి వరుస క్రమాన్ని కాదని రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. దీంతో ముందుగా వచ్చిన కొందరు క్రయవిక్రయదారులు తీవ్ర జాప్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీన్ని గుర్తించిన జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాస్, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు తీసుకొచ్చారు. ముందుగా స్కానింగ్ ట్రేలో 4 డాక్యుమెంట్లే వచ్చేలా, అవి పూర్తి చేసిన తరువాతే మరో 4 డాక్యుమెంట్లను స్కానింగ్‌కు అనుమతించేలా ఆటోమేటిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఐజీ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో వీడియోలను వీక్షించడం, నిఘా తీవ్రతరం చేయడం, అక్రమాలు లేకుండా చూడటం వంటి చర్యలు సత్ఫలితాలు వస్తున్నాయి.




## అడవుల పరిరక్షణే ధ్యేయం

### మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** అటవీ భూములు, వన్యప్రాణుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. కేసీఆర్ అడవుల పరిరక్షణ, అడవుల పునరుజ్జీవనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన తెలిపారు. జంగల్ బచావో, జంగల్ బడావో నినాదాన్ని ఉద్యమ స్ఫూర్తిగా తీసుకుని పచ్చదం పెంచుకోవడం, అడవులను కాపాడుకోవడం కోసం అటవీ అధికారులు కృషి చేయాలని సూచించారు. శుక్రవారం దూలపల్లి ఫారెస్టు అకాడమీలో రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల అర్థసంవత్సర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కంపా నిధులపై 2019- 20 వార్షిక ప్రణాళిక నివేదికను విడుదల చేసి, అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.. అటవీ, సహజ వనరుల సంరక్షణలో భాగంగానే కేసీఆర్ ఐదుగురు మంత్రులతో కూడిన పచ్చదనం కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. త్వరలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై తెలంగాణలో పచ్చదనం పెంచడం, అడవులను కాపాడటం, అక్రమ కలప రవాణాను అరికట్టడం వంటి కీలక అంశాలపై చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. పోడు, అటవీ భూ సమస్యను ప్రభుత్వం పరిష్కరించనుందన్నారు.



## జొన్నలబొగుడ ఎత్తు పెంచండి

### మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** వనపర్తి జిల్లాలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ ఎత్తు పెంచేందుకు టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా పరిధిలోని అన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం పెంచే అంశంపై అధ్యయనంచేసి నివేదిక సమర్పించాలన్నారు. డీ-82 కాలువ పనులు వెంటనే పూర్తిచేసి ఓటీఎస్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ అంశంపై శుక్రవారం హాకా భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. బుద్దారం కుడి, ఎడమ కాలువల కింద డిస్ట్రిబ్యూటరీ కాలువల సర్వే పూర్తిచేసి పనులు ప్రారంభించాలన్నారు. ఎడమ కాలువను రాజాపేట వరకు పొడిగించాలని, లింగాల సమీపంలో కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు, డీ-82 కింద అచ్చంపేట నియోజకవర్గానికి నీళ్ళిచ్చే ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు. ప్యాకేజీ 29, 30లలో పేర్కొన్న పనులను పూర్తిచేసి వంగూరు మండలానికి సాధ్యమైనంత త్వరగా నీళ్ళు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ, డి-5 కాలువను వెడల్పుచేసి ఏ దుల రిజర్వాయర్‌ను నింపాలన్నారు. ఖాన్ చెరువు నీళ్ళిచ్చే ఎంజే-4 కాలువ పనులు త్వరలోనే పూర్తిచేయాలన్నారు. ఎజెం-3 కాలువను శ్రీనివాసపూర్ వరకు పొడిగించాలని, వనపర్తి, ఈదుల చెరువుకు నీరందేలా చూడాలని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.






## చీమలా నటించే దొంగ సాలీడు!

ఇక్కడ కనిపిస్తున్న చీమ చూడచక్కగా ఉంది కదూ. దాని కొండెలు, కాళ్లు, కళ్లలో తీక్షణత చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి కదూ. కానీ, కాస్త పరీక్షగా చూడండి. అది చీమలాంటి ఓ సాలెపురుగు అని తెలుస్తుంది. దీనిని యాంట్ మిమికింగ్ క్రాబ్ స్పైడర్ అని పిలుస్తారు. చీమలదండులోకి చేరి, చీమల్లా నటిస్తూ వాటిని తినేయడం దీని అలవాటు. అలాగే తనను చీమలు తినేయకుండా తనూ చీమననేలా వాటిని భ్రమింపచేయడానికి చీమల్లా ఇవి నటిస్తూంటాయంతే. ఇంతకీ అసలు విషయం చెప్పలేదు కదూ. పశ్చిమ బెంగాల్‌లోని బుక్సా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో రిపన్ బిశ్వాస్ అనే మన దేశ ఫొటోగ్రాఫర్ ఈ చిత్రాన్ని తీయగా, అతడికి ప్రపంచ వన్యప్రాణి ఛాయాచిత్ర పోటీల్లో అవార్డు తెచ్చిపెట్టింది.



## కాటలోనియా ప్రభంజనం

స్పెయిన్ రాజధాని బార్సిలోనా లక్షలాదిమంది కాటలోనియన్ల నిరసనలతో ఊగిపోతోంది. స్పెయిన్‌లో భాగమే అయినా పూర్తి స్వాతంత్ర్యం కోసం కొద్దిరోజులుగా కాటలోన్ భాష మాట్లాడే ప్రజలు ఉద్యమిస్తున్నారు. స్పెయిన్‌లోని బార్సిలోనా, గిరొనా, ల్లెడియా, టర్రగొన నగరాలను (ప్రావిన్సులు) కలిపి కాటలోనియాగా పిలుస్తున్నారు. కాటలోన భాషమాట్లాడేవారు ఇక్కడ ఎక్కువ. రెండేళ్ల క్రితం తమకు తాముగా స్వతంత్ర దేశంగా కాటలోనియా పార్లమెంట్ (స్వయంప్రతిపత్తి) ప్రకటించడంతో స్పెయిన్ అట్టుడికింది. అప్పటినుంచి అడపాదడపా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఐదురోజుల క్రితం కాటలోనియా వేరే స్వతంత్ర దేశంగా విడిపోవాలని కోరుకుంటూ ఉద్యమం మొదలైన నేపథ్యంలో పలువురు నేతలను స్పెయిన్ ప్రభుత్వం అరెస్టు చేసింది. దీనికి నిరసనగా కాటలోనియన్లు ఇలా రోడ్డెక్కారు.



## యాలిగేటర్ బాయ్!

మొసళ్లలా కనిపించే యాలిగేటర్లతో అమెరికన్లకు ఎప్పుడూ సమస్యలే. మడుగులు, చెరువులు, నదుల్లో ఉండాల్సిన ఈ యాలిగేటర్లు అప్పుడప్పుడు జనావాసాల్లోకి వచ్చి బెదరగొడుతూంటాయి. ఇదిగో అమెరికాలోని పార్క్‌లాండ్‌లోని ఓ ఇంటి స్విమ్మింగ్‌పూల్‌లోకి ఓ యాలిగేటర్ చొరబడి సమస్యలు సృష్టించడంతో వాటిని పట్టడంలో దిట్టగా చెప్పుకునే పాల్ బెడార్డ్ రంగంలోకి దిగాడు. 9 అడుగుల పొడవున్న యాలిగేటర్‌ను పట్టుకుని బాహుబలిలా ఎత్తిపట్టుకున్నాడు. యానిమల్ ప్లానెట్ వంటి ప్రఖ్యాత చానల్స్‌లో బెడార్డ్ గేటర్ బాయ్‌గా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేరు ప్రఖ్యాతలు సాధించాడు.



## అదిగో పులి

మెక్సికో-అమెరికా సరిహద్దులో వేసిన కంచె వెనుక రాత్రిపూట సంచరిస్తున్న జాగ్వార్ ఇది. జాగ్వార్‌లో మెక్సికన్ రకానికి చెందిన అరుదైన జాతికి చెందిన పులి ఇది. అమెజాన్ అడవులు వీటి అసలు నివాస ప్రాంతం. అయితే అవి ధ్వంసమవుతూండటంతో ఇలా బయటకు వస్తున్నాయి. వేటగాళ్ల వల్ల దాదాపు ఇవి అంతరించే స్థితికి చేరుతున్నాయి. వీటి జాడను ఎలాగైనా గుర్తించాలని రెండేళ్లుగా ఈ సరిహద్దుల్లో పడిగాపులుకాసిన మెక్సికోకు చెందిన ఫొటోగ్రాఫర్ అలెగ్జాండ్రో ప్రీటీ కృషి ఎట్టకేలకు ఫలించింది. అతడు తీసిన ఈ జాగ్వార్ ఫోటో, అతిడికి పెద్ద బహుమతిని తెచ్చిపెట్టింది. ప్రపంచ వన్యప్రాణి ఫోటోగ్రఫీ కంటెస్ట్‌లో ఈ చిత్రం తీసిన ప్రీటీకి ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా అవార్డు వచ్చింది.



శంషాబాద్‌లోని పోర్ట్ గ్రౌండ్ ఎస్కేప్ వాటర్ పార్క్‌లో టీఆర్ఎస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు వివాహ నిశ్చితార్థ వేడుకకు హాజరైన సీఎం కేసీఆర్, రాజ్యసభ సభ్యుడు సంతోష్ తదితరులు.



తాజ్ కృష్ణ హోటల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త బలరాంరెడ్డి, మెదక్ జిల్లా ఎస్పీ చందనా దీప్తిల రిసెప్షన్ అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# అడుగులెటు?



(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. హైకోర్టుకు నివేదించిన అంశాలను, ధర్మాసనం వెలిబుచ్చిన అభిప్రాయాలను అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు సీఎం కేసీఆర్‌కు వివరించారు. మూడు రోజుల్లోగా కార్మిక సంఘాల నేతలతో చర్చలు పూర్తి చేయాలని, తిరిగి ఈనెల 28న జరిగే విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన సమావేశంలో ప్రస్తావించినట్టు తెలుస్తోంది. ఆర్టీసీ ఎండీ నియామకానికి సంబంధించి హైకోర్టులో బలమైన వాదనలు వినిపించామని, ప్రస్తుతం ఎండీగా కొనసాగుతున్న రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ ఎంతో అనుభవజ్ఞుడని కోర్టుకు వివరించామని చెప్పామని, అయితే అంత అనుభవజ్ఞుడైతే ఆ అధికారిని పూర్తిస్థాయి అధికారిగా ఎందుకు నియమించలేదని ధర్మాసనం ప్రశ్నించిందని రామచంద్రరావు చెప్పినట్టు తెలుస్తోంది. ఆర్టీసీ పూర్తి నష్టాల్లో ఉందని ప్రస్తుతమున్న సమయంలో కార్మిక సంఘాల నేతలు కోరుతున్న డిమాండ్లను పరిష్కరించలేమని కోర్టుకు ప్రభుత్వం నివేదించిన సంగతి తెలిసిందే. కార్మిక సంఘాల నేతలను చర్చలకు పిలిచే అంశంపై సీఎం కేసీఆర్ అధికారులతో సమాలోచనలు జరిపినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం తరపున మంత్రుల కమిటీని నియమించి వారితో చర్చలు ప్రారంభించాలా లేక ఆర్టీసీ ఎండీ స్థాయిలోనే చర్చలు చేపట్టాలా లేకపోతే ఈనెల 28న తిరిగి సమ్మెపై హైకోర్టులో జరిగే విచారణకు హాజరై వివరణ ఇవ్వాలా అన్నదానిపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఆర్టీసీకి సంబంధించి విడి భాగాల కొనుగోలు, ఇంటి అద్దె అలవెన్సులు వంటి డిమాండ్లను పరిష్కరించవచ్చు కదా అని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు లేని డిమాండ్లను తీరిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై కూడా మంతనాలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. కార్మిక సంఘాల జేఏసీ చెబుతున్నట్టుగా తమను చర్చలకు ఆహ్వానిస్తే అన్ని అంశాలు చర్చిస్తామని, ఎటువంటి గొంతెమ్మ కోర్కెలు తాము కోరడం లేదని తాము ప్రస్తావిస్తున్న డిమాండ్లన్నీ గతంలో ప్రభుత్వం చెప్పినవేనన్న అంశాలపై కూడా ఈ ఉన్నతస్థాయి భేటీలో చర్చించినట్టు చెబుతున్నారు. కార్మిక సంఘాలను చర్చలకు పిలవకపోతే ఎటువంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్న అంశంపై కూడా కేసీఆర్ దృష్టిసారించినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై ఆయన అదనపు అడ్వకేట్ జనరల్, న్యాయశాఖ కార్యదర్శితో ప్రత్యేకంగా చర్చించారని విశ్వసనీయంగా తెలిసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఆ తర్వాత తీసుకోవలసిన చర్యలపై ఈ భేటీలో చర్చించినట్టు సమాచారం. సమ్మె చేస్తున్న కార్మిక సంఘాలను చర్చలకు పిలవకుండా ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తంచేసినట్టు చెబుతున్నారు.

## బంద్‌పై సూచనలు

ఆర్టీసీ కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా శనివారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు అన్ని రాజకీయ పక్షాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రయాణీకులు ఇబ్బంది పడకుండా పోలీస్ పహారాలో బస్సులు నడపాలని కేసీఆర్ ఆదేశించారు. శనివారం అయినప్పటికీ హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారు ఎక్కువ సంఖ్యలో ఉంటారని, అలాగే జిల్లా కేంద్రాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు, అక్కడి నుంచి జిల్లా కేంద్రాలకు వచ్చే వారిని దృష్టిలో పెట్టుకుని డిపో మేనేజర్లు, రీజినల్ మేనేజర్లు, ఈడీలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆర్టీసీ ఆస్తులకు ఎటువంటి నష్టం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బస్‌డిపోలు, బస్టాండుల్లో ఎక్కువ మంది పోలీసులను మోహరించి బందోబస్తు చర్యలను చేపట్టాలని కోరారు. ప్రజా రవాణాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులన్నీ పూర్తిస్థాయిలో నడవాలని ఆదేశించారు. సోమవారం నుంచి రాష్ట్రంలో విద్యాసంస్థలు పునః ప్రారంభమవు తున్నందున అప్రమత్తంగా ఉండి నూటికి నూరుశాతం బస్సులను నడిపేలా చూడాలని అవసరమైతే అద్దె బస్సుల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. హైదరాబాద్ నగరంలో కేవలం 50 శాతం బస్సులే అందుబాటులో ఉంటున్నట్టు తనకు సమాచారం అందిందని సోమవారం నాటికి ఈ సంఖ్య మరింత పెరగాలని కోరారు. శనివారం జరిగే బంద్‌లో ఓలా, ఊబర్‌తో పాటు ఇతర ట్యాక్సీ సర్వీసులు కూడా ఆగిపోనున్నాయని ఇప్పటికే బంద్‌లో తాము పాల్గొంటున్నట్టు ఆయా సంఘాల వారు ప్రకటించారని గుర్తుచేశారు. ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టామని తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల సంఖ్యను పెంచడంతో పాటు శనివారం జిల్లాలు, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో బస్సుల సంఖ్యను మరింత పెంచే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయని ఆర్టీసీ ఉన్నతాధికారులు సీఎంకు నివేదించారు.

# నేడు రాష్ట్రబంద్

**ఉద్యోగ సంఘాల సన్నాహాలు.. వివిధ సంఘాలు, పార్టీల మద్దతు**

- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరుకానున్న రెవెన్యూ ఉద్యోగులు
- కోర్టులను బహిష్కరించనున్న న్యాయవాదులు
- ఆర్‌డీవో, కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనకు రెవెన్యూ ఉద్యోగుల నిర్ణయం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గడచిన 14 రోజులుగా సాగుతున్న టీఎస్ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా శనివారం ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు సన్నద్ధమైంది. సమ్మె విరమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం బంద్‌కు టీఆర్ఎస్‌మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, బీసీ సంఘాలు, ఎంఆర్‌పీఎస్‌లతో పాటు రెవెన్యూ, ఉద్యోగ జేఏసీలు మద్దతు ప్రకటించాయి. బంద్‌ను విజయవంతం చేసేందుకు 3 రోజులుగా పార్టీలు, ప్రజా సంఘాలు పలు చోట్ల సభలు, సమావేశాలు, నిరసనలు, బైక్ ర్యాలీలతో ప్రజల మద్దతు కోరాయి. బంద్‌ను ఎట్టి పరిస్థితులలో విజయవంతం చేయాలన్న సంకల్పంతో ఉన్న పార్టీలు, ప్రజా సంఘాలు శనివారం వేర్వేరు ప్రాంతాలలో పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలను చేస్తున్నారు. సమ్మెకు న్యాయవాదులు మద్దతు ప్రకటించడమేకాకుండా, శనివారం రాష్ట్రంలోని కోర్టులలో విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరవుతామని ప్రకటించారు. భోజన విరామ సమయంలో కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డీవో కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలను చేపట్టనున్నారు. బంద్‌కు ఏబీవీపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు కూడా సిద్ధమవుతున్నాయి. బంద్ పిలుపును దృష్టిలో పెట్టుకుని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో జరిగే అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ ప్రకటించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో పలు కూడళ్ళు, రోడ్లలో నిరసనలను తెలియజేసేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్‌ల వద్ద నిరసనలకు వామపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం నుంచే రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలతో పాటు అనుబంధ సంఘాలు ఎక్కడికక్కడ రోడ్లపై బైఠాయించాలని నిర్ణయించాయి.

### సంయమనంతో వ్యవహరించాలి

బంద్ దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు శాఖ సన్నద్ధమైంది. అన్ని సున్నిత ప్రాంతాలలో బందోబస్తును పటిష్టం చేసిన అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తోంది. బంద్ సందర్భంగా ఆందోళనకారులను ఎక్కడికక్కడే కట్టడి చేయాలని, ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని క్షేత్ర స్థాయి సిబ్బందికి అదేశాలందాయి. ప్రజల జనజీవనంపై బంద్ ప్రభావం ఏ మాత్రం ఉండకుండా చూడాలని సూచించారు. బలవంతంగా వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసి వేయించేందుకు ప్రయత్నిస్తే సహించరాదని ఆదేశించారు.

# చర్చలకు పిలవండి

- టీఎస్ ఆర్టీసీ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం
- ప్రజాగ్రహానికి గురికారాదు.. ఎండీని ఎందుకు నియమించలేదని ప్రశ్న?
- కార్మికులవి గొంతెమ్మ కోరికలు
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** తెలంగాణలో ఆర్టీసీ సమ్మెపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం భేషజాలను వదిలి కార్మిక సంఘాలను శీఘ్రగతిన చర్చలకు ఆహ్వానించాలని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని టీఆర్టీసీ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. కార్మికుల చేస్తున్న 45 డిమాండ్లలో 20 న్యాయ సమ్మెతమైనవేనని హైకోర్టు అభిప్రాయపడింది. ఎండీ నియామకం, హెచ్‌ఆర్‌ఏ పెంపు, కార్మికలకు మెరుగైన వైద్యం, మౌలిక వసతుల కల్పన, స్పేర్‌పార్టుల కొనుగోలు ఆసరా పెన్షన్లు, పీఎఫ్ ఉపసంహరణ, వంటి డిమాండ్లు న్యాయసమ్మతమైనవేఅని హైకోర్టు పేర్కొంది. వీటిలో కొన్ని ఆర్థికసంబంధంలేనివి కూడా ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. సమ్మె నివారణకు ఇంతవరకు తీసుకున్న చర్యలేమిటని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సమ్మెకు పరిష్కారం చూపకపోతే రాష్ట్రంలో మరింత విపత్కర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆదిలాబాద్ ఏజెన్సీలోని ప్రజలు వైద్యం కోసం పట్టణాలకు రాలేకపోతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు. విద్యా సంస్థలకు సెలవులు పొడిగించాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకెంత కాలం సెలవులను పొడిగిస్తారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కార్మికులతో చర్చలు జరపాలని హైకోర్టు యాజమాన్యానికి సూచించింది. నేటిబంద్‌కు రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రైవేటు క్యాబ్ డ్రైవర్లు కూడా మద్దతు ప్రకటించినట్లు ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

ఆర్టీసీకి ఎండీని ఎందుకు నియమించలేదని హైకోర్టు నిలదీసింది. ఫిలిప్పీన్స్ దేశంలో సమ్మెల కారణంగా పలు సమస్యలు తలెత్తాయని, ఏడాది లోపే అక్కడ పరిపాలకుడు మారిపోయిన విషయాన్ని హైకోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజలు అత్యంత శక్తివంతులని, నిరసన వ్యక్తం చేయకుండా వారిని ఎవరూ నిలురించలేరని, ప్రజల ఆగ్రహానికి గురికారాదని హైకోర్టు ప్రభుత్వానికి హితవు చెప్పింది. కార్మికులను చర్చలు జరపాలని, చర్చల సారాంశాన్ని తమకు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది.

### ఆర్టీసీ కార్మికులవి గొంతెమ్మ కోర్కెలు... ఏఏజీ వాదనలు

సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులవి గొంతెమ్మ కోర్కెలని, ఆర్టీసీ సంస్థ ఆర్థిక పరిస్థితి కారణంగా కార్మికుల డిమాండ్లు నెరవేర్చడం సాధ్యం కాదని తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు విన్నవించారు. ఆర్టీసీ సంస్థ ఏటా రూ.1200 కోట్ల నష్టాలతో నడుస్తోందన్నారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ఏఏజీ హైకోర్టుకు అదనపు అఫిడవిట్ సమర్పించారు. అయితే ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్మికులతో చర్చలు జరిపేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ వేసినట్లు తెలిపారు. చర్చలు జరుగుతుండగానే కార్మిక సంఘాలు సమ్మెకు వెళ్లాయని విన్నవించారు. ఆర్టీసీ కార్మికులకు జీతాలు బాగా పెరిగినట్లు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 40 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు.



### చర్చలకు పిలుపు రాలేదు: కార్మిక సంఘాలు

కార్మిక సంఘాల తరపున చర్చల్లో పాల్గొనాలని తనకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పిలుపు రాలేదని కార్మిక సంఘాల తరపు సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ కొత్తది కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో వచ్చిందని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ...ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండును వదిలిపెట్టి చర్చల్లో పాల్గొనేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించింది. విలీనం డిమాండ్ ముందస్తు షరతు కాదని, అన్ని డిమాండ్లతో చర్చలకు వెళ్తామని విన్నవించారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది పివి.కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ..సమ్మె చేస్తున్న కార్మిక సంఘాలను సమ్మె విరమించేలా, కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. తదుపరి విచారణ 28కి వాయిదా వేసింది.

# సినీ ప్రముఖుల గ్రీన్‌ఛాలెంజ్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెరాస అగ్రనేత, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఛాలెంజ్ అద్వితీయంగా ముందుకు సాగుతున్నది. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు అందరూ గ్రీన్ ఛాలెంజ్‌లో భాగస్వాములు అవుతూ మొక్కలు నాటుతున్నారు. ఇప్పటికే 3 కోట్లకు పైగా మొక్కలు నాటారు. తెలంగాణతో పాటు దేశ, విదేశాల నుంచి గ్రీన్ ఛాలెంజ్‌కు అపూర్వ ఆదరణ లభిస్తోంది. హరిత ఉద్యమం మరింత ఉధృతంగా ముందుకు సాగుతోంది. తాజాగా ఎంపీ సంతోష్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్‌ను పలువురు సినీనటులు స్వీకరించారు. జయలలిత, వినోద్ బాల, జయప్రకాశ్ రెడ్డి, కాదంబరి కిరణ్, పరుచూరి బ్రదర్స్, జయలలిత సహా పలువురు యాక్టర్లు ఫిల్మ్‌నగర్ విద్యాభవన్ ఎదురుగా మొక్కలు నాటారు. ప్రతిఒక్కరు గ్రీన్ ఛాలెంజ్ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు.

# అక్రమ ఆస్తులుంటే ఉరితీయండి

**న్యాయవిచారణకు సిద్ధం.. ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కార్మిక నేతగా అక్రమంగా ఆస్తులు సంపాదించానని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ వ్యవహారంలో న్యాయ విచారణకు సిద్ధం గా ఉన్నానని, అక్రమ ఆస్తులున్నట్లు విచారణలో తేలితే బహిరంగ ఉరికి సిద్ధమని ఆర్టీసీ కార్మిక జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం అధ్య క్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సకల జనుల సమర భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి మాట్లా డుతూ, గతంలో విజిలెన్స్ విచారణ జరిపినా తాను క్లీన్‌చిట్‌తో వచ్చానన్నారు. కార్మి కుల పక్షాన పోరాటం తప్పితే రాజకీయ ప్రయోజనాలు ఆశించి పోరాటం చేయటం లేదన్నారు. చర్చలు ప్రారంభించాలని కోర్టు ఆదేశించినా సీఎం కేసీఆర్ స్పందించకపోవటం దారుణమన్నారు. మంత్రి హరీశ్‌రావు ఇకనైనా మౌనం వీడాలని అశ్వత్థా మ కోరారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల్లోకి వస్తే తిరిగి భారీ మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు. టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం మాట్లాడుతూ రెండో ఆలోచన లేకుండా శనివారం నాటి రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీటీడీపీ అధ్యక్షులు ఎల్. రమణ మాట్లాడుతూ ఆర్టీసీ సమ్మెను తప్పుబడుతున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, గంగుల కమలాకర్ అడ్డామీది కూలీలని విమర్శించారు.



### అమరుల కుటుంబాలకు పొన్నాల, వీహెచ్ సహాయం

టీపీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ... ప్రజల కోసం సీఎం కేసీఆర్ ఏనాడు తాపత్రయ పడలేదని, కేవలం అవినీతిపైనే దృష్టిపెట్టారని విమర్శించారు. ఆర్టీసీ అమరవీరులకు కుటుంబానికి రూ.1లక్షచొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సీఎం కేసీఆర్ మాటమీద నిలబడరని పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ ఎంపీ వీ. హనుమంతరావు విమర్శించారు. ఆర్టీసీ అమరవీరుల కుటుంబాలకు రూ.50వేల చొప్పులన ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.



# యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశ సమగ్రతను కాపాడేలా యువతను ఒక శక్తిలా రూపుదిద్దాలని జనసేన పొలిట్ బ్యూరో నిర్ణయించింది. శుక్రవారం జనసేన ప్రధాన కార్యాలయంలో పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు నాదెండ్ల మనోహర్‌బాబు, డాక్టర్ పాపిశెట్టి రామ్మోహన్‌రావు, అర్హంఖాన్ పాల్గొన్నారు. దేశ సమగ్రతను కాపాడే సందేశాన్ని యువతరానికి అందించడానికి మేధావులతో మేధోమథనం నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. రాజకీయ విలువలు పెంపొందించి, వర్గ బేధాలు తగ్గించడమే లక్ష్యంగా యువతకు నాయకత్వ శిక్షణ ఇప్పించాలని సమావేశం అభిప్రాయపడింది. జమ్మూ కాశ్మీర్‌ను జాతీయ జన జీవన స్రవంతిలోకి తీసుకురావడానికి ఆర్టికల్ 370 రద్దు మంచిదేనని పొలిట్‌బ్యూరో తీర్మానించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక మాంద్యంపై లోతుగా సమావేశంలో చర్చించారు. ఎటువంటి చర్యలను చేపడితే ఆర్థికమాంద్యం నుంచి బయటపడగలమనే అంశాలపై దృష్టిసారించాలని సమావేశం అభిప్రాయపడింది. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం సూత్రంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సమావేశంలో నిర్ణయించారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**వైద్య విద్యా శాఖ**
**టెండరు నోటిఫికేషన్**

**ఆర్.సి.నెం.సిఎస్-1/ఎల్‌సి/16/2019** **తేది : 17.10.2019**

**పనిపేరు:** టెండరు ప్రారంభ తేదీ నుండి ఒక (1) సంవత్సర కాల వ్యవధి కొరకు కాకతీయ వైద్య కళాశాల, వరంగల్ నకు లాబరేటరీ కెమికల్స్, రీ ఏజెంట్స్ మరియు కిట్లు మొదలైన వాటి సరఫరా. టెండరు దరఖాస్తుల అమ్మకం : **21.10.2019 నుండి 31.10.2019 వరకు ఉ.గం.11.00 నుండి సా.గం.4.00 మధ్య.** టెండర్లు స్వీకరించుటకు చివరి తేది: **01.11.2019న సా.గం.4.00 వరకు.** టెండరు తెరచు తేది: **05.11.2019న ఉ.గం.11.00 వద్ద.** పై ప్రకటన యొక్క వివరాలు వెబ్‌సైట్ www.kmcwgl.com వద్ద లభిస్తాయి. **సం/- ప్రిన్సిపాల్, కాకతీయ వైద్య కళాశాల, వరంగల్**

Ro No.1413/CL/Advt/1/2019-20, Dt. 18.10.2019

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 19 అక్టోబర్ 2019

# ఇంకా ఆకలిరాజ్యమేనా?

భారత్ పేద దేశం కాదు, రత్నగర్భ అనీ, పాడియావు అని మన కవులు పలు సందర్భాల్లో అభివర్ణించారు. ఇప్పటికీ ఎలు గెత్తిచాటుతున్నారు. మన దేశాన్ని పాడియావుతో పోలుస్తూ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాసిన గేయాన్ని ఇప్పటికీ సభల్లో గానం చేస్తుంటాం. అంత ప్రశస్తి చెందిన మన దేశం ప్రపంచ ఆకలిసూచి (గ్లోబల్ హంగర్ ఇండెక్స్ - జిహెచ్ఐ) ప్రకారం 117 దేశాల మీద 102 స్థానంలో ఉందంటే విచారకరమే. ఈ పరిస్థితికి జనాభా పెరుగుదల కారణమని పాలకులు చెప్పవచ్చు. అది అసత్యం కాకపోయినా, ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో జరిగిన అభివృద్ధి ఫలాలు కొందరికి మాత్రమే చేరుతున్నట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. 2018లో 82 శాతం సంపద ఒక శాతం మంది చేతిలోకి వెళ్ళినట్టు ఆక్స్ ఫామ్ సంస్థ వెల్లడించింది. ఆకలి సూచి ఏటేటా మారుతూ ఉంటుంది. వంద పాయింట్ల స్కోరు ఆకలి తీవ్రతను ఈ సంస్థ లెక్కిస్తూ ఉంటుంది. 2005లో 38.5 శాతం ఉన్న భారత్ స్కోరు ఐదేళ్ళ తర్వాత 32కు పడిపోయింది. ప్రస్తుతం 30.3 పాయింట్లు ఉంది. ఈ సూచిలో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని స్థానాలను నిర్ధారిస్తూ ఉంటాయి. భారత్ తర్వాత ఆఖరు స్థానంలో ఉన్న సెంట్రల్ ఆఫ్రికా రిపబ్లిక్‌కూ మధ్య ఉన్నవన్నీ ఆఫ్రికా దేశాలే. ఆ దేశాల్లో ఎక్కువగా ఆకలిచావులు సంభవిస్తూ ఉంటాయి. మన దేశంలో అటువంటి పరిస్థితులు లేవు కానీ, ప్రజలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. మన దేశంలో ఎప్పుడో దశాబ్దాల క్రితం ఒడిషాలోని కలహంది జిల్లాలో ఆకలి చావులు సంభవించాయి. ఈ సూచిలో స్థానాల ఎంపికకు ఈ సంస్థ అనుసరించిన ప్రమాణాలను పరిశీలిస్తే అవి ముఖ్యమైనవే. పౌష్టికాహార లోపం పిల్లల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎండిన డొక్కలతో ఐదేళ్ళ లోపు పిల్లల చిత్రాలు తరచూ మీడియాలో ప్రసారం అవుతున్నాయి. ఐదేళ్ళ లోపు పిల్లల్లో బరువు తక్కువ, పారిశుధ్య సౌకర్యాలు లేని వాతావరణం లో పెరగడం, అధిక సంతానం వంటి కారణాల వల్ల అన్నార్తులను గుర్తిస్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోషక్ మాసోత్సవాన్ని జరపాలని గత నెలలో పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం చౌక డిపోల ద్వారా ఆహార ధాన్యాలనూ, పప్పులు, ఇతర బలవర్ధక ఆహార పదార్థాలను సరఫరా చేయాలని ఆదేశించారు. తెలుగునాట చౌక డిపోలుగా పేరొందిన ప్రజాపంపిణీ వ్యవస్థ తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు హయాంలోనూ, మళ్ళీ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం లోనూ పకడ్బందీగా పనిచేసింది. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన కిలో రెండు రూపాయలకు కిలో బియ్యాన్నే రాజశేఖరరెడ్డి అమలుజేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నాలుగున్నర దశాబ్దాల క్రితమే ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, గరీబీ హఠావో అనే నినాదాన్ని ఇచ్చారు. ఈ పథకాలన్నీ మంచివే అయినా అవి రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కావడం దురదృష్టకరం.

చౌక డిపోలు ఇప్పటికీ ఉన్నప్పటికీ అవి అంతంత మాత్రంగానే పనిచేసు న్నాయి. చౌక డిపోలకు కేటాయించిన బియ్యం, నిత్యావసర వస్తువులు పక్కమార్గం పట్టడం గురించిన వార్తలు తరచూ వస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వం పదేళ్ళ పాలన చివరి సంవత్సరంలో హడావుడిగా ఆహార భద్రతా పథకాన్ని ప్రవేశపెట్టింది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న (బీపీఎల్) కుటుంబాలను నిర్ధారించేందుకు దినసరి ఆదాయం ఎంతుండాలో లెక్క తేల్చలేకపోవడం వల్ల ఆ పథకం నీరుకారింది. అప్పటి ప్రణాళికాసంఘం ఏర్పాటు చేసిన టెండూల్కర్ కమిటీ సిఫార్సులు ప్రహసనంగా తయారయ్యాయి. చౌక డిపోలనగానే రేషన్ కార్డులు అంశం ముందుకు వస్తుంది. రేషన్ కార్డుల వ్యవహారం కందిరీగల తుట్టె వంటిది, బోగస్ కార్డులను ఏరివేస్తున్నామన్న వాగ్దానాన్ని ప్రభుత్వాలు నిలబెట్టుకోలేకపోవడానికి రాజకీయ జోక్యాలే కారణం. రేషన్ బియ్యం, సరకులు చీకటి బజారుకు తరలి పోవడం సర్వసాధారణం అయింది. ప్రభుత్వం ఎంతకట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినా అవి లబ్ధిదారులకు చేరడం లేదు. మన దేశంలో ఆర్నెల్ల నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లల్లో 9 శాతం మందికి మాత్రమే కడుపునిండా తిండిలభిస్తోందని సర్వేలో తేలింది. పేదరికం మగ్గే కుటుంబాలనగానే ముందుగా నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కుటుంబాలు గుర్తుకు వస్తాయి. పెద్ద నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో మగ, ఆడ పనివారు తాము చేస్తున్న పనుల్లోనే పిల్లలను కూడా దింపుతారు. ఆడ, మగ కూలీల రేట్లలోనే తేడాలున్నప్పుడు పిల్లల సంగతి వేరే చెప్పనవసరం లేదు. పిల్లలను పనుల్లోకి తీసుకుని వెళ్ళకుండా నిరోధించేందుకూ, వారిని పాఠశాలలకు పంపేట్టు చూడటానికే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే, ఈ పథకం కూడా సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల నీరుగారిపోయింది. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఈ పథకం సమర్ధవంతంగా అమలు జరుగుతున్న మాటను కాదనలేం. మన దేశంలో 2017-18 సంవత్సరంలో 27.50 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి. మన దేశ జనాభాకు కడుపునిండా తిండికి 23 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు అవసరమని ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) అంచనా వేసింది. అంటే దేశంలో ప్రజల అవసరాలకు మించి ఆహార ధాన్యాల ఉత్పత్తి జరుగుతున్నా అందరికీ అవి చేరడం లేదని స్పష్టం అవుతోంది. పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో కూడా మన దేశం రెండో స్థానంలో ఉంది. పాడి ఉత్పత్తిలో కూడా మన దేశం అగ్రస్థానంలో ఉంది. అయినప్పటికీ, అవి కొన్ని వర్గాల వారికే లభిస్తున్నాయి. ఈ పరిస్థితి ఒక్క రోజులోవచ్చింది కాదు. దశాబ్దాలుగా ఇలాగే జరుగుతోంది. అందుకే, యూపీఏ హయాంలో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సమ్మిళిత అభివృద్ధి గురించి పదే పదే ప్రస్తావించేవారు. సంపద సృష్టి జరుగుతున్నా, అది అందరికీ పంపిణీ కాకపోవడం వల్లే ఈదుస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రధాని మోడీ సరిగ్గా క్విట్ ఇండియా రోజైన ఆగస్టు 9వ తేదీనే ఫిట్ ఇండియా నినాదాన్ని ఇచ్చారు. అంటే దేశంలో అన్ని వర్గాల ప్రజలకు పోషకాహారం అందేట్టు చూడాలని ఆదేశించారు. అలాగే, మన దేశంలో ఆధునిక వైద్యవిధానాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ శిశుమరణాలు హెచ్చుగా ఉంటున్నాయి. 2006లో ప్రతి వెయ్యిమందికి శిశువులు 57 ఉంటే, 2017 నాటికి వారి సంఖ్య 33కి పడిపోయింది. పోషణ్ అభియాన్ కార్యక్రమం కింద శిశుమరణాల సంఖ్య తగ్గించే విషయమై దృష్టిపెట్టాలని ప్రధాని ఆదేశించారు. ఫిట్ ఇండియా కార్యక్రమం ప్రధానోద్దేశ్యం ఇదే. ఈ పథకం క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు జరిగితే దేశంలో పౌష్టికాహార లోపం బాగా తగ్గుతుంది. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం సరఫరా కార్యక్రమం సాగుతోంది. అలాగే, పిల్లలకు పాలు, రొట్టె అందించే కార్యక్రమాలు కూడా అమలులో ఉన్నాయి.

ఈ పథకాలన్నీ మంచివే అయినా, అమలు తీరుపై తగిన పర్యవేక్షణ లేకనే వాటివల్ల లబ్ధిదారులకు ప్రయోజనం కనబడటం లేదు. ఇటీవల నోబెల్ బహుమతి పొందిన అభిజిత్ బెనర్జీ చేసిన సూచన అదే పథకాలను ఎప్పటికప్పుడు ఆరంభ శూరత్వంలా ప్రారంభించడం కాదు, అవి క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు అవుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్న ఆయన సూచన శిరోధార్యమైనది.

# ఆ త్యాగాలకు గుర్తింపేదీ?



21న అమర పోలీసుల సంస్మరణ దినం



ప్రతి ఏటా అమర పోలీసుల సంస్మరణ దినోత్సవం అక్టోబర్ 21న జరగటం విధాయకం. వీర జవానుల త్యాగాలను తలుచుకున్నట్లు వీర పోలీసుల త్యాగాలు తలుచుకోవటం సమంజసం. మంచి రుచి కలిగించిన కూరలో కరివేపాకు తినేటప్పుడు ఉండటం తగదు కదా! కష్టమొచ్చినప్పుడే హాస్పిటల్, పోలీసు స్టేషన్ తలుపు తట్టాం! కానీ కష్టం తీరిన తర్వాత హాస్పిటల్ వాళ్ళను కలిసి కృతజ్ఞతలు చెప్పుకోవటం జరుగుతుంది. పోలీసుల విషయంలో అలాంటి కృతజ్ఞతా భావం వ్యక్తపరచటం ఎప్పుడో గాని జరగదు. కరివేపాకు సామెత పోలీసులకు ఎంతవరకు వర్తిస్తుంది? ఇతర దేశాల్లో పోలీసులు, గౌరవాన్ని, ప్రజల అభిమానాన్ని చూరగొంటారు. నిజానికి అమెరికా పౌరులు పోలీసులను చూసి తరచుగా భయపడ్తానే ఉంటారు. మన దేశంలో పరిస్థితి భిన్నంగా ఉండటం అందరికీ తెలిసిన విషయమే! ఈ మధ్య పోలీసుల వ్యవస్థలో కూడా కొన్ని పరిణామాలు కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి. పోలీసుల్లో కూడా ఆత్మహత్యలు జరుగుతున్నట్లుగా వింటు న్నాం. ఒత్తిడిని తట్టుకోలేక కొందరు అలా చేస్తున్నారన్నది బయటకొచ్చినమాట! ఎంతవరకు నిజం అనేది ఎవరూ లోతుగా తరిచి చూడని విషయంగానే మిగిలిపోయింది. కొందరు విశ్లేషకులు చెప్పిన విషయం ఏమిటంటే ఈ మధ్యకాలంలో విద్యాధికులు ఎక్కువగా పోలీసు ఉద్యోగా ల్లో చేరుతున్నారని, అందువల్ల ఏ చిన్న ఒత్తిడిని సహించలేని స్థితిలో కొందరు ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారని! ఎంతవరకు ఇది నిజమో చెప్పటం కష్టం! కానీ ఇంతకుమునుపు, బ్రిటిషు వారి కాలంలో శారీరకంగా పటిష్టంగా ఉండేవారికే ఈ ఉద్యోగాలు దొరికేవని, తోలు మందంగా ఉంటేనే పోలీసు ఉద్యోగాలకు అర్హత వుండేదని చెప్పుకొనేవారు. గట్టిగా లాఠీ దెబ్బ వేసేవాడినే పోలీసుగా సమాజం గుర్తించేదని, పోలీసుల ఉపయోగం అంతవరకే పరిమితమై ఉండేదని ఆ రోజుల్లో అనుకునేవారు. ఇవ్వాల్టి పరిస్థితి వేరు. సమాజంలో అభివృద్ధి జరగాలంటే శాంతిభద్రతలు అవసరం! పోలీసుల పాత్ర ఆ విధంగా ప్రాముఖ్యతను సంతరించుకొని క్రమేపీ భిన్నమైన రీతిలో పోలీసు ఉద్యోగాల ఎంపిక జరుగుతోంది. ఆర్మీలోని అమరవీరుల త్యాగనిరతిని సేవా తత్పరతను అరమరికలు లేకుండా గుర్తిస్తాం! కానీ పోలీసుల విషయంలో ఆ విధంగా గుర్తించటానికి చాలామంది వెనుకాడుతారు. ఎందుకని ఆలోచిస్తే ఒక వాస్తవం ఒప్పుకోకతప్పదు. జవానుకు శత్రువు ఎవరో తెలుసు! శత్రువును ఎదుర్కోవటమే అతని పని! శత్రువు పని పట్టినప్పుడు ప్రజలు హర్షిస్తారు. ఆ పనిలో ప్రాణాలు కోల్పోయినప్పుడు దేశవాసులు దుఃఖిస్తారు. జవాను త్యాగనిరతిని నిరంతరం కృతజ్ఞతతో గుర్తుంచు కోటానికి ప్రయత్నిస్తారు. పోలీసు పరిస్థితి వేరు. ఇవ్వాళ శాంతిభద్రతలకు భంగం కలిగించిన నాయకుడు రేపు తమ శాఖకు ప్రభుత్వ పరంగా నాయకుడు కావచ్చు! ఇవ్వాళ ఒక సమస్యతో పోలీసు స్టేషనుకు వచ్చినవాడు, రేపు సమస్య రూపంలోనే ఎదురు కావచ్చు! పోలీసులకు ఆధ్యాత్మిక దృక్పథం అవసరం అని తెల్గిగ్గా ఒకాయన ఒక సభలో చెప్పినప్పుడు కొందరు నవ్వారు. మరికొందరు ఎందుకని ప్రశ్నించారు. చెప్పే వ్యక్తి - 'మీరు మరో విధంగా భావించకండి! పోలీసు వాడిని అర్జునుడితో పోలుస్తున్నానని కోపగించు కోకండి! నిజానికి అర్జునుడి పరిస్థితే ఈనాటి పోలీసుది! అలనాడు కురుక్షేత్ర యుద్ధంలో ఆయుధాలు పారేసి - నేను యుద్ధం చేయనని కృష్ణుడికి చెప్తాడు. కారణం - తను ఎవరితో యుద్ధం చేయాలని! ఎదురుగా చూసిన ప్పుడు కనపడింది ఎవరు? తన బంధువులు, మిత్రులు, కలిసి తిరిగినవారేగా! ఇవ్వాళ అదే పరిస్థితి పోలీసుది కూడా! శాంతిభద్రతలు నెలకొల్పేపనిలో ఎదుర్కోవాల్సింది ఎవరిని? తనతో ఇప్పటివరకూ సన్నిహి తంగా ఉన్న ప్రజలనే! ప్రజలలో తనూ, ఒక భాగమే అనే ఎరుక మనసులో ఉన్నప్పుడు సమాజపరంగా మేలు చేకూర్చటానికి ఎందుకు వారిని ఎదుర్కొని ఇబ్బంది కలిగించాలి అనే ఆలోచన రాకమానదు! నిజానికి పోలీసుల కోసమే కృష్ణుడు భగవద్గీతను చెప్పాడేమో అనే ఆలోచన చిన్నపాటి ఆశ్చర్యంతో కూడిన నవ్వు తెప్పిస్తుంది! అర్జునుడి స్థానంలో పోలీసును ఉంచి - 'నీ పని నువ్వు చేయి! ఫలితంతో నిమిత్తం లేదు! నీ విధి నీవు నిర్వర్తించటానికే ఇక్కడ వున్నావు.' అని చెప్పటానికి బాగానే ఉంటుంది. చేయటం ఎంతకష్టం? పోలీసులకు శ్రద్ధపెట్టి పనిచే యటానికి వెసులుబాటు చర్యలు. వర్కింగ్ కండిషన్స్ మెరుగు పర్చటం చాలా అవసరం. చాలా గంటలు పనిచేయాల్సిన పరిస్థితి, వారాంతపు శలవు లేకపోవటం టాయిలెట్ సౌకర్యాలు లాంటివి కూడా సరిగ్గా లేకపోవటం, విశ్రాంతి సౌకర్యాలు చాలా తక్కువగా ఉండటం, పనితీవ్రతతో బాటు అనేక రకాల వృత్తి ఒత్తిళ్ళు - ఎన్నో ఇలాంటివి ఎదుర్కొని పనిచేయాలి! ఒత్తిడి వల్లనే హింసా మార్గాలు అవలంబిస్తున్నారనే ఆరోపణ కూడా పోలీసులు ఎదుర్కొంటున్నారు. జీతభత్యాలు పెంచు తున్నట్లు ప్రతి సంవత్సరం ప్రకటనలు వస్తున్నాయి కానీ వారి పనికి తగ్గ జీతాలు ఇతర సౌకర్యాలు లేవనేది అందరికీ తెల్సిన విషయమే! ఒక పోలీసు వాడి కూతురు దీనంగా చెప్పిన విషయం గుర్తు వుంది- 'మీ ఇరుకు క్వార్టర్‌లో కనీసం నేను నిన్ను చూడటానికే స్థలం లేదు! పెండ్లి చేసుకొని ఏం లాభం?' అన్నాడట పెళ్ళిచూపుల సమయం లో పెళ్ళి కోరుకుంటున్న కుర్రాడు.

పోలీసులకు సమ్మె చేసే హక్కు లేకపోవటం చాలామందికి సమంజసం గానే ఉండవచ్చు! కానీ వారి కోరికలు తీర్చే, వారి సమస్యలు వినే ఒక సంస్థను తీర్చిదిద్ద కపోవటం - అరకొర ఉన్నా ఆమోద యోగ్యంగా ఉండకపోవటం ఒక పెద్ద లోటుగా భావించకతప్పదు. సమ్మెచేసే హక్కు లేకపోయినా కొన్ని రాష్ట్రాల్లో పోలీ సులు చట్టాన్ని కాలరాసి సమ్మెకు తలపడిన సంఘటనలు ఉన్నాయి. గత్యంతరంలేని పరిస్థితిని ఈ వ్యవస్థకు కల్పించకుండా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! ఎన్నో సంస్కరణలు అవసరమని రిపోర్టులు వచ్చినా అవన్నీ అటకెక్కిన విషయం అందరికీ తెలిసిందే! ఉపద్రవం సంభవించినప్పుడే సర్దుబాటు చర్యలు ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌లా తలపెట్టడం అలవాట యింది! ఈ మధ్య 'స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా రిపోర్టు 2019' ఒకటి ప్రకటితమైంది. ఈ రిపోర్టును తయారు చేసిన నిపుణులు వారి సర్వేలో ప్రశ్నించినప్పుడు మేము ఉద్యోగం బాగా చేయాలంటే ఎక్కువమంది స్టాఫ్, ట్రైనింగ్ అవసరం అని చెప్పారట! ఇవి ఎప్పుడూ వినేమాటలే! కానీ ఆచరణలో ప్రభుత్వాలు తలపెట్టున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. ఉద్యోగం అంటే విరక్తిపొం దినవారు - ట్రైనింగ్ ఇచ్చే వారుగా ఆ సంబంధిత ట్రైనింగ్ సంస్థల్లో చూస్తుంటే తలపట్టుకోవటం తప్ప ఎవరు ఏమి చేయగలరు? మంచిగా డ్యూటీ చేస్తున్నవాడికీ, చేయనివాడికీ ఒకే తీరున ట్రాన్స్‌ఫర్స్ వస్తుంటాయి. రాజకీయంగా ప్రభుత్వాలలో మార్పు సంభవించినప్పుడల్లా, మంచి పోలీసు సడెన్‌గా చెడ్డవాడిగా, చెడ్డపోలీసు మంచి పోలీసుగా మారటం ఈ వ్యవస్థలో సర్వసాధారణం! ఎవరికి ఎవరు చెప్పాలి? పోలీసువారు సక్రమంగా డ్యూటీ చేయాలని చెప్పే ప్రభుత్వాలు, సక్రమంగా వారు చేయాల్సిన, లేకపోతే చేయించాల్సిన డ్యూటీ ఎందుకు చేయటం లేదని ప్రజలు అడిగే పరిస్థితి ఎక్కడవుంది? చట్టానికి పోలీసు బాధ్యుడు. కానీ పోలీసు ఆ విధంగా ప్రవర్తిల్లే పరిస్థితి చాలాతక్కువ!

అదృష్టవశాత్తు ఈ సంవత్సరం డ్యూటీలో తెలంగాణాలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు లేకపోవటం ముదావహం. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నిర్దుష్టమైన అమర పోలీసుల సంఖ్య తర్వాత బహిర్గతం అవుతుందేమో! పోలీసులు ప్రజలకు దగ్గర కాకపోవటం అనేది అనేక కారణాలవల్ల! కానీ ఈ సందర్భంగా ఆ చర్చ అప్రస్తుతం! ఎన్ని లోపాలున్నా పోలీసు సంస్థ సమాజానికి అవసరం అనేది నిర్వివాదాంశం! అందుకే విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివా ళులు అర్పిద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో 29మంది పోలీసులు ఈ సం వత్సరం అమరులయ్యారు. ఈ సంవత్సరంలో వివిధ ఘటనల్లో మనదేశంలో 298 మంది పోలీసులు చనిపోయారు.



-రావులపాటి సీతారాం రావు

# జరగాల్సింది భారతీయకరణ

ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వంటి పదాలు విన్పిస్తున్నాయి. ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచం ఒక 'కుగ్రామం'గా మారింది. వివిధ మతాలు, కులాలు, భాషలు, ఆచారాలున్న మనదేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనే మనందర్నీ ఒక జాతిగా నిల్పుతుంది. రాజ్యాంగ నిర్మాతలు 'భారత్'ని ఒక బలమైన జాతిగా మల్చడానికి గట్టి ప్రయత్నాలే చేశారు.



రాజ్యాంగంలో పొందుపర్చబడ్డ ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద భావనలు, ఏక పౌరసత్వం, ఆర్‌బిఐ, సిబిఐ, యుజిసి, కాగ్ వంటి స్వయం ప్రతిపత్తి గల సంస్థలని ఏర్పాటు చేయడం, పంచవర్ష ప్రణాళికల ద్వారా రాష్ట్రాలకు నిధులు కేటాయించడం, వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించి రాయితీలు ప్రకటించడం వంటి చర్యలు ద్వారా ప్రజలలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, అసమానతలని తొలగించడానికి ఆనాటి పాలకులు కృషి చేశారు. నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, 20 సూత్రాల ఆర్థిక పథకం వంటి చారిత్రాత్మక నిర్ణయాలవల్ల కూడా ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలు కొంతమేరకు తగ్గాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో జిఎస్‌టి ని దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టింది. అయితే ఇటీవల గుజరాత్‌లో వలస కార్మికులపై దాడులు, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో 'గోరక్షణ' పేరుతో మైనారిటీలపై దురాగతాలు, కాశ్మీర్‌లో నెలకొన్న ఉద్రిక్తతలు, ఈశాన్య రాష్ట్రాలలో ప్రజలలో ఉన్న భయాందోళనలు, పెరుగుతున్న మతోన్మాదం, శృతి మించిన ప్రాంతీయ అభిమానం, భాషోన్మాదం వంటి సంఘటనలు భిన్నత్వంలో ఏకత్వమనే విలక్షణమైన భావనని బలహీన పరుస్తున్నాయి. కేంద్రంలో దక్షిణాదివారికి నామమాత్రపు పదవులు లభించడం వల్ల కూడా రాజకీయ సమైక్యత లోపిస్తుంది. జాతీయ సమైక్యతని ప్రజలలో పెంపొందించాలంటే ముందుగా ప్రజలలో భావ సమైక్యత పెరగాలి. మన జాతిలో అనైక్యతని పోగొట్టి ఐక్యపర్చడానికి ప్రభుత్వం జాతీయ సమైక్యతా మండలిని స్థాపించింది. అంబేద్కర్ హైదరాబాద్‌లో రెండవ రాజధానిని ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ సమైక్యతని మరింత పెంచవచ్చునని సూచించారు. సుప్రీం కోర్టు బెంచ్‌ని చెన్నైలో ఏర్పాటు చేయడం ద్వారా అత్యున్నత న్యాయవ్యవస్థని ప్రజలకు మరింత దగ్గర చేయవచ్చు. ప్రాంతీయ భాషలలో ఉన్న రచనలని హిందీలోకి పెద్ద ఎత్తున అనువదించడానికి కేంద్రం భారీగా నిధులు కేటాయించాలి. ఫలితంగా భాషాసమైక్యత ఏర్పడుతుంది. ఈజిప్ట్‌లో పిరమిడ్లని, చైనాలో చైనా గోడని ఆ దేశ పాలకులు, ప్రజలు కాపాడుకుంటున్నారు. మనదేశంలో చారిత్రక కట్టడం తాజ్‌మహల్ కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. తాజ్‌ని రక్షించాల్సింది పోయి కొందరు వివాదాస్పదంగా చేస్తున్నారు. పట్టణాలు, పథకాల పేర్లు మార్చినంత మాత్రాన భారతీయకరణ జరగదు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ వాటి మధ్య సమన్వయం పెంచితేనే ప్రజలకు నిజమైన న్యాయం జరుగుతుంది. తద్వారా రాజ్యాంగం రక్షించబడుతుంది. 135 కోట్ల మందికి పైగా జనాభా ఉన్న మనదేశంలో సత్ఫలితాలని వెంటనే ఆశించలేము. నిజమైన భారతీయకరణ అనేది మెజారిటీ, మైనారిటీ మతస్థుల మధ్య సమన్వయంతోనే సాధ్యమౌతుంది. భారతదేశం అన్ని ధర్మాలని స్వాగతిస్తుందని అన్న వివేకానందుని మాటలు నేటి పాలకులకి స్ఫూర్తి కావాలి. మతం తలవక, గతం తడవక, ద్వేషం, రోషం సకలం మరచి, అమోఘ శక్తుల సమీకరించుక, సమస్త భారత సమైక్య మెంచుక, హిమాద్రి మొదలు కుమారి వరకు భారత విజయం పాడండి అన్న వేదుల సత్యనారాయణ శాస్త్రి మాటలని ప్రజలు పాటించాలి. అప్పుడే సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వ సంపద నాకు గర్వకారణమన్న పైడిమర్రి వెంకట సుబ్బారావు గారి మాటలు నిజమౌతాయి.

-యం.రాంప్రదీప్
9492712836

# రైతులకు పొంచి ఉన్న విపత్తు!

వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులు బయటపడడానికి మూలకారణాల్ని ప్రభుత్వాలు గుర్తించలేకపోతున్నాయి. రైతుల ఆర్థిక స్థితిగతుల్ని మెరుగు పరిచేందుకు రాయితీల విస్తృతి పెరుగుతున్నా అవి రైతుల కష్టాలు తీర్చ లేకపోతున్నాయి. అధికసంఖ్యాకులు ఇప్పటికీ వ్యవసాయాన్నే జీవనాధారంగా బతుకులీడుస్తున్న ప్రజాస్వామ్య దేశం మనది. వ్యవసాయ విధానాల రూపకల్పన ప్రక్రియలో రైతులు, విధాన కర్తల మధ్య తగినంత చర్చజరగడం లేదు. కావున విధాన కర్తలుగా రైతాంగానికి రిజర్వేషన్ ద్వారా ప్రాతినిధ్యం ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వాలు ఇచ్చే ఋణమాఫీ, రైతు బంధు లాంటి వాటితోపాటు గిట్టుబాటు ధర నందించ డంలో చొరవచూపాలి. ఎం.ఎస్. స్వామినాథన్ సిఫారసుల్ని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుకు పూనుకుంటేనే సంక్షోభంలో చిక్కిన రైతుల్ని బయట పడేసి వ్యవసాయాన్ని ఆర్థికంగా లాభసాటిగా మార్చగలరని గమనించండి. అప్పుడే యువరైతులు ఈ రంగానికి ఆకర్షితులౌతారు. ప్రధానంగా పంటల మద్దతుధర నిర్ధారణ ఎం.ఎస్.స్వామినాథన్ సూచించిన ఫార్ములా... ''సీ 2 ప్లస్ 50 శాతం'' సేకరణ ధర అత్యంత ఆమోదయోగ్యమైన విధానం. రైతుల ఆర్థిక స్థితిగతులు మార్చగల వీరి సిఫారసుల్ని అమలు చేయకపోవడాన్ని ఎలా భావించాలి. అన్ని దశల్లోనూ దోపిడీ, కల్తీ చేస్తూ రైతులకు గిట్టుబాటు ధర లేకుం డా పోతుంటే పాలకులు, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహ రిస్తున్నారు. స్వార్థ వ్యాపారవర్గాల కల్తీ (నకిలీ)ల లీలలు పుట్టగొడుగుల్లా పెరిగిపోవడం, పురుగుమందుల ఉత్పత్తులు రైతులను నష్టాల బారిన పడేయడంతోపాటు పర్యావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నాయి. పంటలకు పర్యావరణానికి మేలుచేసే కోట్లాది సూక్ష్మజీవులు భూమిలోనూ, ప్రకృతిలోనూ ఉంటాయి. వీటికి హాని కలిగించే లామ్డాసైహాలత్రిన్, సైపర్ లాంటి ప్రమాదకర రసాయనాలను కలిపి బయోమందులు తయారు చేస్తున్నారు. దీనివలన పంటకు మేలుచేసే మిత్ర పురుగులు నశించి చీడపీడలను అదుపు చేయలేని స్థితివలన దిగుబడులు తగ్గుతున్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. పత్తి రైతులకు నష్టాలు విత్తనాల విక్రయంలో అధిక ధరలు నకిలీల బెడద నుండి మొదలై మార్కెట్లో మద్దతు ధర ఇచ్చేవరకు అన్ని స్థాయిల్లోనూ దోపిడీకి గురవుతున్నారు. చరిత్రలోనే అత్యధికంగా 46.92 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారు. ఈ పంటకు మద్దతు ధర ఇప్పించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అన్నదాతలకు చేరడం లేదు. ఈ ఏడాది పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.5,550/- గా కేంద్రం నిర్ణయించింది. కొత్త పత్తిపంటను రైతులు మార్కెట్టుకు తేవడం మొదలైంది. తీరా తొలిపంట ఉత్పత్తికి మార్కెట్‌లో మద్దతు ధరను వ్యాపారులు చెల్లించిన దాఖలాలు లేవు. ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్తపత్తికి మద్దతు ధర లేకపోవడాన్ని బట్టి చూస్తే పంటల దిగుబడి పూర్తిస్థాయిలోకి వచ్చాక రైతులకు మద్దతు ధర లభించడం ఎండమావుల్లో నీళ్లను వెతుక్కున్నట్లేననిపిస్తుంది. మార్కెట్‌లో కనిష్టంగా



క్వింటాలుకు రూ.4,221 నుండి గరిష్టంగా రూ.5211 వరకు అతికష్టంమీద చెల్లిస్తున్నారు. దూదిలో తేమ (పేరా) సాకుతో ధరను వ్యాపారులు బాగా తగ్గిస్తున్నారు. ఇక పత్తిరైతు క్వింటా పత్తి పంటకు సాగు వ్యయం రూ.9502 గా అంచనా వేశారు. వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి తెలిపిన ప్రకారం 2017- 18లో 51-95 లక్షల టన్నుల పత్తి పంట దిగుబడి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఈ ఏడాది ఎక్కువగా రానుందని తెలుస్తోంది. రైతులు పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాల్సి ఉంది. తను పండించిన పంటకు తానే ధరను నిర్ణయించుకోలేని స్థితిలో చట్టాలు చేసి పాలకులు సాగిస్తున్నారు. రాయితీలు మాత్రమే కాదు? మార్కెట్ల మాయాజాలం, కల్తీ విత్తన, పురుగు మందులు ఇలా అన్ని స్థాయిల్లో దోపిడీని నివారించినప్పుడే రైతులు వ్యవసాయం చేయగలుగుతారు. ఈ సంవత్సరం భారీగా పత్తి ఉత్పత్తి రాబోతున్న వేళ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకోకపోతే చాలా విపత్కర పరిస్థితికి కారకులౌతారని గమనించండి. రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పెట్టుబడికి కనీసం 150 శాతం వచ్చేలా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించాలి. ఆ ధరకు మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేయని యెడల ఎలాంటి షరతులు పెట్టకుండా రైతుల వద్దనుండి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి. రైతు పెట్టుబడికి - మద్దతు ధరకు మధ్య క్వింటాలుకు రూ.4000/- రైతే వ్యవసాయం చేయడం వలన నష్టపోతున్నందువల్లనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కార్పొరేట్ శక్తులకు దేశీయ వ్యవసాయాన్ని ధారాదత్తం చేయాలనే స్వార్థపరమైన కుట్ర జరుగుతోంది. ఏ ఒక్కరు ఏ ఒక్క వస్తువు ఉత్పత్తి అయిన అమ్మకం జరగని మధ్యకాలంలో నష్టం జరిగితే ఈ ప్రభుత్వమే బాధ్యత వహించి ఉత్పత్తికి అండగా నిలబడాలని రాజ్యాంగం చెప్పింది. అన్ని ఉత్పత్తులకు అండగా ఉంటున్న పాలకులు రైతు ఉత్పత్తులకు ఎందుకు అండగా ఉండరు. రైతుకు ఏదో ఉదారంగా ఇచ్చినట్టు కేంద్రం మద్దతు ధర రూ.100 - 200 పెంచుతూ పోవడం భావ్యం కాదు. రైతు ఆత్మహత్యలను నివారించాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులదే.

-మేకిరి దామోదర్
9573666650

# 'జల్.. జంగల్.. జమీన్' సాకారమెప్పుడు?



నేడు కుమ్రం భీం వర్ధంతుత్సవాల ముగింపు

తెలంగాణ ప్రభుత్వం 2014లో ప్రభుత్వ ఉత్తర్వు నెం.87 ద్వారా కుమ్రంభీం 1940, అక్టోబర్ 8న వీరమరణం పొందినట్లు గుర్తించింది. ఆదివాసీలు మాత్రం తమ ఆచారాల ప్రకారం భీం దాదా వర్ధంతుత్సవాలను ప్రతీ ఏటా ఆశ్వీజ మాసంలో శుద్ధ పౌర్ణమి నుండి వారం రోజులపాటు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కాని వాస్తవానికి ఉద్యమ ఫలితాలు భీం వారసులం'దరి'కీ చేరటం లేదు. భవిష్యత్తులో కుమ్రంభీం లాంటి ఆది అమరుల చరిత్రలు అజ్ఞాతంలోనే అదృశ్యమౌ తున్నాయి. భవిష్యత్తరాలకు జీవిత పాఠాలుగా, కనీసం పుస్తక రూపానికి నోచుకోవటం లేదు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా అట్టడుగు వర్గాల చరిత్ర, జీవన విధానం, సంస్కృతులను 'తెర'కెక్కించిన సందర్భాలు మహా అరుదుగా కన్పిస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోండు తెగ గిరిజనుల సంస్కృ తి సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ, అడవి బిడ్డల హక్కులైన 'జల్ - జంగల్ - జమీన్' కోసం ప్రాణాలర్పించిన ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రంభీం పోరాట గాథను 'కొమరంభీం' చిత్రంగా 1990లో తెరకెక్కించారు. 1991లో నంది అవార్డును సొంతం చేసుకున్న ఆ చరిత్రాత్మక చిత్రం 20 ఏళ్ళ అజ్ఞాతంలో అనేక ఆటంకాలను, వివక్షను ఎదుర్కొని 2010, జులై 2న విడుదలైంది భీమ్ దాదా వాస్తవ ఉద్యమ చరిత్రలోని కొన్ని ప్రధాన ఘట్టాలను ఈ వ్యాసం ద్వారా తెలుపు తున్నాను. నాటి నిజాం నిరంకుశ పాలనలో గోండు యోధుడైన కుమ్రం భీం నిజాం నవాబులను ముప్పుతిప్పలు పెట్టాడు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా, ఆదివాసీల స్వయం పాలన, 'జల్ - జంగల్ - జమీన్' నినాదంతో పదేళ్ళకు పైగా 1931 నుండి 1940, అక్టోబర్ దాకా ఆయన నేతృత్వంలో సాగిన జోడేఘాట్ తిరుగుబాటు మహోజ్వల చరిత్రగా నిలిచింది. తెలంగాణాలో నైజామ్ నవాబులను ఎదిరించిన కుమ్రంభీం దేశం గర్వించదగ్గ తెలంగాణ లెజెండ్. కుమ్రంభీం తన ఉద్యమ ఘట్టం లోనే చదువు నేర్చుకున్నాడు. భీమ్ వద్ద హవల్దార్‌గా చేసిన కుమ్రం సూరు దగ్గరుండి భీమ్‌కు అక్షరాలు నేర్పిస్తూ, ఉద్యమ వ్యూహాలను రచించేవాడు. ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలైన జోడేఘాట్, బాబేజరీ, పట్నాపూర్, టోకెన్నావాడ, చల్బరిడి, శివగూడ, బీమన్‌గొంది, కల్లేగావ్, అంకుతాపూర్, నర్సాపూర్, కోశగూడ, లైన్‌వటల్ అనే 12 గూడే లకు స్వయం పాలన కావాలని భీమ్ పట్టుపట్టాడు. చివరకు కుర్ధు పటేల్ అనే ద్రోహి సమాచారంతో జోడేఘాట్ గుట్టల్లో రాత్రి జరిగిన కాల్పుల్లో 1940, అక్టోబర్ 8న కుమ్రంభీం వీర మరణం పొందారు. భీమ్ దాదా సాహసం, సంకల్పబలం, గొప్ప త్యాగం గోండు సమాజం నుంచి ప్రపం చానికే చాటి చెప్పింది. ఇంగ్లాండ్ నుండి హైదరాబాద్ వచ్చిన ఆంత్రోపాలజిస్టు ప్రొఫెసర్ హైమండార్ఫ్ ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గోండు, కోలాం, కోయ, పర్ధాన్, నాయకపోడు తెగల గిరిజనులతో మమేకమై, పరిశోధన చేసిన ఫలితంగానే వారు బాహ్య ప్రపంచానికి తెలిశారు. భీమ్ దాదా పోరాట ఫలితమే డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజనులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

నాటి నిజాం పాలనలో ఆదిమ ప్రజలు ఏజెన్సీ గూడేల్లో పెత్తందార్ల దోపిడీ, రజాకార్ల అకృత్యాల నడుమ భూపోరాటం, స్వయం పాలన ఉద్యమాలు చేశారు. భీమ్ పోరాటానికి తోడుగా ఇద్దరు వ్యూహకర్తలున్నారు. జోడేన్‌ఘాట్ గుట్టల్లో భీమ్‌కు కుడి భుజంగా కుమ్రం సూరు తుడుందెబ్బ మోగిస్తే, అతని ఎడమ భుజంగా తూటు కొమ్ముతో పోరాట ధ్వనిని పొలిమేరల్లో ఉన్న 12 గ్రామాల్లో ప్రతిధ్వనింపజేసింది మాత్రం వెడ్మరాము. ఆదివాసీల ఆశాజ్యోతి భీమ్ దాదా 'గోండు' యోధుడైతే, కుమ్రం సూరు 'కోలాం' కొదమ సింహం, వీరిద్దరికీ 'తోటి' (తెగ) వాద్య ప్రచారకుడు వెడ్మరాము.

-గుమ్మడి లక్ష్మీనారాయణ
8341992771

epaper.prabhanews.com

# రాస్తారోకోలు... బైక్ ర్యాలీలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- నల్గొండలో తమ్మినేని, చౌటుప్పల్‌లో రేవంత్‌రెడ్డి సంఘీభావం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మె 14వ రోజు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, బైక్‌ర్యాలీ లు కొనసాగాయి. శనివారం నాటి బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలను కోరుతూ ఆర్టీసీ కార్మికులు, న్యాయవాదులు, అఖిలపక్షం నేతలు బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా బస్ డిపోల ఎదుట కార్మికులు ధర్నాలు, బైఠాయింపులు జరిపారు.

శనివారం నాటి రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ, అఖిలపక్షజేఏసీ బైక్ ర్యాలీ చేపట్టింది. టీజేఎస్ అధ్యక్షులు ప్రొ. కోదండరాం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అడ్డుకున్న పోలీసులు ప్రొ. కోదండరాంతోపాటు కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి తదితరులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. జీడిమెట్లలో ఆర్టీసీ కార్మికులు బస్‌డిపో ఎదుట బైఠాయించారు. హిమాయత్ నగర్‌లో సీపీఐ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. నారాయణగూడ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నిరసన ప్రదర్శన నిర్వహించింది. నాంపల్లి నుంచి బస్‌భవన్ వరకు బైక్ ర్యాలీ చేపట్టిన న్యాయవాదులను పోలీసులు అరెస్టు చేశారు. పాతబస్తీలో ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వీ. హనుమంతరావు(వీహెచ్) పాల్గొన్నారు. బుల్లెట్‌ను నడుపుతూ అందరినీ ఆకట్టుకున్నారు. వరంగల్‌లోని కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి ఏకశిలా పార్కు వరకు ఆర్టీసీ కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. పరకాలలో ఆర్టీసీ కార్మికులు తాత్కాలిక డ్రైవర్లను అడ్డుకున్నారు. హుజూరాబాద్‌లో జాతీయ రహదారిపై ఆర్టీసీ కార్మికులు అఖిలపక్ష నేతలు రాస్తారోకో నిర్వహించారు. జగిత్యాలలో బస్ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మెట్‌పల్లిలో కార్మికుల నిరసనల్లో అఖిల పక్ష నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. సిరిసిల్ల లో బీజేపీ, న్యాయవాదులు ర్యాలీలో పాల్గొని కార్మికులకు మద్దతు ప్రకటించారు. నిజామాబాద్‌లో ఆర్టీసీ డిపో-2 నుంచి ధర్నాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. భువన గిరి-యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ఆర్టీసీ కార్మికుల నిరసనలకు కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఆర్టీసీ సమ్మెను పరిష్కరించి, పాఠశాలలు తెరిపించాలని చిన్నారి విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. నల్గొండలో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా సీపీఎం దీక్షలు చేపట్టగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని సంఘీభావం తెలిపారు.నారాయణపేట జిల్లా మక్తల్‌లో సమ్మెకు మద్దతుగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. సంగారెడ్డి, జహీరాబాద్ లలో కార్మికులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. నిర్మల్ బస్ డిపో ఎదుట కార్మికులు బైఠాయించి, ర్యాలీ తీశారు. శనివారం నాటి రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలు, వ్యాపారస్థులను కోరారు. ఆదిలాబాద్ జిల్లా మందమర్రి, ఇచ్చోడలో కార్మికులు బైక్ ర్యాలీలు, డిపోల ముందు బైఠాయింపు జరిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, భూదాన్‌పోచంపల్లిలో కార్మికులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. నిర్మల్ బస్‌డిపో వరకు బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. డిపోలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టు ముందు ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా న్యాయవాదులు ర్యాలీ, రాస్తరోకో నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా కార్మికులు అడ్డుకోవటంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా ఖమ్మంలో జరిగిన నిరసనల్లో సింగరేణి కార్మికులు పాల్గొని మద్దతు తెలిపారు. జిల్లాలో పలు చోట్ల జరిగిన నిరసనల్లో సీపీఐ, బీజేపీ అఖిలపక్షం నేతలు పాల్గొన్నారు.

### భారత్ బంద్‌కూ పిలుపునిస్తాం: సీఐటీయూ

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు ఏకే. పద్మనాభన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌వీకేలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్మిక చట్టాల్లో ఎక్కడా సెల్ఫ్ డిస్మిస్ ప్రస్తావన లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల పోరాటం దేశవ్యాప్త పోరాటం అయిందని వ్యాఖ్యానించారు. అవసరమయితే భారత్ బంద్‌కు కూడా పిలుపునిస్తామని ప్రకటించారు. కాగా... ఎస్‌వీకే నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించే ముందు టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం మాట్లాడుతూ... ప్రభుత్వం నిరంకుశ పోకడలు పోతోందని విమర్శించారు. సమ్మె 14వరోజుకు చేరినా, కోర్టు ఆదేశించినా చర్చలు ప్రారంభించకపోవటం దారుణమన్నారు. ఆర్టీసీకి ఎండీని కూడా నియమించకపోవటం సరికాదన్నారు. శనివారం నాటి రాష్ట్ర బంద్ విఫలం ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అణగదొక్కుతారని ప్రజలను హెచ్చరించారు. కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ... ఆర్టీసీని ప్రైవేటీకరించనన్న సీఎం కేసీఆర్ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తే కదా విలీనం సాధ్యమో, కాదో తేలేది అని అన్నారు. మరో కార్మిక నేత రాజిరెడ్డి మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగాల్లో చేరొద్దని నిరుద్యోగులను కోరారు.

## ప్రలోభాలకు లొంగొద్దు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రభుత్వ పెద్దల చూపించే ప్రలోభాలకు లొంగవద్దని, టీఎన్జీఓ, టీజీఓ సంఘాల నేతలు ఆర్టీసీ కార్మికులకు ఆలస్యంగానైనా మద్దతు ఇచ్చారని, సమ్మె విజయంవంతం అవుతుందని ఏఐసీసీ అధికార ప్రతినిధి మధు యాష్కీగౌడ్ అన్నారు. ఈ సమ్మె కేవలం 50వేలమంది ఆర్టీసీ కార్మికులది కాదని, యావన్మంది తెలంగాణ ప్రజలదని ఆయన న్నారు. పదవుల ఎరలకు లొంగకుండా అన్ని ఉద్యోగ సంఘాలు కార్మికుల పక్షాన ఉండాలని కోరారు. తెలంగాణ ప్రజలందరూ మలి దశ ఉద్యమానికి సిద్ధం కావాలని, శనివారం తలపెట్టిన ఆర్టీసీ బంద్‌కు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కేసీఆర్ విధానాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని, ఆర్టీసీలో నష్టాలంటూ కట్టుకథ చెబుతున్నారని ఆయన ఆరోపించారు. పొరుగు రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారుతూంటే, స్వరాష్ట్రంలోని కార్మికులను ఉద్యోగాల్లోంచి తొలగించే ప్రయత్నం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు.

## ఆర్టీసీలో కార్మిక సంఘాలుంటే తప్పేంటి?



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రభుత్వ ఉద్యోగులకు సంఘాలు ఉన్నప్పుడు.. ఆర్టీసీ కార్మికులకు ఉంటే తప్పేంటని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడారు. తెలంగాణలో దొరల, నియంత పాలన సాగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్‌పరం చేస్తున్నారని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంపై గతం లో ఆరోపణలు చేసిన కేసీఆర్.. ఇప్పుడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. సమ్మె మొదలై రెండు వారాలు గడుస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణ మన్నారు. కార్మికుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## చర్చలు జరపండి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని, విపక్షాల సలహాలు తీసుకుంటే మేలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సూచించారు. ఆర్టీసీ నుంచి ప్రభుత్వం తీసుకునేది ఎక్కువని.. తిరిగి ఇచ్చేది తక్కువని అన్నారు. నియంతల్లా వ్యవహరిస్తే పరాభవం తప్పదని అన్నారు. ఫామ్‌హౌజ్, ప్రగతి భవన్, పబ్లిక్ మీటింగ్‌లకే పరిమితమైంది సీఎం కేసీఆర్ ఒక్కరేనని ఆయన వివరించారు. ఆర్టీసీ అమర వీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ ఆస్తుల రక్షణకు అంతా కలిసిరావాలి



- నేటి బంద్‌కు సంపూర్ణ మద్దతు
- లేదంటే ఇతర సంస్థలకూ ఆర్టీసీ గతే పడుతుంది
- మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం జడ్పీసెంటర్, (ప్రభ న్యూస్) :** ప్రభుత్వ ఆస్తులను, ఆర్టీసీని రక్షించేందుకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని, ఆర్టీసీ కార్మికుల జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో నేడు నిర్వహించే రాష్ట్రబంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సీఎల్పీ నేత, మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు చేస్తున్న సమ్మె 14 రోజులు అయినప్పటికీ సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 50 వేల మంది ఆర్టీసీ కార్మికులు ఆకలిదప్పులతో అలమటిస్తుంటే కేసిఆర్ తనకేమి పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేశవరావు మూడురోజుల క్రితం ఆర్టీసీ కార్మికుల పట్ల మొసలికన్నీరు కార్చారని, ఆయన మాటలను సీఎం కేసీఆర్ అసలు పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. కేశవరావు లాంటి వ్యక్తి మాటలకే విలువ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ సంస్థను నిండా ముంచి అప్పుల ఊబిలో మునిగేలా చేశారని, దీనికి కారణం కేసీఆర్ ఆర్థిక విధానాలే అని దుయ్యబట్టారు. ఆర్టీసీ బాటలోనే సింగరేణి లాంటి సంస్థలు నిండా మునిగే ప్రమాదం దాపురించిందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన స్తంభించిందని, కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంచెలవారీగా కేంద్రం, గవర్నర్‌ను కలుస్తామన్నారు. శనివారం నిర్వహించే రాష్ట్రబంద్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా సంపూర్ణంగా పాల్గొనాలని ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ సంక్షోభం తప్పదు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం వచ్చే అవకాశం ఉందని, అదే జరిగితే తీవ్ర పరిణామాలు తప్పవని, దానికి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహించాలని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. శుక్రవారం ఆయన టీజేఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెను, నేటి బంద్‌ను విజయవంతం చేసుకోవడం తెలంగాణ ప్రజలందరి అవసరమని, అన్ని వ్యాపార సంస్థలు, ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో ఇంత ఆందోళన జరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడం దురదృష్టకర మన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, ప్రజారవాణ వ్యవస్థను కాపాడుకుందామనే నినాదంతోనే పనిచేయాలని రాజకీయ పార్టీలు సిద్ధమైనాయన్నారు.

## ప్రభుత్వం స్పందించాలి: రాగాటి సత్యం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు రాగాటి సత్యం మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, కొండూరు రాజెల్లయ్య మాదిగ, బీఎన్ రమేష్ మాదిగ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన బంద్‌కు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని ఆయన తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ కేడర్ ఆందోళన కార్యక్రమాలు చేపట్టిందని ఆయన తెలిపారు. బంద్‌లో కూడా ఎమ్మార్పీఎస్ కీలకంగానే ఉంటుందని ఆయన వివరించారు.

## బంద్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల జేఏసీ శనివారం తలపెట్టిన రాష్ట్రబంద్ సందర్భంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలోని ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌ల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఆయా డిపోలు, బస్టాండ్‌ల వద్ద బంద్ సందర్భంగా ఉద్రిక్తతలు తలెత్తిన సందర్భంలో అదుపు చేయడానికి అదనపు వాహ నాలను సిద్ధం చేస్తున్నారు. ఇటు ఆర్టీసీ కార్మికుల జేఏసీ, అటు ప్రభుత్వం మెట్టుదిగడం లేదు. ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళతామని ఆర్టీసీ కార్మికుల జేఏసీ చెబుతూనే తాము ప్రకటించిన కార్యాచరణ ప్రకారమే శనివారం బంద్ కొనసాగుతుందని ప్రకటించింది. ప్రజా, విద్యార్థి సంఘాలు, విపక్షాలు ఆర్టీసీ కార్మికులకు మద్దతును తెలిపాయి. లాయర్లు సైతం ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అన్ని వర్గాల మద్దతు కోసం ఆర్టీసీ కార్మికుల జేఏసీ ప్రయత్నిస్తోంది. దీంతో శుక్రవారం పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం నాడు బంద్‌ను విజయవంతం చేయాలని ఇందుకు చిన్న చిన్న షాపులు, దుకాణాలు వారితో సహా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్టీసీ కార్మికుల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఓయూ విద్యార్థి జేఏసీలు కూడా బంద్‌కు మద్దతునిస్తున్న సందర్భంలో ఉస్మానియా యూనివర్సిటీ వద్ద అదనపు బలగాలను మోహరించారు. హైదరాబాద్ బస్ భవన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆర్టీసీ కార్మికులను ఆదుకోండి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణాలో ఉద్ధృతమైన ఆర్టీసీ కార్మికుల సమ్మె వ్యవహారంలో వెంటనే జోక్యం చేసుకుని వారి కుటుంబాలను కాపాడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ జాతీయ మానవ హక్కుల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజా, నారాయణ ఎన్‌హెచ్ ఆర్సీకి లేఖ రాశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, డీజిల్‌పై వ్యాట్‌ను రద్దు చేయాలనే కార్మికుల న్యాయపరమైన డిమాండ్‌పై స్పందించాలని లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం నారాయణ తెలంగాణా భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ఆర్టీసీ వ్యాపార సంస్థ కాదని, ప్రజా రవాణా వ్యవస్థపై వ్యాట్ వేయడమేంటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణా సీఎం కేసీఆర్ మానవ హక్కులను, కార్మికుల ప్రధాన హక్కులనూ కాలరాశారని నారాయణ విమర్శించారు. కేసీఆర్ అధికార పగ్గాలు చేపట్టడానికి ఒకప్పుడు ఆర్టీసీ కార్మికులు చేసిన సకల జనుల సమ్మె పాత్ర కూడా ఉందని ఆయన గుర్తు చేశారు.

## న్యాయవాదుల నిరసన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేశారు. శుక్రవారం నాంపల్లి కోర్టు ప్రాంగణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, మోటార్ సైకిళ్ళపై ర్యాలీగా బస్‌భవన్‌ను ముట్టడించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి నేతృత్వంలో న్యాయవాదులు బస్‌భవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల జేఏసీనేత, టిపిసిసి లీగల్ సెల్ అధ్యక్షుడు కె. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు న్యాయవాదులు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న ఆర్టీసీ యూనియన్ కూడా సమ్మెలో ఉందన్నారు. సమ్మెకు నోటీసు ఇచ్చే కార్మికులు సమ్మెకు దిగారని, ఈ సమ్మెను అక్రమమని పేర్కొనడం కూడదన్నారు.

## సీసీఎస్ ఉద్యోగుల వంటావార్పు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు సహకార సంస్థ (సీసీఎస్) స్టాఫ్ యూనియన్ వంటావార్పు కార్యక్రమం నిర్వహించింది. శుక్రవారం సొసైటీ కార్యాలయం బయట రోడ్‌పక్కన ఉద్యోగులు వంటావార్పు నిర్వహించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. ఎ. మురళీ మోహన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగుల పొదుపు సహకార సంస్థ నుంచి ప్రతీనెల డబ్బులు, పీఎఫ్ డబ్బులను తీసుకుంటుందని, అవే డబ్బులను తిరిగి జీతాల కింద చెల్లిస్తుందని చెప్పారు. ఉద్యోగుల పొదుపు సంఘానికి ఆర్టీసీ యాజమాన్యం రూ.540 కోట్ల బకాయి పడిందని, దీంతో తొమ్మిది నెలలుగా రుణాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.

# రైతన్నపై 'సమ్మె'ట

- ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌పై మొదలైన ఆందోళన
- ఎక్కడికక్కడ స్తంభించిన వ్యవసాయోత్పత్తుల రవాణా
- కూరగాయల సైతం తరలించలేని స్థితిలో అన్నదాతలు
- ప్రైవేటు డ్రైవర్లంతా తాత్కాలికంగా ఆర్టీసీలో విధులు
- స్తంభించిన ట్రక్కులు, లారీలు, ట్రాలీ ఆటోల రవాణా
- కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌పై ఆర్టీసీ సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఇప్పటికే అక్కడక్కడ మార్కెట్‌లోకి వస్తున్న ఉత్పత్తులను తరలించేందుకు రవాణా వ్యవస్థ అందుబాటులో లేకుండా పోయింది. ఆర్టీసీ కార్మికులు ఈ సమ్మెలో ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ప్రభుత్వం ప్రైవేట్ డ్రైవర్లను తాత్కాలిక ప్రాతిపదికపై ఉద్యోగాల్లోకి తీసుకుంటోంది. దీంతో లారీలు, ఆటోలు, ట్రాక్టర్లు, ట్రక్కులు నడిపేవారు, ఆర్టీసీ విధుల్లో చేరారు. దీంతో నిత్యం గ్రామాల నుంచి కూరగాయలతో పాటు వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను పట్టణాల్లోని మార్కెట్లకు తీసుకువచ్చే రవాణా వ్యవస్థ స్తంభించింది. సొంత వాహనాలు ఉంటే తప్ప రైతులు తమ పంటలను అమ్ముకోలేని దుస్థితి నెలకొంది. సమ్మె కారణంగా డ్రైవర్ల కొరత తీవ్రం కావడంతో ప్రధానంగా వ్యవసాయ మార్కెటింగ్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా రవాణాకు ప్రత్యామ్నాయంగా రకరకాల మార్గాలు ఉన్నప్పటికీ సరుకు రవాణా మాత్రం ఎక్కడికక్కడ స్తంభించింది. దీంతో కొన్ని రకాల నిత్యావసర వస్తువులకు కొరత ఏర్పడుతోంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే కూరగాయల ధరలు ఈ సమ్మె కారణంగా అమాంతం పెరిగిపోతున్నాయి. కొన్ని వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ అద్దె దాదాపు రెండింతలు తీసుకుంటున్నారు. ఈ ప్రభావం రైతులపై తీవ్రంగా కనిపిస్తోంది. పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవడానికి వెళ్ళడం గగనమైపోతోంది. రవాణా వ్యయం తడిసి మోపెడవుతుండడంతో పంట గిట్టుబాటు కావడం లేదు. అదే సమయంలో సామాన్య, మధ్య తరగతి వర్గాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనక తప్పడంలేదు. పెరిగిన ధరల ప్రభావం వారి కుటుంబ ఆర్థిక వ్యవస్థపైనా చూపుతోంది.

### కోతలకు రెడీ... వాహనాలు ఏవీ?

ఇదిలా ఉంటే, రెండు, మూడు రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పరిస్థితి మరెలా ఉంటుందోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలే పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం కష్టమవుతుంటే అందుకు తోడు ప్రస్తుతం సమ్మె కారణంగా రవాణా ఛార్జీలు రెండు నుంచి మూడు రెట్లు పెరగడం భరించలేని భారంగా మారుతోంది. కొన్ని రకాల ఉత్పత్తులకైతే మార్కెట్లకు తరలించేందుకు భారీ వాహనాలు అవసరమవుతా యి. పెద్ద మొత్తంలో ఉత్పత్తయ్యే వరి, పత్తి, ఉల్లి పంటల విషయంలో రవాణానే అత్యంత కీలకం కానుంది. ఈ ఏడాది వ్యవసాయ అధికారుల అంచనాల నుంచి రాష్ట్రంలో వరి విస్తీర్ణం సాధారణంకన్నా దాదాపు లక్షన్నర ఎకరాలు పెరిగింది. అదే సమయంలో పత్తి సాధారణంకన్నా నాలుగు లక్షల ఎకరాలకు అధికంగా విస్తరించింది.

ప్రస్తుతం అత్యంత ప్రధానమైన ఈ రెండు పంటలు కోత దశకు చేరుకున్నాయి. రెండు, మూడు రోజుల్లోనే మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేసుకుంది. పత్తితో పాటు ధాన్యం, పప్పు ధాన్యాలైన పెసర, మినుము, ఉలవలు, కందులు, నూనె గింజలైన పొద్దు తిరుగుడు, సోయా తదితర పంటల కొనుగోలుకు ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థలు, రైస్‌మిల్లర్లు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. పత్తి కొనుగోళ్ళలో కీలక భాగస్వామ్యమైన భారత పత్తి సంస్థ (సీసీఐ), ధాన్యం కొనుగోళ్ళలో కీలక భూమిక పోషించే భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లు కూడా ఖరీఫ్ కొనుగోళ్ళపై తమ అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశాయి. సమ్మె మరికొన్ని రోజులు కొనసాగితే ఆ ప్రభావం రైతాంగంపైనే తీవ్రంగా ఉంటుందని సామాజిక నిపుణులు స్పష్టంచేస్తున్నారు.



## బంద్‌కు కాంగ్రెస్, టీజేఎస్, ఎమ్మార్పీఎస్ మద్దతు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్, తెలంగాణ జనసమితితో పాటు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. శనివారం నిర్వహించే బంద్‌లో క్షేత్ర స్థాయిలో పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తమ కేడర్‌కు కాంగ్రెస్, టీజేఎస్‌తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకత్వం సూచించింది. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌తో, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా తమ పార్టీ శ్రేణులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. అంతే కాకుండా శుక్రవారం చేపట్టిన బైక్ ర్యాలీలలో విజయవంతమైనాయని పార్టీల నేతలు పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపార సంస్థలు కూడా ముందుకు వచ్చి బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. కాగా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు సొంత జిల్లాలో ఉండి కేడర్‌ను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేలా ఉండాలని చూడాలని సూచించారు. 14 రోజుల పాటు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ఇస్తూ సంఘీభావం తెలిపిన విషయం తెలిసిందే. శుక్రవారం కూడ బంద్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా బైక్ ర్యాలీలను నిర్వహించారు.

### హైకోర్టు ఆదేశాలు పాటించాలి: గూడూరు

ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం పాటించాలని కాంగ్రెస్ పార్టీ సూచిస్తున్న దని టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. అయితే సీఎం కేసీఆర్ హై కోర్టు ఆదేశాలను పాటించకపో వచ్చని శనివారం ఆయన ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత అహం దెబ్బతింటుందని కేసీఆర్ భావిస్తున్నట్లు అర్థమవుతోందని గూడూరు చెప్పారు. ప్రజలెన్నుకున్న ప్రతినిధిగా ప్రజాసమస్యల ను పరిష్కరించే బాధ్యత ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరిపైన ఉందనే విషయం సీఎం గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు.

## తాత్కాలిక కండక్టర్‌పై అత్యాచారయత్నం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తాత్కాలిక మహిళా కండక్టర్‌పై బస్సు డ్రైవర్ శ్రీనివాస్ అత్యాచారయత్నం చేసిన ఘటన మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెన్నూరు నుంచి మంచిర్యాలకు వస్తున్న బస్సులో ప్రయాణీకులు ఎవరు లేరు. బస్సు చెడిపోయిందని చెప్పిన తాత్కాలిక డ్రైవర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మహిళా కండక్టర్‌పై అత్యాచారయత్నం చేయబోయాడు. అతడి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనను అధికా రులు గోప్యంగా ఉంచటం విమర్శలకు తావిస్తోం ది. డ్రైవర్ శ్రీనివాస్‌పై 354 సెక్షన్ కింద కేసు నమో దు చేసిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకు న్నారు.సమ్మె కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేస్తున్న తరుణంలో తాత్కాలిక డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించటం చర్చనీయాంశమయింది.

## బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో పాలన పూర్తిగా స్తంభించిందని, ఆర్టీసీ సమ్మెతో రాష్ట్రంలో పౌరుల ఇబ్బందులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన శనివారం రాష్ట్ర బంద్ పిలుపునకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం బీహెచ్ఇఎల్ డిపో నుంచి కూకట్‌పల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతుగా నిలిచాయని, అయినప్పటికీ సీఎం కేసీఆర్ ఒంటెత్తు పోకడలతో సమ్మెను జటిలం చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్టీసీ సమ్మెకు రోజురోజుకూ రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు పెరుగుతోందని, ఫలితంగా సామాన్య జనజీవనంపై ప్రభావం చూపుతుందన్నారు. కార్మికులు గడచిన 13 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన సంఘాలన్నీ ఆర్టీసీ కార్మికులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతుండటంతో రాష్ట్రంలో కార్యకలాపాలు స్తంభించిపోయాయన్నారు. సామాన్య ప్రజలు, రవాణా సౌకర్యం లేకపోవడం, మంత్రులు చేతలుడిగి చూస్తుండటంతో రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. బస్సులు లేక ప్రజలు నానా అగచాట్లకు గురవుతుంటే రవాణా మంత్రి చేతలుడిగి చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు మాధవరం కాంతారావులతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

### పొగాకు కంపెనీల యజమానులను
## ప్రభుత్వం నుంచి తప్పించాలి

**హైదరాబాద్ :** కేంద్రప్రభుత్వం ఇ-సిగరెట్లను నిషేధించినట్లుగానే, క్యాన్సర్, ఇతర వ్యాధులకు కారణ మవుతున్న సంప్రదాయ పొగా కతో తయారయ్యే సిగరెట్లపై నిషేధం విధించాలని పౌరహక్కుల కార్యకర్త అశుతోష్ దీక్షిత్ ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి ఇటీవలే ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. తాజాగా దానికి అనుబంధంగా మరో లేఖలో పొగాకు కంపెనీలు నిర్వహించే కంపెనీల యజమానులను ప్రభుత్వం నుంచి తప్పించాలని కోరారు. పీఎస్‌యు బీమా కంపెనీల ద్వారా ప్రభుత్వం పొగాకు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి సిగరెట్ల అమ్మకాలను పరోక్షంగా ప్రోత్సహిస్తూ.. అదే సమయంలో సిగరెట్లు తాగే వారి నుంచి బీమా కంపెనీలు పెద్ద ఎత్తున ప్రీమియంలు వసూలు చేయడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

### హోంక్రెడిట్ ఇండియాతో
## కరూర్ వైశ్యాబ్యాంకు ఒప్పందం

**హైదరాబాద్ :** హోం క్రెడిట్ ఇండియా (హెచ్‌సీఐఎన్), ఇంటర్నేషనల్ కన్స్యూమర్ ఫైనాన్స్ ప్రొవైడర్ అనుబంధ సంస్థ, కరూర్ వైశ్యాబ్యాంక్ భాగస్వామ్యంతో ఎండ్ టు ఎండ్ ఆటోమెటెడ్ ప్రాసెసింగ్ చేస్తుంది. దీంతో కస్టమర్‌కు సమయం ఆదా అవ్వడంతో పాటు రుణాలు మంజూరు వేగవంతమ వుతాయి. ఇటీవల ఆర్‌బీఐ కొత్త గైడ్‌లైన్స్ విడుదల చేసి, బ్యాంకుల భాగస్వామ్యంతో బ్యాంకుల్లో ఖాతాల్లేని వారికి కూడా రుణాలు ఇవ్వాలని సూచించింది. హెచ్‌సీఐఎల్, కెవీబీ ఒప్పందం ప్రకారం కస్టమర్‌కు రుణం సమకూరుస్తుంది. హెచ్‌సీఐఎన్ సీఎఫ్ఓ అనిర్బన్ మజుందార్ సమాచారం ప్రకారం తమ కంపెనీ కెవీబీ నుంచి కస్టమర్‌కు రుణం సమకూరుస్తుందన్నారు. మొత్తం లావాదేవీ అంతా డిజిటల్‌ప్లాట్‌ఫాంపైనే కొనసాగుతుందన్నారు. చౌకరకంరుణాలను కెవీబీ, హోంక్రెడిట్స్‌రెండు కలిసి కొత్తసెగ్మెంట్ కస్టమర్ల ద్వారా తమ వ్యాపారాన్ని పెంచుకుంటాయని కరూర్ వైశ్యాబ్యాంకు ఎండీ,సీఈవో పీఆర్ శేషాద్రి అన్నారు. కాగా హెచ్‌సీఎల్ దేశంలోని 20 రాష్ట్రాల్లో 179 నగరాల్లో సేవలందిస్తోంది.

Andhraprabha business 2019
బిజినెస్
BUSINESS

# రిల్... జిగేల్!



ఇండోర్‌లో జరుగుతున్న 'మెగ్నిఫీషియెంట్ ఎంపీ' సదస్సులో రిల్ సీఎండీ ముఖేష్ అంబానీ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న దృశ్యం

**•క్యూ2 లాభాలు రూ. 11,262 కోట్లు •అంచనాలను మించిన ఫలితాలు •మంచి వృద్ధిని సాధించాం: ముఖేష్ అంబానీ**

**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభాలు అంచనాలను మించిపోయాయి. సెప్టెంబర్‌తో ముగిసిన క్యూ2లో ఏకీకృత నికరలాభం 18.3 శాతం పెరిగి రూ.11,262 కోట్లకు ఎగబాకింది. రెవెన్యూ 4.8 శాతం వృద్ధితో రూ.1,63,854 కోట్లకు చేరింది. రెవెన్యూ పెరగడానికి రిటైల్, డిజిటల్ వ్యాపారాలే ప్రధాన కారణం. ఈ2 విభాగాల నుంచి రెవెన్యూ వరుసగా 27 శాతం, 43 శాతంగా నమోదైనాయి. దీనికి వ్యతిరేకంగా చమురు శుద్ధి (రిఫైనింగ్), పెట్రో రసాయాల రెవెన్యూ తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 17.7 శాతం తగ్గడంతో దాని ప్రభావం రెవెన్యూపై కనిపించింది.

### ఎగుమతులు తగ్గాయి

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగుమతులు 12.1 శాతం క్షీణించి రూ.53,161 కోట్లకు దిగి రాగా.. ఏడాది క్రితం రూ.60,460 కోట్లుగా నమో దైనాయి. చమురు శుద్ధి (రిఫైనింగ్) చార్జీలు తగ్గ డంతో పాటు పెట్రోకెమికల్స్ ఉత్పత్తుల ధరలు తగ్గడం, దీంతో పాటు దేశీయ పరిణామాలు కూడా కారణమని రిలయన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితాలపై రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముఖేష్ అంబానీ మాట్లాడుతూ.. సెప్టెం బర్‌తో ముగిసిన త్రైమాసికంలో రికార్డుస్థాయిలో ఫలితాలను సాధించామని ప్రకటించారు. చమురు, పెట్రో రసాయనాల వ్యాపారాల నుంచి ఇతర కన్స్యూమర్ వ్యాపారాల వరకు మంచి ప్రదర్శన సాధించాయన్నారు.సెప్టెంబర్ త్రైమాసికంలో చమురు, పెట్రో రసాయనాల వ్యాపారాల నుంచి మంచి లాభాలను సాధించామని, వ్యాల్యూమ్స్ కూడా బాగా పెరిగాయన్నారు. చమురు పెట్రో రసాయనాల వ్యాపారంలో కొత్త భాగస్వామి ద్వారా మరింత వృద్ధిని సాధించవచ్చునని, మరింత సంపద సృష్టించవచ్చునని ఆయన అన్నారు. రిటైల్ వ్యాపారం కూడా సరి కొత్త శిఖరాలకు చేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

### పెట్రో కెమికల్స్ రెవెన్యూ...

పెట్రోకెమికల్స్ రెవెన్యూ ఏడాది ప్రాతిపదికన చూస్తే 11.90 శాతం క్షీణించి రూ.38,538 కోట్లకు దిగివచ్చింది. పెట్రోకెమికల్స్ ఉత్పత్తుల ధరలు తగ్గడమే దీనికి ప్రధాన కారణం.. అలాగే చమురు సహజవాయువు రెవెన్యూ విభాగంలో కూడా ఏడాది ప్రాతిపదికన 40.20 శాతం క్షీణించి రూ.790 కోట్లకు దిగివచ్చాయి. కాగా దేశీయ సహజ వాయువు ఉత్పత్తి ఏడాది ప్రాతి పదికన 22 శాతం తగ్గి 11.9 బిలి యన్ క్యూబిక్ ఫీట్ (బీసీఎఫ్)కు దిగివచ్చింది. యూఎస్ షెల్ ఆపరేషన్ కూడా 25 శాతం తగ్గి 17.8 బీసీఎఫ్‌కు దిగివచ్చిందని రిలయన్స్ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది.



### రిటైల్

రిటైల్ వ్యాపారం రెవెన్యూ ఏడాది ప్రాతిపదికన 27 శాతం పెరిగి రికార్డుస్థాయిలో రూ.41,202 కోట్లకు చేరింది. అదే విధంగా దీని ఈబీఐటి (వడ్డీ, పన్నులు ఆదాయం చెల్లించడానికి ముందు) 63.60 శాతం పెరిగి రూ.2,035 కోట్లకు చేరాయి. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో 24.50 మిలియన్ చదరపు అడుగుల్లో రిటైల్ వ్యాపారాన్ని విస్తరించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 19.50 మిలియన్ చదరపు అడుగుల్లో వ్యాపారాన్ని నిర్వహించేది. సెప్టెంబర్ త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ అదనంగా 337 స్టోర్‌లను ప్రారంభించింది. దీంతో దేశవ్యాప్తంగా రిటైల్ స్టోర్‌లు 10,901కి చేరాయి.

**మీడియా :** మీడియా వ్యాపారం రెవెన్యూ 5.10 శాతం క్షీణించి ఏడాది ప్రాతిపదికన రూ.1,174 కోట్లకు దిగివచ్చింది. అయితే ఈబీఐటి మార్జిన్ మాత్రం నాలుగు శాతం పెరిగింది. డిజిటల్ సర్వీస్ రెవెన్యూ 42.70 శాతం పెరిగి రూ.15,619 కోట్లకు చేరింది.

### రిలయన్స్ జియో




రిలయన్స్‌టెలికం యూనిట్ జియో నికరలాభం ఏడాది ప్రాతిపదికన 45.40 శాతం పెరిగి రూ.990 కోట్లకు ఎగబాకింది. వినియోగదా రుడి నుంచి సరాసరి రూ.120 రెవెన్యూ సాధించింది.

### ముఖ్యాంశాలు (ఏకీకృతం)

- రెవెన్యూ 4.8 శాతం పెరిగి రూ.1,63,854 కోట్లకు.
- పన్ను, వడ్డీ, తరుగుదల తర్వాత లాభం 15.5 శాతం వృద్ధితో రూ.25,820 కోట్లు.
- పన్ను చెల్లించడానికి ముందు 14.1 శాతంతో రూ.15,055 కోట్లు.
- నికరలాభం 18 శాతం వృద్ధితో రూ.11,262 కోట్లు.
- ఈపీఎస్ (గ్రూపు మొత్తం) షేరుపై రూ.16.06 నుంచి రూ.18.59కి.

### అప్పులు.. నగదు.. బాండ్లు

సెప్టెంబర్ 30,2019కి గ్రూపు అప్పులు రూ.2,91,982 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రూ.2,87,505 కోట్లుగా నమోదైనాయి. ఖాతా పుస్తకాల్లో నగదు.. బాండ్ల రూపంలో రూ.1,34,746 కోట్లు, ఈ ఏడాది మార్చి చివరి నాటికి రూ.1,33,207 కోట్లుగా ఉన్నాయి.

### రూ.9లక్షల కోట్లకు చేరిన మార్కెట్ క్యాప్

రిలయన్స్ ఇండస్ట్రీస్ శుక్రవారం సరికొత్త మైలురాయిని దాటింది. మార్కెట్ క్యాప్ రూ.9 లక్షల కోట్లను దాటి చరిత్ర సృష్టించిన మొట్ట మొదటి భారతీయ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్. బీఎస్ఈలో శుక్రవా రం ఉదయం ట్రేడింగ్‌లో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,01,490.09 కోట్లకు ఎగబాకింది. కాగా శుక్రవారం నాడు మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వెల్లడికాబోతున్న నేపథ్యంలో దీని షేరు 2.28 శాతం పెరిగి రూ.1428 మార్కుకు చేరింది. గత ఏడాది ఆగస్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొట్టమొదటిసారి రూ.8లక్షల కోట్ల మార్కెట్‌క్యాప్‌ను దాటిపోయింది.

Reliance Exports SALES & SERVICES

Reliance RETAIL

# చైనా క్యు3 జీడీపీ 6 శాతం

**•27 ఏళ్లలో అత్యల్పం •భారీగా తగ్గిన డిమాండ్**




**బీజింగ్ :** చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది మూడవ త్రైమాసికంలో 3 దశాబ్దాల కనిష్టానికి 6.0 శాతానికి దిగివచ్చంది. దేశీయంగా డిమాండ్ తగ్గడం, అమెరికాతో వాణిజ్య యుద్ధం తదిదర అంశాలు కారణాలని ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి తెలు స్తోంది. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసి కంలో జీడీపీ వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైందని నేష నల్ బ్యూరో ఆఫ్ స్టాట్సిటిక్ (ఎన్‌బీఎస్) వెల్లడించింది. 1992 తర్వాత వృద్ధిరేటు ఈ స్థాయిలో పడిపోవడం ఇదే మొదటిసారి. కాగా ప్రభు త్వం ఈ ఏడాది వృద్ధిరేటు లక్ష్యం మాత్రం 6.0 శాతం నుంచి 6.5 శాతంగా అంచనా వేస్తోంది. గత ఏడాది 2018 లో 6.6 శాతం వృద్ధిరేటును సాధించింది.వృద్ధిరేటు క్షీణిం చడానికి దేశీయ పరిణామాలతో పాటు విదేశాల్లో నెలకొన్న పరిణామాలేనని ఎన్‌బీఎస్ అధికార ప్రతినిధి మావో షెంగ్ యాంగ్ చెప్పారు. వృద్ధిరేటు పెంచుకోవడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున పన్నుల్లో కోత విధించడంతో పాటు వడ్డీరేట్లు తగ్గించింది. స్టాక్ మార్కెట్లో విదేశీ పెట్టుబడులన ఆకర్షించడానికి ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను సడలించింది. వృద్ధిరేటును పెంచుకోవడానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి బ్యాంకింగ్ వ్యవస్థలోకి 28 బిలియన్ డాలర్లను సమకూరుస్తున్నట్లు తెలిపింది. అమెరికాతో వాణిజ్య యుద్ధం, దేశీయంగా డిమాండ్ తగ్గడంతో ఈ ఏడాది జీడీపీ వృద్ధిరేటును అంతర్జాతీయ ద్రవ్య నిధి 6.2 శాతం నుంచి 6.1 శాతానికి గత మంగళవారం నాడు సవరించింది. అమెరికాతో దీర్ఘకాలంగా జరుగుతున్న వాణిజ్యయుద్ధం వల్లచైనా ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతోంది.

# కొనుగోళ్ల జోరు

**•సెన్సెక్స్ 246పాయింట్ల వృద్ధి •ఆరవ రోజూ లాభాల్లోనే...**

**ముంబై:** స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజు లాభాల్లోనే ముగిసింది. సెన్సెక్స్ 246 పాయింట్ల వృద్ధి కనిపించింది. ఇన్వె స్టర్లు అన్నీ రంగాలకు చెందిన షేర్లను కొనుగోలు చేశారు. మార్కెట్ ముగిసే నాటికి బీఎస్ఈ సెన్సెక్స్ 246.32 పాయిం ట్లు లాభపడి 39,298.38 వద్ద ముగియగా.. ఇంట్రాడేలో 39,361.06 మార్కుకు.. కనిష్టంగా 38,963.60 మార్కుకు దిగివచ్చింది. ఎన్ఎస్ఈ కూడా 75.50 పాయింట్లు లాభపడి 11,661.85 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లలో ఎస్ బ్యాంకు అగ్రస్థానంలో ఉంది. దీని షేరు 8.44 శాతం వరకు పుంజుకుంది. దీంతో పాటు మారుతి, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఎల్‌అండ్‌టి, ఎస్‌బీఐలుకూడా లాభా లను నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.37 శాతం పెరిగింది. కాగా స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ క్యూ2 ఫలితాలను వెల్లడించనుంది. టాటామోటార్స్, బజాజ్‌ఆటో, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఇన్ఫోసిస్ 1.05 శాతం వరకు నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్లతో పోల్చు కుంటే దేశీయ మార్కెట్లు ఈ వారం మంచి ప్రదర్శనను ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు పెద్దెత్తున షేర్లను కొనుగోలు చేయ డంతో ర్యాలీ ఏర్పడింది. దీంతో పాటు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య చర్చల్లో కాస్తా పురోగతి కనిపించిండం, బ్రెగ్జిట్‌పై బ్రిటన్ - యూరోపియన్ యూనియన్‌ల మధ్య ఒప్పందం కుదరడం లాంటి అంశాలు దేశీయ మార్కెట్లకు బాగా కలిసి వచ్చాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థక వ్యవస్థను బలోపేతం చేయడానికి మరిన్ని ఉద్దీపన పథకాలను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రకటిస్తామని ప్రకటించడంతో మార్కెట్లు మరింత దూసుకుపోయాయన్నారు . గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాలో షాంఘై, హాంకాంగ్, సియోల్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. దీనికి కారణం చైనా జీడీపీ వృద్ధిరేటు 3 దశాబ్దాల కనిష్ఠానికి దిగిరావ డమే. అయితే టోక్యో మార్కెట్ మాత్రం లాభాలతో ముగిసింది. యూరోపియన్ మార్కెట్ల విషయానికి వస్తే ఇక్కడ మార్కె ట్లు ప్రారంభమైన వెంటనే మిశ్రమ స్పందన కనిపించింది. డాలర్ మారకంతో రూపాయి స్వలంగా లాభపడి 71.13 వద్ద ట్రేడ్ అయ్యింది.

# కేసీఆర్ నిబద్ధత వెల కట్టలేనిది

**• ట్రెడాయి ప్రాపర్టీ షోలో మంత్రి ప్రశాంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావుకు ఉన్న నిబద్ధత వెలకట్ట లేనిదని రహదార్లు,భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హైటెక్స్‌లో జరగనున్న ట్రెడా ప్రోపర్టీ షోను మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలం తర్వాత తిరిగి కేసీఆర్ ప్రభుత్వమే భూరికార్డుల ప్రక్షాళన చేసిం దన్నారు. హైదరాబాద్ నగరం ఐటి, ఫార్మా రంగంలో ముందు ఉండటమే కాకుండా తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా ఉందన్నారు. నగరంలో శాంతిభద్రతలు నియంత్రణలోనే ఉన్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ నగరం చుట్టూ తాగునీటి అవసరాల కోసం 65 రిజర్వాయర్లను నిర్మించామన్నారు. నగరం చుట్టపక్కల ప్రాంతాలకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇదిలావుండగా, తాను కూడా బిల్డర్‌నేనని, బిల్డర్స్ సమస్యలు తనకు తెలుసన్నారు. సమాజం అభివృద్ధి చెందితేనే బిల్డర్స్ అభివృద్ధి చెందుతారని ఆయన చెప్పారు.

# మార్కెట్లోకి 'కునోయిచీ'



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** జపాన్ కేంద్రంగా ఉత్పత్తి ప్రారంభించిన ప్రపంచ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న ప్రముఖ క్రిమి సంహారక మందుల సంస్థ నిస్సాన్ కెమికల్ కార్పొరేషన్ భారత దేశంలో కార్యకలాపాలు ప్రారంభించింది. ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ పేరుతో వ్యవసాయ రంగానికి మరింత మేలుచేసే ఉత్పత్తులను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. 'కునోయిచీ' బ్రాండ్‌తో ఈ పురుగు మందును సంస్థ ఇండియా ఎండీ రాజేష్ అగర్వాల్ శుక్రవారం మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మీడి యా తో మాట్లాడుతూ, జపాన్‌తో పాటు దక్షిణ కొరియా, కొలం బియా, ఈక్వెడార్లలో వాడుకలో ఉన్న ఈ పురుగు మందు దక్షిణ భారతదేశంలో అత్యధిక విస్తీర్ణంలో సాగుచేసే మిరప పంట సస్యరక్షణకు ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. 30 శాతం మార్కెట్ షేర్‌ను ఆక్రమించడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నా మన్నారు. ఇప్పటికే ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ తయారు చేస్తున్న మిటి సైడ్ సైనో పైరాఫెన్ పురుగు మందులకు రైతుల నుంచి విశేష ఆదరణ ఉంద న్నారు. మిరప పంటపై ప్రభావితం చూసే పురు గులను నియంత్రిం చడంలో దీర్ఘకాలంగా పనిచేస్తుందన్నారు. డొమెస్టిక్ మార్కెట్‌లో మూడు బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని లక్ష్యంగా పెట్టు కుందన్నారు. 100 మిల్లీలీటర్ల పరిమాణంతో ఉన్న కునోయిచి క్రిమిసంహారక మందు ఒక ఎకరానికి సరిపోతుందని, దీని ధర రూ.1,250గా నిర్ణయించామన్నారు.

### నగల ఎగుమతుల్లో
## 10 శాతం క్షీణత

**•జీజేఈపీసీ అంచనా**

GJEPC INDIA
SPONSORED BY THE MINISTRY OF COMMERCE & INDUSTRY

**ముంబై:** విదేశాలకు ఎగుమతి చేసే వజ్రాలు, నగలు ఈ ఆర్థిక సంవత్సరం 5-10 శాతం తగ్గే అవకాశాలున్నాయని వజ్రాలు, నగల ఎగుమతి ప్రోత్సహక మండలి (జీజెఈపీసీ) పేర్కొంది. దీనికి కారణం అమెరికా - చైనాల మధ్య వాణిజ్య యుద్ధం, హాకాంగ్‌లో పెద్దెత్తున కొనసాగుతున్న నిరసనలు, మధ్య ప్రాచ్యదేశాల్లో వ్యాట్ అమలు చేయడమని పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నాటికి ఎగుమతులు 5.70 శాతం తగ్గి రూ.1,32,170.32 కోట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.1,40,158.83 కోట్లని జీజేఈపీసీ వైస్ చైర్మన్ కోలిన్ షా చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఎగుమతులు 5-10 శాతం తగ్గుతాయని అంచనా వేసింది.

### 20 శాతం తగ్గిన
## ప్యాసింజర్ వాహనాల విక్రయాలు



**న్యూఢిల్లీ :** గత నెల (సెప్టెంబర్)లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చుకుంటే 20.1 శాతం తగ్గి 1,57,972 యూనిట్లకు దిగివచ్చాయని ఆటోమొబైల్ డీలర్స్ బాడీ (ఎఫ్ఏడీఏ) వెల్లడించింది. పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో డిస్కౌంట్లు ఆఫర్లు ప్రకటించినా అమ్మకాలు మాత్రం ఊపందుకోలేదు. క్రితం ఏడాది ఇదే నెలలో 1,97,653 యూనిట్లవిక్రయాలు జరిగాయని (ఎఫ్ఈడీఏ) అధ్యక్షుడు హర్షరాజ్ కాలే చెప్పారు. ద్విచక్ర వాహనాల అమ్మకాలు 12.1 శాతం తగ్గి 10,98,271 యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం ఇదే నెలలో 12,48,998 యూనిట్లకు దిగివచ్చాయి. వాణజ్య వాహనాల అమ్మకాల్లో 18.5 శాతం క్షీణించి 63,518 యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం 77,980 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. త్రిచక్ర వాహనాల అమ్మకాల్లో 1.8 శాతం పెరిగి 55,553 యూనిట్లకు ఎగబాకగా, ఏడాది క్రితం 54,650 యూనిట్ల తెలియజేశారు. మొత్తానికి అన్నీ విభాగాల వాహనాల అమ్మకాలు 12.9 శాతం తగ్గి 13,75,314 యూని ట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం ఇదే నెలలో 15,79,191 యూనిట్ల విక్రయాలు జరిగాయని వివరించారు.

## ఎయిర్ ఇండియాకు ఊరట!



**న్యూఢిల్లీ :** ప్రభుత్వరంగానికి చెందిన చమురు కంపెనీలు ఎయిర్‌ఇండియాకు యధావిధిగా చమురు సరఫరా చేయాలని నిర్ణయించాయి. పాత బకాయిలను త్వరలోనే తీరుస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చమురు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఇండియన్ ఆయిల్ కార్పొ రేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిం దుస్తాన్ పెట్రోలికం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)లు అక్టోబర్ 5న ఎయిర్ ఇండియాకు లేఖ రాశాయి. పాత బకాయలు అక్టోబర్ 18గా తీర్చకపోతే దేశంలోని 6 అతి పెద్ద విమానాశ్రయాల్లో ఇంధనం నలిపివేస్తామని లేఖలో పేర్కొన్నాయి. ఎయిర్‌ఇండియా చమురు కం పెనీలకు మొత్తం పాత బకాయిలు కలిపితే రూ.5,000 కోట్ల వరకు ఉంటుంది. అటు తర్వాత ఈ ఏడాది జూన్, సెప్టెంబర్‌లలో నెలకు రూ.100 కోట్ల చొప్పున బకా యిలు తీరుస్తామని హామి ఇచ్చి, హామీని నిలబెట్టుకోలేకపోయింది.

# అంచనాలను మించాం

**•శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్ • ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**వాషింగ్టన్ :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని భారత ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) భారత్ జీడీపీ వృద్ధిరేటును కుదించింది. అయినా, వృద్ధిరేటులో తాము దూసుకుపోతున్నామని ఆమె గురువారం నాడు మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. సీతారామన్ ఇక్కడ జరుగుతున్న ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వార్షిక సమావేశాల్లో పాల్గొనడానికి ఇక్కడికి వచ్చారు. చైనాతో పోటీపడ్డానికి తాము పెద్ద రిస్కు తీసుకోవడం లేదన్నారు. ఇరు దేశాలు వృద్ధిరేటును 6.1 శాతం సాధిస్తాయని తాజా ఐఎంఎఫ్ నివేదికలో అంచనా వేశాయన్నారు. తాజాగా ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదికలో గ్లోబల్ వృద్ధిరేటుతో పాటు భారత్ జీడీపీ వృద్ధిరేటును ఐఎంఎఫ్ కుదించింది. అయినా వృద్ధిరేటు భారత్ శరవేగంగా దూసుకుపోతోందని ఆమె అన్నారు. 2018లో భారత్ వాస్తవ జీడీపీవృద్ధిరేటు 6.8 శాతంగా నమోదు కాగా మంగళవారం నాడు విడుదల చేసిన నివేదికలో ఈ ఏడాది 6.1 శాతాం గాను, వచ్చే ఏడాది 2020లో 7 శాతం వృద్ధిని సాధిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. వృద్ధిరేటు మరింత పుంజుకోవడానికి తనకు అందుబాటులో ఉన్న అన్నీ అవకాశాలను వినియోగించుకుంటానని ఆమె అన్నారు. వృద్ధిరేటు పుంజుకోవడానికి పలు అంశాలు కూడా కలిసి రావాలి. వాటిలో సెంటిమెంట్ కీలకపాత్ర పోషిస్తోందని, గతంలో మాదిరిగా భారత్ వృద్ధిరేటులో దూసుకుపోవడం లేదన్నారు. ప్రస్తుతం జీడీపీ వృద్ధిరేటు 8 శాతం కాదు గదా 7 శాతం కూడా కాదు... ఆరు శాతం కంటే కిందికి దిగివచ్చామన్నారు. అయితే ఇలాంటి వ్యతిరేక పరిస్థితుల్లో కూడా మంచి వృద్ధిరేటు సాధించే సత్తా భారత్‌కు కలిగి ఉందన్నారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఆర్థిక వ్యవస్థ గాడిన పడ్డానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేనన్నారు. ప్రస్తుతం తన పని ప్రతి రంగం చెప్పే వారి వారి వాదనలను విని, ప్రభుత్వం తరఫున స్పందించడమేనన్నారు. విశ్లేషించే పనిలో మాత్రం ప్రస్తుతం లేనన్నారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేస్తారా అని ప్రశ్నించగా.. ప్రస్తుతానికి దానిపై సమీక్ష జరపడం లేదన్నారు. ప్రస్తుతం పరిశ్రమవర్గాలు తాము ఎదుర్కొటున్న అంశాలను తన ముందు ఉంచుతున్నారని, వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నానన్నారు. వ్యక్తిగత ఆదాయపు పన్నును మరింత తగ్గించే అవకాశం ఉంటే మీకు సమాచారం అందుతుందన్నారు.




### అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు

అమెరికాతో ఉన్న వాణిజ్య అభి ప్రాయభేదాలు తగ్గముఖం పడుతున్నాయని నిర్మలా సీతారామన్ అన్నారు. త్వరలోనే రెండు దేశాలు కలిసి వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటాయన్న నమ్మ కాన్ని ఆమె వ్యక్తంచేశారు. ఇరు దేశాల మధ్య కొన్ని వాణిజ్య అభి ప్రాయభేదాలున్నాయని.. త్వరలోనే అవి సమసిపోతాయన్న నమ్మ కాన్ని వ్యక్తం చేశారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి విల్‌బర్ రోస్ ఇటీ వల న్యూఢిల్లీ పర్యటనకు వచ్చినప్పుడు అమెరికా - భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం చేయడానికి వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్‌గోయల్, అటు తర్వాత నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారని గురువారం అమెరికా వాణిజ్య విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది.

# సాగర్ కాల్వలోకి స్కార్పియో

## ఆరుగురు జలసమాధి

**● వివాహ వేడుకలకు వెళ్లి వస్తూండగా ప్రమాదం ● మిత్రులంతా చూస్తుండగానే నీటమునిగిన వాహనం ● రక్షించేందుకు విఫలయత్నం.. మృతులంతా హైదరాబాద్‌వాసులు**


వృత్తంలోని వారంతా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు

**నడిగూడెం, ప్రభన్యూస్:** సూర్యాపేట జిల్లాలో విషాదం చోటుచేసుకుంది.సహచర ఉద్యోగి వివాహానికి హాజరైన మిత్రబృందం తిరిగివెడుతూండగా మృత్యువు కబళించింది. నడిగూడెం మండలం చాకిరాల వంతెన వద్ద సాగర్ ఎడమకాల్వలోకి స్కార్పియో వాహనం దూసుకువెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు జలసమాధి అయ్యారు. మృతులంతా హైదరాబాద్‌కు చెందినవారు. శుక్రవారం రాత్రి ఈ ప్రమాదం సంభవించింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చాకిరాల గ్రామానికి చెందిన వేములకొండ మహేష్ హైద్రాబాద్ అకూర్ ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం చాకిరాలలో మహేష్ వివాహ వేడుకలకు ఆసుపత్రి సిబ్బంది మూడు కార్లలో హాజరయ్యారు. వేడుకలు పూర్తయ్యాక రాత్రి హైదరా బాద్‌క ు తిరుగు ప్రయా ణమయ్యారు. నడి గూడెంవైపునకు వెడుతూండగా సాగర్ ఎడమ కాల్వ రోడ్డుపై చాకిరాల వంతెన వద్ద కారు అదుపు తప్పింది. కాల్వలోకి దూసుకుపోయి నీట మునిగిపోయింది. అదే కారు వెనుకాల వస్తున్న మరో రెండు వాహనాల్లోనివారు వెంటనే కిందకు దిగి మునిగిపోతున్న మిత్రులను కాపాడేందుకు విఫలయత్నం చేశారు. కారు డోర్లు బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొద్దిసేపటి తరువాత పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ఆ కారులో అబ్దుల్ అజీజ్, నాగేశ్వర్, రాజేష్, జాన్సర్, సంతోష్, పవన్‌లు ఉన్నట్లు స్నేహితులు తెలిపారు. సీఐ శివశంకర్ గౌడ్, ఎస్సై సీహెచ్ నరేష్‌లు సంఘటన స్థలానికి చేరుకోని ఎన్ఎస్పీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు ముఖ్యాల బ్రాంచ్ వద్ద కాల్వకు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించి, కారును క్రేన్ సహాయంతో బయటికి తీసేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా మేళ్ళ చెరువులో ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమాచారం తెలియగానే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న సీఐ, ఎస్సైతో పాటు స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కటిక చీకటి కమ్ముకోని ఉండడంతో కాల్వ కఎడా కనిపించే పరిస్థితి లేదు. వెంటనే ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో మాట్లాడి అక్కడ విద్యుత్ ఏర్పాట్లు చేయించారు. ఈ లోగా కలెక్టర్ అమయ్ కుమార్, ఎస్పీ భాస్కరన్‌లు అక్కడికి చేరుకున్నారు. సహాయ చర్యల ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో మాట్లాడి ఉన్నత అధికారులకు వివరించారు. కాల్వలో నీరు తగ్గుముఖం పట్టడంతో కోదాడ నుంచి పెద్ద క్రైన్‌ను కాల్వ వద్దకు రప్పించారు. ఏ రాత్రి అయిన సరే కారును గుర్తించి బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వర్షంపడుతుండటంతో రోడ్డు సరిగా కనిపించక రోడ్డుప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.


ఘటనా స్థలం వద్ద పోలీసులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం

## రూ.888కోట్ల బకాయిల విడుదలకు ఎఫ్‌సీఐ సిద్ధం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన రూ.888కోట్ల బకాయిలను విడుదల చేసేందుకు ఎఫ్‌సీఐ సంసిద్ధతను తెలిపింది. దాంతోపాటు ఆర్‌డి సెస్ కింద రూ.95కోట్లు విడుదల చేసేందుకు కూడా సానుకూలత తెలిపింది. శుక్రవారం సివిల్ సప్లైస్ కార్యాలయంలో కమిషనర్ అకున్ సబర్వాల్ ఎఫ్‌సీఐ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడులకు అనుగుణంగా బియ్యం నిల్వలకు అవసరమైన గోదాములను కేటాయించాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది 92లక్షల టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గత ఏడాది రబీకి సంబంధించిన 11లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందుకు అవసరమైన స్టోరేజిస్పేస్‌ను కేటాయించాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్, కొత్తగూడెం జిల్లాల్లో స్టోరేజి సమస్య అధికంగా ఉందని, తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని కోరగా అందుకు ఎఫ్‌సీఐ జీఎం అశ్వినీకుమార్ సుముఖత వ్యక్తం చేశారు.

## ఎస్సీ,ఎస్టీల రక్షణలో తెలంగాణ టాప్

**●ఎస్సీ,ఎస్టీ కమిషన్ పనితీరు భేష్:సీఎస్ జోషి**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దళిత, గిరిజనుల మనోభావాలను కాపాడడంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు కనిపించకుండా పోయాయని, అందుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. కొన్ని సంఘటనలను సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవడం, జరుగుతున్న అన్యాయాలపై ఫిర్యాదులను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపడంలాంటి కార్యక్రమాలు భేషుగ్గా ఉన్నాయని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారా జిల్లాల్లో సివిల్ రైట్స్‌డే కార్యక్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తుండడం శుభపరిణామమని అన్నారు. శుక్రవారం బీఆర్‌కే భవన్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ అధ్యక్షనత కమిషన్ సభ్యులు సీఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ చేపట్టిన కార్యక్రమాలను వారు వివరించారు. వచ్చే నెల 30న కమిషన్ నిర్వహించే సివిల్ రైట్స్ డేలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ ఘటనలు తగ్గేలా చూడాలని, బాధితులకు సహాయం త్వరగా అందేలా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా విజి లెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎర్రోళ్ళ శ్రీనివాస్ సీఎస్‌కు తెలిపారు.


శుక్రవారం బీఆర్‌కే భవన్‌లో కేంద్ర కెమికల్స్, పెట్రో కెమికల్స్ కార్యదర్శి పి.రాఘవేంద్రరావు సీఎస్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కెమికల్, పెట్రో కెమికల్ రంగంలో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగు సహాయ సహకారాలను అందించాలని సీఎస్ ఎస్‌కే జోషి కోరారు.

## రైతు ఆదాయం రెట్టింపునకు ఫుడ్ ప్రాసెసింగ్ తోడ్పాటు

**ఆ వ్యవస్థలేక 60 శాతం పండ్లు, కూరగాయలు వృథా: వీసీ వాసుదేవప్ప ఆందోళన**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యం సాకారం కావాలంటే, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేసి, గ్రోత్ ఇంజన్‌గా మార్చాల్సిన అవసరం ఉందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఉపకులపతి డాక్టర్ సి.వాసుదేవప్ప అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఫార్మ్ అండ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన జె.రఘోత్తమ్ రెడ్డి స్మారకోపన్యాస కార్యక్రమంలో వాసుదేవప్ప శుక్రవారం పాల్గొని మాట్లాడారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆహార పదార్థాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించినప్పటికీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తగినంత పురోగతి లేదన్నారు. దేశంలో సాలీన 800 మిలియన్ టన్నులకుపైగా ఆహారోత్పత్తులు జరుగుతున్నప్పటికీ ఆహారశుద్ధి రంగం అంతంత మాత్రమే ఉందన్నారు. మరీ ముఖ్యంగా పండ్లు, కూరగాయలలో 60 శాతానికిపైగా వృధా ఉందన్నారు. దేశంలోపండుతున్న పంటల ఉత్పత్తుల్లో 1/3 వంతు ఆహారవృధా జరుగుతోందన్నారు. దీన్ని అరికట్టేందుకు ఆహారశుద్ధి రంగంలో చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వం చేపడుతోన్న కార్యక్రమాలు అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఆయన కొని యాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీఎం ముఖ్యకార్యదర్శి ఎన్.నరసింగ్‌రావు మాట్లాడుతూ, వ్యవ సాయ రంగంలో వృద్ధిరేటు 5 శాతం స్థిరంగా దశాబ్ద కాలంగా కొనసాగితేనే 11 నుంచి 12 శాతం జీడీపీ వృద్ధి సాధ్య మవు తుందని, అందుకు తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఉత్పాదకత పెంపుకన్నా ఫుడ్ సప్లయ్ చైన్‌పై దృష్టి నిలపాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ వి.ప్రవీణ్‌రావు, ఎస్ఆర్ఎస్ఎఫ్ అధ్యక్షుడు అనిల్ కుమార్ ఏపూర్ కూడా ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆరుమంది రైతులకు ఈ సందర్భంగా అవార్డులను ప్రదానం చేశారు. అగ్రిజర్నలిజంలో సి.చంద్రశేఖర్‌కు అవార్డు ప్రదానం చేశారు.

## ఐఓటీ, లోరవాన్‌లతో జీవనశైలిలో విప్లవాత్మక మార్పులు




**హై దరాబాద్,ఆంధ్రప్రభ:** ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) విధానం ఆర్థిక పరిపుష్టికే కాదు, ప్రజల జీవన విధానాన్ని సమూలంగా మార్చే శక్తి ఉందని పరిశ్రమలు, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ స్మార్ట్ సిటీల ఏర్పాటుకు చొరవతీసుకుం టుందన్నారు. జీవన విధానాన్ని పంచే ఐఓటి ఆవిష్కరణ లోరవాన్, ఐఓటి టెక్నాలజీ పై ఆసియా లోనే భారీసదస్సు నగరంలో జరిగింది.పలు రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు తెలంగాణ ప్రభుత్వ బాగస్వామ్యంతో పనిచేస్తున్న సైబర్ ఐ సంస్థ ఈ సదుస్సుకు ఆధ్వర్యం వహించింది. సైబర్ ఐ సీఈఓ రాంగణేష్, ఐహబ్స్ సిఈఓ కవిత, సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఆదా, ఆరోగ్య సంరక్షణ, వాతావరన పర్యవేక్షణతో హా అనేక రంగాల్లో తెలంగాణ ప్రయోగాత్మక కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఐఓటి ను స్థిరంగా, సరమైన రీతిలో అందించేందుకు లోరవాన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వీటి పైన కార్యక్రమయుత సదస్సును ఏర్పాటు చేయటం పట్ల ఐబి హబ్స్, సైబర్ ఐ సంస్థలను అభినందించారు. రాంగణేష్ మాట్లాడుతూ యూరప్ దేశాల్లో విస్తరించిన ఈ విధానం, ఇప్పుడు ఆసియా దేశాలు చైనా, ఇండొనేషియా, మలేషియా, సింగపూర్‌లతో పాటు మనదేశంలో అడుగుపెట్టిందన్నారు.

### ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల వ్యాపారం:సైబర్ ఐ సీఈఓ

రానున్న ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల వ్యాపార అవకాశమున్నట్లు చెప్పారు. చైనాలో ఏటా 2కోట్ల లోరవాన్ డివైస్‌లు అమ్ముడవుతున్నాయన్నారు. అంటే దీని ప్రాధాన్యత నిత్యజీవితంలో ఎంత పెరుగుతుందో అవగతమవుతుందన్నారు. లోపవర్ ,హైరేంజ్ తో పనిచేయటం వల్ల ఇంటర్నెట్ కంటే చౌకగా పనిచేయటంతో అత్యంత ఆధరణ పొందుతుందన్నారు. ఈ సదస్సులు మనదేశాన్ని ఈ రంగంలో ముందుంచేదుకే నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## జహీరాబాద్, మహబూబ్ నగర్ ఎంపీల ఎన్నికపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** జహీరాబాద్, మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల ఎన్నిక చెల్లదంటూ దాఖలైన వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణ ఆరు నెలలకు వాయిదా వేశారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి 2019 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్ మోహన్ రావు, మహబూబ్ నగర్ నియోజకవర్గం నుంచి భాజపా అభ్యర్థిగా పోటీచేసిన డీకె.అరుణ వేరువేరు ఎన్నికల వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ వ్యాజ్యాలకు నంబర్లు కేటాయించేందుకు రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పింది. అయితే రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలపై బదులిస్తామని మదన్ మోహన్ రావు తరపు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్, డీకె.అరుణ తరపున జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపించారు. దీంతో న్యాయమూర్తి సదరు ఈపీలకు నంబర్లు కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ ఆరు నెలలకు వాయిదా వేశారు.

## లాసెట్‌లో 4,245 మందికి సీట్ల కేటాయింపు

**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో చేరడానికి వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 4245 మందికి సీట్ల కేటాయింపు చేశారు. లాసెట్-2019 కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల అనంతరం మొదటి విడత సీట్ల కేటాయింపును శుక్రవారం పూర్తి చేసినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 3 సంవత్సరాలు, 5 సంవత్సరాలలా కోర్సుతోపాటు ఎల్ఎల్ఎంకు సంబంధించి కన్వీనర్ కోటాలో 4783 సీట్లు ఉన్నాయన్నారు. మొదటి విడతలో 7270 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారని వారిలో 4245 మందికి సీట్లను కేటాయించినట్టు తెలిపారు. సీటు పొందిన వారు ఆంధ్రబ్యాంక్‌లో ట్యూషన్ ఫీజును చలాన్ రూపంలో చెల్లించాలని ఆయా కాలేజీల్లో అలాట్‌మెంట్ లెటర్‌తోపాటు ట్యూషన్ ఫీజు చలాన్లతో 19 నుంచి 24 లోపు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని ప్రకటనలో స్పష్టం చేశారు. 21 నుంచి క్లాసులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు.

## విద్యా సంవత్సరం మధ్యలో బదలీలొద్దు

**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను విద్యా సంవత్సరం మధ్యలో బదలీలు చేయొద్దని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్రా ధ్యక్షులు సంజీవయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఇప్పటికే 2019-20 విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో మధ్యలో అధ్యాపకులను బదలీలు చేస్తే ఉన్న అధ్యాపకులపై అధికభారం పడుతుందని.. కాబట్టి బదలీలను చేపట్టవద్దని కార్యవర్గం తీర్మానం చేసిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. విద్యా సంవత్సరం మధ్యలో బదలీలు చేయొద్దని కోరుతూ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితోపాటు కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 4100 మంది అధ్యాపకులు అవసరం కాగా రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో కలిపి కేవలం 2200 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పనిభారం ఉందని.. ఇప్పుడు బదలీలు చేపడితే అదనంగా భారం పడే అవకాశం ఉందని.. కాబట్టి బదలీలు చేయొద్దని వారు డిమాండ్ చేశారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు 6 సూత్రాలు

**● ఆస్పత్రుల అభివృద్ధికి ప్రణాళికలు ● ఏడాదిలోగా పనులు పూర్తి**

**● వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయాలు**



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా జగన్ సర్కార్ ముందడుగు వేసింది. ప్రజలందరికీ వైద్యసేవలు దగ్గర చేసి, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ఆరు సూత్రాలతో కార్యాచరణను రూపొం దిస్తోంది. హాస్పటల్స్ అభివృద్ధి, వైద్యారోగ్యశాఖలో పోస్టు భర్తీ, మందుల కొరత లేకుండా చూడటంతోపాటు రోగులకు ఆర్థిక సహాయం కూడా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. ఈ మేరకు సీఎం జగన్ అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. శుక్రవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వైద్యరంగం ప్రస్తుత పరిస్థితులేమిటి? భవిష్యత్‌లో వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి? అలాగే ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ఇంకా ప్రజలకు ఎలా దగ్గర చేయాలి? తదితర అంశాలపై సమీక్ష నిర్వ హించారు. ముఖ్యంగా ఆరోగ్య శ్రీ, హాస్పటల్స్ అభివృద్ధి, మాతా శిశు మరణాల నివారణపై సీఎం జగన్ సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రసూతి సేవలు అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. జిల్లా లేదా కమ్యూనిటీ లేదా ఏరియా హాస్పటల్స్‌కు వెళ్లే అవకాశం లేకుండానే ఆయా నియోజకవర్గాల్లోనే ప్రసూతి కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అండగా ఉండాలన్నారు. అన్ని కమ్యూనిటీ హాస్పటల్స్, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులను పెద్దెత్తున అభివృద్ధి చేయాలని, దీనికి సంబంధించిన పనులు ఈ సంవత్సరం డిసెంబరులో మొదలుపెట్టి, వచ్చే సంవత్సరం డిసెంబరులో పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే హాస్పటల్స్‌లో మందుల కొరత లేకుండా చూడాలని, ప్రజలకు నాణ్యమైన మందులు సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా మందులు దొరకటం లేదన్న ఫిర్యాదులు రాకూడదని సీఎం స్పష్టం చేశారు. అలాగే హెల్త్ సబ్ సెంటర్లలో కూడా వచ్చే మే నెల నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దీంతోపాటు బోధనాసుపత్రుల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

### రోగులు కోలుకునే వరకు ఆర్థిక సహాయం

శస్త్ర చికిత్సలు చేయించుకన్న రోగులకు వారు కోలుకునేంత వరకు ఆర్థిక సహాయం చేయాలని, డిసెంబర్ ఒకటవ తేదీ నుంచి దీన్ని అమల్లోకి తీసుకు రావాలని సీఎం జగన్ ఆదేశించారు. రోగులకు నెలకు రూ. 5వేలు, లేదా రోజుకు రూ. 225 చొప్పున ఇవ్వాలన్నారు. తీవ్ర కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికే కాక, తలసేమియా, హీమోఫీలియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధులతో బాధపడుతున్న వారికీ రూ. 10వేలను వర్తింపు చేయాలన్నారు. పక్షవాతం, కాళ్లు, చేతులు లేక పనిచేయలేని స్థితిలో ఉనన వారికి రూ. అయిదువేల పింఛన్‌ను అందించాలన్నారు. వచ్చే జన వరి నుంచి వీరికి పింఛన్‌ను అందించాలని ఆదేశించారు.

## ఏపీ సీఎం జగన్ పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ పూర్తి

**●తీర్పు నవంబర్ 1 కి వాయిదా**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అక్రమాస్తుల కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కావాలని కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణ పూర్తయింది. ప్రస్తుతం వైఎస్ జగన్మో హన్‌రెడ్డి ముఖ్య మంత్రి కావడం వల్ల సెక్యూరిటీ సమస్యలు తలెత్తుతున్నాయని, వారా నికి ఒకసారి కోర్టుకు హాజరు కావడం కష్టసాధ్యంగా ఉందని ఆయన తరపు న్యాయ వాది కోర్టుకు వివరించారు. అసౌకర్యంగా ఉందని హాజరు నుంచి మినహాయింపు కోరడం లేదని, సీఎంగా పరిపాలన చేయాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత జగన్మో హన్‌రెడ్డిపై ఉందని న్యాయవాది తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసమే మిన హాయిం పు కోరుతున్నామని చెప్పారు. సాక్షు లను ప్ర భావితం చేసినట్లు గత ఆరేళ్లలో ఏ ఒక్క ఆరోపణైనా ఉందా? అని అన్నారు. కౌంటర్ దాఖలు చేసిన సమయంలో సీబీఐ వాడిన భాషపై జగన్ తరపు న్యాయ వాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఊహాజనిత ఆరోపణలతో పిటిషన్‌కు సంబంధం లేని అంశాలను సీబీఐ తన కౌంటర్‌లో ప్రస్తా వించిందని ఆరోపించారు. ఇరుపక్షాల వాదనలు విన్నకోర్టు.. తీర్పును నవంబర్ 1కి వాయిదా వేసింది.

## డాక్టర్ తులసీదేవికి ఘన నివాళి

**మాజీ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణతోపాటు నివాళులర్పించిన పలువురు ప్రముఖులు**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వ్యవస్థాపక సభ్యురాలు, ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ స్థాపకురాలు డాక్టర్ తులసీదేవి భౌతికకాయం శుక్రవారం రాత్రి నగరానికి చేరుకుంది. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో శోకతప్త హృదయంతో పలువురు ప్రముఖులు నివాళులర్పిం చారు. వీరిలో ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెరాస ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎంపీ మధుయాష్కి, గౌడ్, కిమ్స్ డైరెక్టర్ కృష్ణయ్య, జీవీకే ఎంఐఆర్ రాజీవ్ కృష్ణం, ఇండో-అమెరిక్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఆర్‌వి ప్రభాకర్‌రావు, మెడికల్ డైరెక్టర్ టీఎస్ రావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పన రఘునాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, జన్మభూమిపై మమకారంతో ఇక్కడి తెలుగు వారికి సేవ చేయాలన్న తపనతో డాక్టర్ తులసీ స్వర్గీయ ఎన్టీఆర్ ఆసుపత్రి పెట్టాలని నిర్ణయించు కున్న నాటినుంచి మరణించే వరకు అంకితభావంతో పనిచేశారన్నారు. అభివృద్ధికి నిధుల సేకరణలో ప్రత్యేక శ్రద్ధ చూపించే వారన్నారు. ఎందరో పేద క్యాన్సర్స్ రోగులకు మేలు చేసిన ఆ వ్యక్తి మన వద్ద లేకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి స్ఫూర్తికి అనుగుణంగా సంస్థ అభివృద్ధికి వారి కుటుంబ సభ్యులు కృషి చేస్తారని ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.నందమూరి బాలకృష్ణ ఆమె సేవలను గుర్తు చేసుకంటూ, ఆమె అకాల మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆసుపత్రి పునాది నుంచి ప్రతి నిర్మాణం వెనక డాక్టర్ తులసీ కృషి ఉందన్నారు. సామాన్య ప్రజలకు అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ ఆసుపత్రి అందుబాటులో రావడానికి ఆమె సేవలు కీలకంగా పనిచేశాయనిపేర్కొన్నారు. ఆమెసేవాభావం చిరస్థాయిగా సమాజంలో నిలబెడుతుం దన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకు వెళతామన్నారు.తులసీ మనువరాలు సత్య అమ్మమ్మతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసు కుంటూ నిరంతరం కష్ట పడేవారని తెలిపారు. ఇతరులకు సహాయం చేసే స్థితిలో తాము ఉండాలని నలుగురికి ఉపయోగ పడాలని ఎప్పుడూ చెబుతుండే వారిన శోకతప్త హృదయంలో గుర్తు చేసుకున్నారు.

## సొంతంగా సీఎం.. శివసేన లక్ష్యం

**మహా అభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు**

**ముంబై :** మహారాష్ట్రలో సొంతంగా ముఖ్యమంత్రిని ఎన్నుకోవడం శివసేన లక్ష్యంగా పెట్టుకుందని ఆ పార్టీ నేత ప్రియాంక చతుర్వేది చెప్పుకొచ్చింది. 100కు పైగా స్థానాల్లో పార్టీ కచ్చితంగా గెలుస్తుందని, ప్రజలకు పార్టీ ఇచ్చిన వాగ్దానాలను పూర్తి స్థాయిలో నెరవేర్చిందన్నారు. అవి ప్రభుత్వపరమైనవి అయినా.. వేరేవి అయినా వాటికి పరిష్కారం చూపడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకుని ముందుకు వెళ్లిందని తెలిపారు. ప్రజలు ఏవిధంగా అయితే భావించారో అదేవిధమైన పాలన తాము అందించామన్నారు. మహారాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ, శివసేన పార్టీలు ఏకం అయ్యాయని, కానీ ఇరు పార్టీల ఆలోచనా విధానాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. 30 ఏళ్లుగా బీజేపీతో కలిసి ముందుకు వెళ్తున్నామని, ప్రజల వాయిస్‌ను ప్రభుత్వానికి తెలియజేయడమే తమ ప్రధాన కర్తవ్యం అని చెప్పుకొచ్చారు. బీజేపీ, శివసేన మధ్య ఎలాంటి మనస్పర్ధలు లేవని, ఇక్కడ బీజేపీ వర్సెస్ శివసేన కాదని, సిటీ వర్సెస్ పర్యావరణం అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. పర్యావరణానికి హానీ కలిగిస్తూ అభివృద్ధి చేయడానికి తాము వ్యతిరేకమని అన్నారు. చెట్లు నరికి, జంతువులను హింసిస్తూ చేస్తున్న అభివృద్ధికి దూరంగా ఉంటామని వివరించారు. బీజేపీకి శివసేన జూనియర్ పార్ట్నర్‌గా లేదని, సీనియర్ పార్ట్నర్‌గా ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎన్సీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా బీజేపీతో శివసేన తెగదెంపులు చేసుకోలేదని అన్నారు. ఆదిత్య ఠాక్రే పోటీకి దిగడం పెద్ద ఆశ్చర్యం ఏం కాదని, బాల్ ఠాక్రే, ఉద్దవ్ ఠాక్రే జనరేషన్ వేరు అని, ఇప్పుడున్న జనరేషన్ వేరు అని చెప్పుకొచ్చారు. సీఎం పదవిపై ఆశ లేదని, సొంతంగా మెజార్టీ సాధించుకుని ఆ పీఠం ఎక్కాలనేది తమ లక్ష్యం అని, ప్రతీ శివసేన సైనికుడు ముఖ్యమంత్రి అన్న ఉద్ధవ్ ఠాక్రే నినాదాన్ని తానూ నమ్ముతానని వివరించారు.

## ముంబై బీజేపీ చీఫ్‌కు ఈసీ నోటీసులు

**ముంబై :** ముంబై బీజేపీ చీఫ్‌కు ఎన్నికల కమిషన్ శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా రెచ్చగొట్టే విధంగా బీజేపీ అధ్యక్షుడు మంగల్ ప్రభాత్ లోధా వ్యాఖ్యలు చేశారని ఈసీ ఆరోపించింది. లోధ కొన్ని రోజుల క్రితం ముంబాదేవి నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. ఇక్కడ అత్యధికంగా ముస్లిం జనాభా ఉంటుంది. 1990 కాలంలో ముంబైలో జరిగిన దాడులకు, ఈ ప్రాంతానికి సంబంధం ఉందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దాడులకు ఉపయోగించిన మందుగుండు సామాగ్రిని ఇక్కడి నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోనే తయారు చేయబడిదంటూ చెప్పుకొచ్చాడు. దీంతో ఎన్నికల కమిషన్ లోధాకు నోటీసులు జారీ చేసింది. దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది.

## సోనియా స్థానంలో రాహుల్..!

**నేడు మహేంద్రఘర్‌లో ఎన్నికల ర్యాలీ**

**న్యూఢిల్లీ :** హర్యానా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహించే ర్యాలీకి కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ హాజరుకావడం లేదని ఆ పార్టీ అధిష్టానం శుక్రవారం ట్విట్టర్ ద్వారా తెలియజేసింది. మహేంద్రఘర్‌లో నిర్వహించే ర్యాలీకి సోనియా గాంధీ హాజరుకావాల్సి ఉండగా... అనివార్య కారణాలతో రాలేకపోతున్నారని, ఆమె స్థానంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వస్తున్నట్టు హర్యానా కాంగ్రెస్ నేతలు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మహేంద్రఘర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు వివరించారు. సోనియా గాంధీ కారణం చెప్పకుండా తమ విన్నపాన్ని తిరస్కరించిందని తెలిపారు. ఆగస్టులో సోనియా గాంధీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తరువాత చేపట్టే తొలి ర్యాలీకి హాజరుకాకపోవడంపై హర్యానా కాంగ్రెస్ శ్రేణులు ఒకింత అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం.



# హు'జోర్' ఎవరిది!?

● నేటితో ముగియనున్న హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారం ● సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకనేందుకు కాంగ్రెస్

● పాగా వేయాలని తెరాస ● పట్టు సాధించేందుకు తెదేపా, భాజపా యత్నం ● ప్రచారంలో పాల్గొన్న ముఖ్య పార్టీల అగ్రనేతలు

● ఎల్లుండి పోలింగ్.. విస్తృత ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారానికి శనివారం తెర పడనుంది. ఇరవై రోజులుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హోరాహోరి ప్రచారం నిర్వహించారు. నేటి సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగుస్తుండడంతో కాంగ్రెస్, తెరాస, భాజపా, తెదేపాలకు చెందిన నేతలు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో, గ్రామాల్లో పాదయాత్రలు, రోడ్‌షోలు నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి నల్గొండ లోక్‌సభకు ఎన్నిక కావడంతో గతంలో ఆయన ప్రాతినిధ్యం వహించిన హుజూర్‌నగర్ శాసనసభ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున తన సతీమణి, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిని పోటీకి నిలిపారు. తెరాస తరఫున గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన శానంపూడి సైదిరెడ్డిని తెరాస అధినేత కేసీఆర్ అభ్యర్థిగా ప్రకటించారు. తెదేపా తరఫున మాజీ జడ్పీటీసీ సభ్యురాలు చావ కిరణ్మయి, భాజపా తరఫున ఆ పార్టీకి చెందిన ముఖ్య నేత డాక్టర్ రామారావు పోటీ చేస్తున్నారు.

### ఎవరి లెక్కలు వారివి

గత ఎన్నికలో ఏడువేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ ఉపఎన్నికలో కనీసం 30వేల మెజారిటీతో విజయం సాధిస్తామన్న ధీమాతో ఉన్నారు. అయితే, కాంగ్రెస్‌కు సిట్టింగ్ స్థానమే దక్కకుండా చేస్తామని ఈ ఎన్నికలో కాంగ్రెస్ గల్లంతు కావడం ఖాయమని తెరాస ప్రకటించింది. ఆ దిశగానే ఉపఎన్నికల ప్రచారం నిర్వహించింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమిగా ఏర్పడి కాంగ్రెస్, తెదేపా, తెలంగాణ జనసమితి, సీపీఐలు సీట్లు సర్దుబాటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఉపఎన్నికలో తెదేపా అభ్యర్థిని నిలబెట్టింది. పార్టీ అధినేత చంద్రబాబు తెలంగాణలో పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని నిర్ణయించి ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని ఎలాగైనా బరిలోకి దింపాలని ఆదేశించడంతో రాష్ట్ర నాయకత్వం కిరణ్మయి పేరును ఖరారు చేసింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో సత్తా చాటిన ఘనత తమకుందని, అందుకే హుజూర్‌నగర్‌లోనూ తమ అభ్యర్థిని బరిలోకి దించామని పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. సీపీఐ(ఎం) సైతం ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని ప్రకటించి నామినేషన్ వేయించినా అవి తిరస్కరణకు గురికావడంతో మరో స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### పార్టీల మోహరింపు ఇలా...

ఈ ఎన్నికను కాంగ్రెస్, తెరాసలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించాయి. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఈ ఎన్నికకు సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రచార బాధ్యతలన్నీ ఉత్తమ్ తన భుజస్కంధాలపై వేసుకున్నారు. తెరాస తరఫున ఆ పార్టీ శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి పార్టీ అధినేత కేసీఆర్ ఇంఛార్జి బాధ్యతలను అప్పగించారు. భాజపా తరఫున మండలానికి నలుగురు సీనియర్లను ఎంపికచేసి వారితో ప్రచారం నిర్వహించింది. తెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు తెలంగాణకు చెందిన ఆ పార్టీ సీనియర్లు ప్రచారంలో పాలుపంచుకున్నారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇతర ముఖ్య నేతలను తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు ప్రచారంలో పాల్గొనేలా చేశారు. ఒక్కో మండలానికి ఒక మంత్రితో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలకు ప్రచార బాధ్యతలను అప్పగించారు. సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్లు మల్లు భట్టివిక్రమార్క, దామోదర్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వి.హనుమంతరావు, దాసోజు శ్రవణ్, మల్లురవి, కుసుమ కుమార్ తదితరులు విడతల వారీగా నియోజకవర్గంలో పర్యటించి ప్రచారాన్ని నిర్వహించారు. భాజపా తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, పార్టీ సీనియర్లు వివేక్ వెంకటస్వామి తదితరులు ఆ పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు.

### విమర్శలు.. హామీలు

నియోజకవర్గానికి తాను రూ.400 కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి చేశానని, మరోసారి తన సతీమణి పద్మావతికి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉత్తమ్ నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. వరుసగా నాలుగుసార్లు హుజూర్‌నగర్ తాను విజయం సాధించానని, ప్రతిపక్షంలో ఉన్నా.. పాలకపక్షంలో ఉన్నా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్నానని గుర్తుచేశారు. ఉత్తమ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారని ఏనాడు కూడా తన నియోజకవర్గానికి సంబంధించి పథకాలు, కార్యక్రమాలు కావాలని సీఎంకు లేఖ కూడా రాయలేదని తెరాస ప్రచారంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. ఉపఎన్నికలో తెరాస అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పద్మావతి గెలిస్తే ఆ కుటుంబానికే ప్రయోజనం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించిన నేతలు ఆరోపించారు. తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని తాను స్థానికురాలినని జెడ్పీటీసీగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెదేపా అభ్యర్థి కిరణ్మయి ఓటర్లను కలుస్తూ తనను ఆశీర్వదించాలని కోరారు. జాతీయ స్థాయిలో మోడీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, పథకాలు రాష్ట్రంలో అమలు కావాలంటే భాజపాకు ఓటు వేయాలని ఆ పార్టీ అభ్యర్థి రామారావుతోపాటు ప్రచారం నిర్వహించిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఇతర నేతలు ఓటర్లను కోరారు. స్వతంత్ర అభ్యర్థులు పెద్దఎత్తున పోటీలో ఉన్నప్పటికీ పోరు తెరాస, కాంగ్రెస్ పార్టీల మధ్యనే విశ్లేషణలున్నాయి.

### ఈసీ అప్రమత్తం.. ముగ్గురు పరిశీలకులు

ఉపఎన్నిక జరుగుతున్న నియోజకవర్గంలో కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు పరిశీలకులను నియమించడం హుజూర్‌నగర్‌లోనే జరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జాతీయ స్థాయిలో అనేక అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరుగుతున్నా ఏ నియోజకవర్గానికి హుజూర్‌నగర్ తరహాలో ముగ్గురు పరిశీలకులను పంపించలేదని వారు పేర్కొన్నారు. ధన, మద్యం ప్రభావం ఈ నియోజకవర్గంలో భారీఎత్తున జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో పాటు భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో ముగ్గురు పరిశీలకులను నియమించారని తెలుస్తోంది. సోమవారం (21వ తేదీ) ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఓటర్లు ఈ ఎన్నికలో తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్టు ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు.

### ఎల్లుండి పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి

సోమవారం (21వ తేదీ) ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఓటర్లు ఈ ఎన్నికలో తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్టు ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. సాంకేతిక సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, అవసరమైన పోలీస్ బలగాలను రంగంలోకి దింపామని సూర్యాపేట జిల్లా ఎస్పీ తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు డబ్బు, మద్యం పంపిణీపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. ఇతర ప్రాంతాల నుంచి హుజూర్‌నగర్‌లో మకాంవేసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్థానికేతరులంతా శనివారం సాయంత్రం 5 గంటల్లోపు నియోజకవర్గాన్ని విడిచి వెళ్ళాలని రిటర్నింగ్ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.

## రేవంత్‌రెడ్డి దొరికిన దొంగ.. ఓ పిట్టల దొర



● మీడియాతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** రేవంత్‌రెడ్డి దొరికిన దొంగ.. ఓ పిట్టల దొర, మళ్ళీ జైలుకు పోవడం ఖాయమని, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మతిభ్రమించి పిచ్చిమాటలు మాట్లాడుతున్నాడని ఆయనను పిచ్చి ఆసుపత్రిలో చేర్పిస్తామని హుజూర్‌నగర్ ఉప ఎన్నికల తెరాస ఇంచార్జీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎంపీ బడుగుల లింగయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో శుక్రవారం రాత్రి టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పెద్ద నాయకుడినని భ్రమ పడుతున్నాడని, పగటి కలలు కంటున్నాడని, పద్మావతికి టిక్కెట్ వద్దని వ్యతిరేకించిన ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మొసలి కన్నీరు కారుస్తున్నాడని విమర్శించారు. తప్పుత్రాగి ఏదిపడితే అది మాట్లాడితే ఊర్కొనేది లేదని కోమటిరెడ్డికి హెచ్చరికలు జారీ చేశారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే కాంగ్రెస్ నేతలను తెలంగాణ ప్రజలు తరిమికొడతారని, తెలంగాణ ఉద్యమాన్ని తాకట్టుపెట్టి మంత్రి పదవి పొందిన ఉత్తమ్‌కి ఏ ముఖం పెట్టుకొని కోమటిరెడ్డి ప్రచారం చేస్తున్నారని అన్నారు. అంతిమ విజయం టీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు.



## ఉప ఎన్నిక ఫలితమే కీలకం

● నేరేడుచర్ల, పాలకవీడు రోడ్‌షోలో రేవంత్‌రెడ్డి

**నేరేడుచర్ల/పాలకవీడు, ప్రభన్యూస్ :** హుజూర్ నగర్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నేరేడుచర్ల పాలకవీడు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉత్తమ్ సతీమణి పద్మావతి గెలుపు కోరుతూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి శుక్రవారం రోడ్‌షో నిర్వహించారు. హుజూర్‌నగర్‌లో జరుగుతున్న ఉప ఎన్నిక కేవలం ఇక్కడ ప్రజలకు మాత్రమే పరిమతం కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి జరిగే ఎన్నికలని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఉప ఎన్నికల్లో ఏ చిన్నతప్పు జరిగినా పాతాళంలోకి జారిపోతాం. కేసీఆర్ ప్రభుత్వానికి చెక్ పెట్టాలంటే ఉప ఎన్నిక తీర్పే కీలకం. ఈ అదృష్టం హుజూర్‌నగర్ ప్రజలకు దక్కింది. సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు ఆలోచన చేసి కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి.ఇద్దరు ఆర్టీసీ కార్మికులు ఆత్మబలిదానాలు చేసుకుంటే కనీసం పరామర్శించలేదని ఆయన విమర్శించారు. ప్రచారంలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు. రేవంత్ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.

## హుజూర్‌నగర్‌లో నేడు కిషన్‌రెడ్డి రోడ్‌షో

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రామారావుకు మద్దతుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం రోడ్‌షో నిర్వహించనున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం గం. 11 లకు మఠంపల్లి, మధ్యాహ్నం గం. 12 లకు వేపల సింగారం, మధ్యాహ్నం గం. 12.30 లకు మేళ్ళచెరువు, మధ్యాహ్నం గం. 1 కి చింతలపాలెంలలో రోడ్‌షోల ద్వారా ప్రచారం చేయనున్నారు. దీంతో శ్రేణుల్లో కొంత ఊపు వచ్చింది. పార్టీలో మరింత జోష్ వచ్చేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన పనికి వస్తుందని నేతలు భావిస్తున్నారు.

# హాస్టల్ రూం టు సీఎం కుర్చీ



● ఎన్నికల ఎత్తుగడలో దేవేంద్రజాలం

● మరాఠా రిజర్వేషన్లతో పెరిగిన క్రేజ్ ● నిరాడంబరతకు కేరాఫ్ ఫడ్నవిస్

**ముంబై:** అక్టోబర్ 19తో (నేడు) మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూరయ్యాయి. 2014 ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీ సాధించడంతో మహారాష్ట్ర సీఎంగా దేవేంద్ర ఫడ్నవిస్ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇంతకుముందు ఫడ్నవిస్ ఎలా ఉండేవారో చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. బీజేపీ నేత ఒకరు ట్విట్టర్ వేదికగా పోస్టు చేసిన ఫడ్నవిస్ ఫొటో ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. ఎంతో సాధారణంగా.. దక్షిణ ముంబై హాస్టల్‌లోని ఓ చిన్న గదిలో టీ తాగుతూ ఆ ఫొటోలో ఫడ్నవిస్ కనిపించారు. నిరాడంబరతకు ట్రేడ్ మార్క్ అంటూ పోస్టు చేసిన ఈ చిత్రాన్ని ఉద్దేశించి పలువురు అభినందిస్తూ కామెంట్లు పెట్టారు. హాస్టల్ రూం నుంచి నేరుగా సీఎం కుర్చీలో వెళ్లి కూర్చునేందుకు ఆయన ఎంతో కష్టపడ్డారు. ఐదేళ్లు పూర్తి కాలం బాధ్యతలు నిర్వర్తించిన సీఎంగా ఫడ్నవిస్ చరిత్ర కూడా సృష్టించారు. కీలక నేతగా, సీఎంగా ఎలా ఎదిగారో వివరిస్తూ రూపొందించిన ఓ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. పుణె శివారులోని పురంధర్ ర్యాలీలో ఫడ్నవిస్ పాల్గొన్న అంశాన్ని కూడా జోడించారు.

### అనుచరులతో పక్కా వ్యూహాలు

2014లో బీజేపీ, శివసేన వేర్వేరుగా పోటీ చేశాయి. కానీ 2019లో మహా కూటమి ఏర్పాటు చేయడంలో ఫడ్నవిస్ కీలక పాత్ర పోషించారు. సీట్ల సర్దుబాటులో అనుకున్నది సాధించి కీలక రాజకీయ వ్యూహకర్త అనిపించుకున్నారు. 288 సీట్లలో బీజేపీ 164, శివసేన 124 స్థానాల్లో పోటీ చేస్తున్నారు. శివసేనతో పొత్తు కుదుర్చుకోవడంలో ఫడ్నవిస్ తన కీలక అనుచరులను ఎంచుకుని విజయం సాధించారు. నీటి వనరుల శాఖ మంత్రి విజయ్ శివ్‌తారే, పురందర్ సేన అభ్యర్థి కీలక పాత్ర పోషించారు.

### రుణమాఫీపై కొంత వ్యతిరేకత

90 లక్షల మంది రైతులకు రుణాలు మాఫీ చేస్తామని ఫడ్నవిస్ చెప్పారని, కానీ కేవలం 44 లక్షల మందికి చేశారనే విమర్శలు ఫడ్నవిస్‌పై వినిపిస్తున్నాయి. ఈ విషయాలు ఫడ్నవిస్‌ను రెండో సారి సీఎం కుర్చీ నుంచి దూరం చేయ లేవనే వాదనలు కూడా వస్తున్నాయి. ప్రధాని అభ్యర్థిత్వానికి ఫడ్నవిస్ కూడా సరైన నేతే అని శివసేన మంత్రి విజయ్ అభిప్రాయపడ్డాడు. మహారాష్ట్ర నుంచి ఫడ్నవిస్‌ను ప్రధాని చేయాలని తమ కల అని, ప్రమోద్ మహాజన్ చనిపోయారని, శరద్ పవార్ కీలక నేత ఉన్నా ఇప్పుడా స్థాయి ఆయనకు లేదని, మరో ఐదు నుంచి పదేళ్ల కాలంలో దేవేంద్ర ఫడ్నవిస్ తప్పకుండా దేశానికి ప్రధాని అవుతారన్నారు.

### విమర్శనాస్త్రాలే ఆయుధం

ప్రజలతో మమేకమవ్వడం, భయపడకుండా విపక్షాలను ధీటుగా ఎదుర్కోవడం, ఇచ్చిన హామీలను నెరవేర్చడం వంటి ఎన్నో కీలక అం శాలు ఫడ్నవిస్‌లో కనిపిస్తాయి. మూడేళ్ల క్రితం వరకూ ఫడ్నవిస్‌కు పాలనాపరంగా ఎక్కువ కాలం సీఎంగా కొనసాగుతారని ఎవ రూ భావించలేదు. మహారాష్ట్రలో ఎంతో కీల కంగా ఉన్న మరాఠాలు ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్య రంగంలో తమకు రిజర్వేషన్ కల్పించా లంటూ ప్రభుత్వంపై తీవ్రంగా ఒత్తిడి తీసుకొ చ్చారు. ధీటుగా ఎదుర్కొని రిజర్వేషన్లు కల్పించడంతో ఆయన క్రేజ్ మరింత పెరిగింది. చట్టాల్లోని విషయాలు తెలుసుకుని అంతిమంగా మరాఠాలకు రిజర్వేషన్ల విషయంలో విజయం సాధించారు.

## తగ్గిన సంపన్న అభ్యర్థులు

● 'మహా' అభ్యర్థులపై ఏడీఆర్ నివేదిక

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కోటీశ్వరులైన అభ్యర్థుల సంఖ్య 2014తో పోలిస్తే కొంత తగ్గింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 1,095 మంది కోటీశ్వరులు ఎన్నికల బరిలో ఉంటే.. 2019లో ఈ సంఖ్య 1007గా నమోదైంది. తమ వద్ద రూపాయి కూడా విలువ చేసే ఆస్తులు లేవని 59 మంది అభ్యర్థులు ప్రకటించారు. మహారాష్ట్ర ఎన్నికల సంఘం, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) కలిసి రూపొందించిన జాబితా ప్రకారం.. 2019లో 3,112 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 1007 మంది కోటీశ్వరులు ఉన్నారు. పార్టీల వారీగా పరిశీలిస్తే.. 162 మంది బీజేపీ అభ్యర్థుల్లో 155 మంది కోటీశ్వరులు కావడం గమనార్హం. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న 147 మందిలో 126 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. శివసేన తరఫున పోటీ చేస్తున్న 124 మంది అభ్యర్థుల్లో 116 మంది కోటీశ్వరులు. ఎన్‌సీపీ నుంచి 116 మంది అభ్యర్థుల్లో 101 మంది కోటీశ్వరులు ఉన్నారు. ఎంఎన్ఎస్ నుంచి 99 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో 52 మంది తమ ఆస్తుల విలువ రూ.1 కోటి కంటే ఎక్కువ ఉందంటూ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నట్టు నివేదిక ద్వారా తెలిసింది. మొత్తంగా అభ్యర్థుల సగటు ఆస్తి విలువ రూ.4.21 కోట్లుగా ఉంది.

## ప్రచారానికి నేటితో తెర

● 2 రాష్ట్రాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** హోరాహోరీగా సాగిన మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. ఈనెల 21న రెండు రాష్ట్రాల్లో పోలింగ్ జరగనుంది. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది. రెండు రాష్ట్రాల్లోనూ ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 24వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలు ఉన్నాయి. ఇక హర్యానా అసెంబ్లీలో 90 స్థానాలు ఉన్నాయి. హర్యానాలో మొత్తం 1169 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. ఎన్నికల నిర్వహణ కోసం 19,578 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 27,611 వీవీ ప్యాట్లతో పోలింగ్ జరపనున్నారు. ఇదిలావుండగా లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో బీజేపీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా తీవ్రంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు అంశాన్ని ఎన్నికల సభలో ప్రస్తావిస్తున్నారు. జాతీయవాదాన్ని దేశభక్తి అంటే ఉద్వేగ భరితమైన అంశాలను ప్రస్తావిస్తున్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలను నియంత్రించేందుకు ప్రణాళికలను అమలుచేస్తున్నారు.

# కాంగ్రెస్ ఓటమిని ఒప్పుకుంది

● 10 నుంచి 15 స్థానాలకే పరిమితమని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు

● ఇది ఓటమిని అంగీకరించటమే ● హర్యానా ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ



**హిసార్ (హర్యానా) :** హర్యానా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ విరుచుకుపడ్డారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించిందని ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చంటూ పార్లమెంట్ ఆవరణలో ముగ్గురు కాంగ్రెస్ నేతలు హర్యానాలో తాము 10 నుంచి 15 సీట్లు మాత్రమే గెలుసామని చెప్పారని ప్రస్తావించారు. ఇది ఓటమిని అంగీకరించినట్టే అని ఎద్దేవా చేశారు. హర్యానాలో ఓటమి భారం మోయడం తప్ప ఇప్పుడు కాంగ్రెస్ ఏం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల 'నేతాగిరి' అహంకారం హర్యానాలో ఉండనివ్వొద్దు అంటూ సూచించారు. ఐదేళ్ల పాటు కేంద్రంలో, హర్యానాలో బీజేపీ ప్రభుత్వం ఎంతో మంచి పాలన అందించిందని, అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి చేసిందని అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని హర్యానాలో బీజేపీకి భారీ మెజార్టీని అందించాలని కోరుతున్నట్టు చెప్పుకొచ్చారు. డబుల్ ఇంజిన్‌తో (కేంద్రం, హర్యానాలో బీజేపీ) ప్రగతి పథంలో దూసుకెళ్తుందని అన్నారు. దుశ్యంత్ చౌతాలా పార్టీ జన్ నాయక్ జనతా పార్టీపై కూడా మోడీ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ అపూర్వమైన మద్దతు ఉందంటే.. అది పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలే అని అన్నారు. బీజేపీ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే.. ప్రతిపక్షాలు అంతర్గత కుమ్ములాటలో బిజీగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.

## హర్యానా అసెంబ్లీ ఎన్నికలు-2019

# చతుర్ముఖ పోటీ

● అసలు పోటీ బీజేపీ-కాంగ్రెస్ మధ్యే ● జాట్ల ఓట్లను చీలుస్తున్న చౌతాలా పార్టీలు... బీజేపీకి ప్రయోజనం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి చతుర్ముఖ పోటీ నెలకొంది. ప్రధాన పోటీ మాత్రం బీజేపీ, కాంగ్రెస్ నెలకొందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఒంటరిగా 90 స్థానాలకు పోటీకి దిగాయి. ఓం ప్రకాష్ చౌతాలాకు చెందిన ఐఎన్ఎల్‌డీ పార్టీ 81 సీట్లలో పోటీ చేస్తుంది. నూతనంగా ఏర్పాటుచేసిన జననాయక జనతా పార్టీ సైతం పోటీకి దిగింది. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ మునిమనవడు దుష్యంత్ చౌతాలా ఈ పార్టీని స్థాపించారు. ఈనెల 21న హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 90 స్థానాలకు 1169 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య ప్రధానమైన పోటీ నెలకొంది. అబ్ కీ బార్ పచతర్ పార్... అంటే ఈసారి 75 స్థానాలు దాటాలి అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళుతోంది. ప్రధానంగా తన ఎన్నికల ప్రచారంలో బీజేపీ ఆర్టికల్ 370 రద్దు, ఐదేళ్లలో సీఎం కట్టర్ చేసిన అభివృద్ధిని విస్తృతంగా ప్రస్తావిస్తోంది. అసోంలో ఇటీవల రూపొందించిన ఎన్నార్సీని సైతం ప్రస్తావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆర్థిక మందగమనం పెరుగుతున్న నిరుద్యోగం, రైతాంగ సంక్షోభం తదితర అంశాలను ప్రముఖంగా వినిపిస్తోంది.

ఓం ప్రకాష్ చౌతాలాకు చెందిన ఐఎన్ఎల్‌డీ, దుష్యంత్ చౌతాలాకు చెందిన జేజేపీ స్థానిక రాజకీయాలను ఫోకస్ చేస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే స్థానికులకు 75 శాతం ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పిస్తామని దుష్యంత్ హామీలు గుప్పిస్తు న్నారు.

### జాట్లదే కీలక పాత్ర

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జాట్లు కీలక పాత్ర పోషిస్తారు. ప్రధానంగా ఐదు జిల్లాల్లో జాట్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దాదాపు 36 అసెంబ్లీ సీట్లలో వారు ఎట్లా చెబితే అట్లా విజయం సాధించే అవకాశం ఉంటుంది. సహజసిద్ధంగా కాంగ్రెస్ పార్టీకి, ఐన్ఎల్‌డీకి మద్దతు ఇస్తారు. అయితే ఈసారి కొత్తగా వచ్చిన జేజేపీ సైతం జాట్ల ఓట్లను చీల్చే అవకాశం కనిపిస్తోంది. ఇదే గనుక జరిగితే అది బీజేపీకి భారీ ప్రయోజనం చేకూరుతుంది. గత ఎన్నికల్లో సైతం బీజేపీ జాట్‌యేతర సామాజిక వర్గాలను నమ్ముకుంది. ప్రధానంగా పంజాబీలపై ఆధారపడటం తో బీజేపీ గత ఎన్నికల్లో సునాయాస విజయాన్ని నమోదు చేసుకుంది.

### వ్యతిరేక ఓట్లలో చీలిక

బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నవారు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మూడు పార్టీలు పోటీ చేస్తుండడంతో ఆ మేరకు వ్యతిరేక ఓటు చీలుతుంది. ఈ పరిణామం బీజేపీకి అనుకోని వరంగా మారుతోంది. కాంగ్రెస్ పార్టీలో మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, ఇతర నేతల మధ్య నెలకొన్న విభేదాలు పార్టీ అభ్యర్థుల విజయావకాశాలు దెబ్బతినే అవకాశం కనపడుతోంది. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వంపై భూపిందర్ సింగ్ హుడా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 370 రద్దుకు కాంగ్రెస్ వ్యతిరేకత పై ఆయన ప్రశ్నించారు.

ఇటు ఐఎన్ఎల్‌డీతో గొడవ పడి బయటికి వచ్చిన దుష్యంత్ మరో పార్టీ పెట్టారు. ఈ పరిణామం వల్ల జాట్ల ఓటు బ్యాంకు దెబ్బతినే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామాన్ని జాగ్రత్తగా గమనిస్తున్న బీజేపీ జాట్ల ఓట్లను తమవైపు తిప్పుకునేందుకు అన్ని వ్యూహాలను అమలు చేస్తోంది. గెలిచే అవకాశం ఉన్న బీజేపీ వైపు ఓటు వేయాలని నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# సుప్రీం కొత్త సీజే జస్టిస్ బొబ్డే



- కేంద్రానికి సిఫార్సు చేసిన సీజే గొగోయ్
- సాంప్రదాయకంగా సీనియర్‌ను సూచించిన సీజే
- నవంబర్ 18న బోబ్డే ప్రమాణం స్వీకారం!

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్ట్ తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎస్ఏ బోబ్డే అర్హుడని సూచిస్తూ కేంద్రప్రభుత్వానికి ప్రస్తుత సీజే జస్టిస్ గొగోయ్ సిఫార్సు చేశారు. తన తరువాతి సీనియర్‌ను ప్రభుత్వానికి సూచించే సాంప్రదా యంలో భాగంగా జస్టిస్ బోబ్డే పేరును లేఖ ద్వారా తెలియజేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖకు శుక్రవారం ఆయన లేఖ రాశారని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. తన వారసుడిగా సిఫార్సు చేసే సంప్రదాయంలో భాగంగా బొబ్డే పేరును లేఖ ద్వారా తెలిపారని పేర్కొన్నాయి. నవంబర్ 18న సుప్రీం 47వ ప్రధానన్యాయ మూర్తిగా జస్టిస్ బొబ్డే ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయి. ఏప్రిల్ 23, 2021వరకూ ఆయన పదవిలో కొనసాగనున్నారు. అంటే ఒక ఏడాది ఐదు నెలల పాటు ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఇదిలావుండగా భారత 46వ ప్రధాన న్యాయమూర్తిగా అక్టోబర్ 3, 2018న ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ గొగోయ్ వచ్చే నెల నవంబర్ 17న పదవీవిరమణ చేయనున్నారు. మొత్తం 13 నెలల 15 రోజులపాటు ఆయన సీజేగా కొనసాగారు. ఇదిలావుండగా న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయి నియామకాల విషయంలో అనుసరించే మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్ ప్రకారం... చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా కార్యాలయ నిర్వహణకు సుప్రీం కోర్టులోని సీనియర్ జడ్జీ అర్హుడని నిబంధనలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగా తదుపరి సీజేఐ పేరును ప్రస్తుత సీజే సిఫార్సును చేశారు. న్యాయ మంత్రిత్వ శాఖకు అందిన ఈ లేఖ ప్రధానమంత్రి మోడీకి వద్దకు చేరనుంది. ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సమాచారం అందించనున్నారు.



# కల్కి ఆశ్రమంలో రూ. 500 కోట్లు

ఐటీ సోదాల్లో భారీగా నగదు..

88 కిలోల బంగారం సీజ్

**తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో :** వరదయ్యపాళెం కేంద్రంగా రెండు రాష్ట్రాలకు విస్తరించిన కల్కి ఆశ్రమ వ్యవస్థలపై నిర్వహించిన దాడుల్లో రూ. వంద ల కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, నగదు పట్టుబడినట్లు ఆదాయపు పన్ను (ఐటి)శాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు. మూడు రోజులపాటు వరదయ్యపాళెంలో, తమిళనాడులోని వివిధ కేంద్రాల్లో నిర్వహించిన దాడుల్లో లభించిన ఆస్తుల వివరాలను ఆ శాఖ అధికారులు చెన్నైలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆ సమాచారం ప్రకారం కల్కి ఆశ్రమంతో పాటు కల్కి భగవాన్‌కుమారుడైన కృష్ణకు చెందిన 40 ఇతర ప్రాంతాల్లో మూడు రోజులపాటు దాడులు నిర్వహించి సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐటి శాఖ స్వాధీనం చేసుకున్న ఆస్తులలో ఒకచోట 43.9 కోట్ల నగదు, 2.5 బిలియన్ల అమెరికన్ డాలర్లు ఉన్నాయి. ఇంకా రూ. 5 కోట్ల విలువైన 1,271 క్యారెట్ల వజ్రాలు, లెక్కలు చూపని రూ. 500 కోట్ల నగదు లభించాయి. కల్కి ఆశ్రమంలో రూ. 43.90 కోట్ల నగదు, రూ. 18 కోట్ల అమెరికన్ డాలర్లు, రూ. 26 కోట్ల విలువైన 88 కిలోల బంగారం పట్టుబడినట్లు ఐటి అధికారులు తెలియజేశారు. వీటన్నిటి లెక్కలకు సంబ ంధించిన రికార్డులు, రసీదులపై విచారణ కొనసాగుతోందని, పూర్తి వివరాలు తదుపరి ప్రకటన ద్వారా తెలియజేస్తామని ఐటి అధికారి తమ ప్రకటనలో తెలియజేశారు. ఇదిలా ఉండగా వరదయ్యపాళెం వద్దనున్న ఏకమ్ ఆశ్రమం తదితర విభాగాల్లో దాడులు నిర్వహించిన ఏడు ఐటి బృందాలలో నాలుగు బృందాలు గురువారం వెళ్లిపోగా మరో మూడు బృందాలు శుక్రవారం ఆశ్రమంలో రికార్డులు పరిశీలనను కొనసాగించాయి.

# ఐఎన్ఎక్స్ మీడియా కేసు చిద్దూపై చార్జిషీట్



**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరంపై సీబీఐ శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేసింది. చిదంబరంతోపాటు ఆయన కుమారుడు కార్తీ చిదంబరం, పీటర్ ముఖర్జీయా, ఇంద్రాణి ముఖర్జీయాతో సహా 14మంది నిందితుల పేర్లు చార్జిషీట్‌లో నమోదయ్యాయి. కాగా చిదంబరాన్ని అక్టోబర్ 24వరకూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నించేందుకు న్యాయస్థానం గురువారం అనుమతిచ్చింది. ప్రత్యేక న్యాయమూర్తి అజయ్‌కుమార్ కుహార్ ఏడురోజులపాటు చిదంబరాన్ని ప్రశ్నించేందుకు ఈడీని అనుమతించారు. ఇంటి నుంచి ఆహారం, మందులు, కళ్లజోడు, ఆయన కుటుంబ సభ్యులు, న్యాయవాదులు రోజూ అరగంటపాటు సందర్శించేందుకు అనుమతించాలని చిదంబరం చేసుకున్న అభ్యర్థనను న్యాయమూర్తి అనుమతించారు. ప్రతి 48గంటలకు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, అక్టోబర్ 24న న్యాయస్థానంలో హాజరుపరచాలని కోర్టు ఈడీని ఆదేశించింది. ఇదే కేసులో సీబీఐ దర్యాప్తునకు సంబంధించి ఆయన జ్యుడిషియల్ కస్టడీని అదేతేదీ వరకూ పొడిగించింది.

# నన్ను ఏడ్పించారుగా.. అందుకే ఇలా..!

- ఎస్పీ నేత ఆజంఖాన్‌పై జయప్రద గుస్సా

**రాంపూర్ (ఉత్తర్‌ప్రదేశ్) :** తాను మేకలు, కోళ్లు దొంగలించే వ్యక్తిలా కనిపిస్తున్నానా..? లేనిపోని కేసులు బనాయించి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆజం ఖాన్ ఎన్నికల ర్యాలీలో గగ్గోలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రత్యర్థి జయప్రద శుక్రవారం ఘాటుగా స్పందించారు. ఆజం ఖాన్ కారణంగా మహిళ కంటతడి పెట్టిన ఫలితమే ఇది అని జయప్రద మండిపడ్డారు. ఓ మహిళ ఒక్కసారి ఏడిస్తే.. ఇప్పుడు ఆజంఖాన్ ప్రతీ సభలో ఏడ్చే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. తనను మించిన మహానటుడు ఆజం ఖాన్ అంటూ విమర్శించారు. రాంపూర్‌లో బీజేపీ తరపున ఎంపీగా జయప్రద పోటీ చేసిన క్రమంలో ఆమెపై ఆజంఖాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆజంఖాన్ ఈనెల 5న సిట్ అధికారులు దాదాపు రెండున్నర గంటల పాటు ప్రశ్నించారు. పలు కేసులు ఆయన్ను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తనపై ఐపీసీ సెక్షన్ 307 (హత్యాయత్నం)కింద కేసు నమోదు చేయడం జరిగిందని, ఇది తన ఆత్మగౌరవం భంగం కలిగించేలా ఉందంటూ రాంపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారంలో ఆజంఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆజం ఖాన్ తన రాజకీయ కెరీర్‌ను నాశనం చేసేందుకు ప్రయత్నించారని గతంలో జయప్రద ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తనను వేధిస్తున్నాయంటూ ఆజం ఖాన్ వాపోతున్నాడు.

# నిర్మల ✕ సర్దార్ జీ

- ఆర్థిక మందగమనంపై విమర్శలు
- యూపీఏ హయాంలోనే అవినీతి
- తప్పు చేసినవారికే కోపం ఎక్కువ
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**వాషింగ్టన్ :** దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనంపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. బ్యాంకుల దివాలాకు మన్మోహన్, రాజన్ కారణమంటూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై సర్దార్ జీ స్పందించి నిర్మలా వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. దీంతో మళ్లీ నిర్మలా సీతారామన్ శుక్రవారం మన్మోహన్‌పై ధ్వజమెత్తారు. యూపీఏ హయాంలోనే పెద్ద సంఖ్యలో అవినీతి కేసులు వెలుగులోకొచ్చాయని విమర్శించారు. సమస్యను పరిష్కరించాల్సింది పోయి విమర్శలు గుప్పించడం ఏంటని మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ స్పందించారు. దేశ ఆర్థిక వ్యవస్థ విషయంలో ఎప్పుడు..? ఏం తప్పు జరిగింది..? అని తెలుసుకోవడం ఎంతో అవసరం అన్నారు. వరల్డ్ బ్యాంక్ - ఐఎంఎఫ్ సమావేశంలో భారత్ తరఫున ఆమె పాల్గొన్నారు. తప్పుడు పనులు చేసినప్పుడు అందరికీ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. యూపీఏ హయాంలో వేల కోట్ల రుణాలు తీసుకొని విదేశాల్లో దాక్కొని ఉన్నవారిని తిరిగి రప్పించేందుకు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల విషయంలో ఉన్న అడ్డంకులు తొలగించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వివరించారు.

### ఫోన్ కాల్స్‌పై రుణాలా..?

ఫోన్ కాల్స్‌పై యూపీఏ హయాంలో వేల కోట్ల రుణాలివ్వడం జరిగిందని, ఈ పని చేసిపెడితే నీకు ఇంత.. నాకు ఇంత అన్న రీతిలో అప్పటి నేతలు అవినీతికి తెరలేపారని విమర్శించారు. విమర్శలు గట్టిగా, స్పష్టంగా వినడానికి ధైర్యం ఉందని తాను కోరుకుంటున్నట్టు నిర్మలా తెలిపారు. తమ ప్రభుత్వం మాత్రం యూపీఏ హయాంలో మాదిరి రుణాలివ్వడం లేదని స్పష్టం చేశారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్, ఆర్‌బీఐ గవర్నర్‌గా రఘురామ్ రాజన్ ఉన్న సమయంలో పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు చెత్త ప్రదర్శన ఇచ్చాయని విమర్శించారు. ఇతరులపై కామెంట్లు చేసే ముందు తమ హయాంలో బ్యాంకుల పరిస్థితి ఏంటనేది ముందుగా తెలుసుకోవాలని రఘురాం



రాజన్‌ను ఉద్దేశించి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. వృద్ధి రేటు 6.1 శాతానికి పడిపోయిందని ఐఎంఎఫ్ చేసిన కామెంట్‌పై స్పందిస్తూ.. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ ఎంతో వేగంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు.

### చైనాకు సమానంగా భారత్ వృద్ధి

భారతదేశ వృద్ధి రేటు చైనాతో సమానంగా ఉందని, దీనిపై కూడా విపక్షాలు విమర్శలు గుప్పిస్తారని చెప్పుకొచ్చారు. చైనా ఆర్థిక వ్యవస్థ గురించి తెలీదా అంటూ విపక్షాలు ఎద్దేవా చేస్తారని ముందే ఆమె వివరించారు. తాను ఉద్దేశపూర్వకంగానే భారత ఆర్థిక వృద్ధి రేటు చైనాతో సమానం ఉందని, ఆ దేశంతో ముడిపడి ఉందనే వ్యాఖ్యలు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అయితే చైనాతో పోలిస్తే భారత్ ఆర్థిక వృద్ధి రేటు మరింత ఎక్కువ ఉండాలని, వేగంగా అభివృద్ధి చెందాలని, ఆ దిశగా తాము ప్రయత్నం చేస్తామని వివరించారు. దీపావళికి ముందు ఉద్దీపన ప్యాకేజీ ఉందా..? అన్న ప్రశ్నకు నవ్వుతూ.. ఇంకా సమయం ఉందని, భారత్‌కు వెళ్లాక పూర్తి స్పష్టత వస్తుందని వివరించారు. ఆర్థిక మందగమనం చక్రీయ లేదా నిర్మాణాత్మకమైందా..? అనే ప్రశ్నకు స్పందిస్తూ.. రెండు కావొచ్చు.. కాకపోవచ్చు.. లేదా పాక్షికం కావొచ్చు.. అని, ఏ మార్గంలో వెళ్తుందో చూడటం కాదని, ప్రజలు ఏం చేయాలని అనుకుంటున్నారో తెలుసుకుని దాని అనుగుణంగా స్పందిం చాల్సిన అవసరం ఉందని, దానికి ఇంకా సమయం ఉందని అభిప్రాయపడ్డారు.

# ఒక్కరోజు జీఎస్టీ భేటీకి రూ.3.26 కోట్ల ఖర్చు

- భారీ మొత్తంలో వెచ్చించిన గోవా
- ఆర్‌టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడి

**పనాజీ:** కేవలం ఒకే ఒక్క జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి అక్షరాలా రూ.3.26 కోట్లు ఖర్చయింది. గోవాలో సెప్టెంబర్ నెల 37వ జీఎస్టీ సమావేశానికి ఈ భారీ మొత్తం వెచ్చించాల్సి వచ్చింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వం వహించిన ఈ భేటీ పనాజీలోని ఓ స్టార్ రిసార్ట్‌లో జరిగింది. ఈ మొత్తాన్ని ఆతిథ్యమిచ్చిన గోవా సర్కారే భరించిందని ఆర్‌టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైంది. పనాజీకి చెందిన న్యాయవాది ఆరీస్ రోడ్రిగేజ్ ఆర్‌టీఐ దరఖాస్తును దాఖలు చేయగా కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ వివరాలను వెల్లడించింది. సెప్టెంబర్ 20న జీఎస్టీ కౌన్సిల్ భేటీ జరిగింది. భేటీకి ఏర్పాట్లు చేసిన నగరానికి చెందిన ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు రూ.1.96 కోట్లు చెల్లించారు. 200 ట్యాక్సీలను అద్దెకు తీసుకోవడానికి రూ. 50 లక్షలు వెచ్చించారు. కేంద్రపాలిత ప్రాంతాలు, అన్నీ రాష్ట్రాలకు చెందిన ఆర్థికమంత్రులు, వారి ముఖ్యమైన సహాయకులు హాజరయ్యారు. హిల్టన్ హోటల్‌కు చెందిన డబుల్‌ట్రీ ఫైవ్‌స్టార్ రిసార్ట్‌లో ఈ భేటీ జరిగింది. రూ.50,69,600 రిసార్ట్‌కు చెల్లించారు. ప్రతినిధులకు వసతి, భోజనాలను రిసార్ట్ ఏర్పాటు చేసింది. అంతేకాకుండా భారీ మొత్తంలో వెచ్చించి హోటల్లో ప్రెసిడెన్షియల్ సూట్‌ను కేటాయించారు. ఆహార, పానియాలకు సంబంధించి మరో రూ.10,16,000 కేటాయించారు. హోదాపరంగా అత్యంత ముఖ్యమైనవారికి మరింత విలాసవంతమైన సిడడే-డీ-గోవా రిసార్ట్‌లో బస ఏర్పాట్లు చేశారు. ఇందుకుగానూ రూ.30 లక్షలు ఖర్చుపెట్టారని ఆర్‌టీఐ దరఖాస్తుదారుడు రోడ్రిగేజ్ వివరించారు. ఇదిలావుండగా తీర రాష్ట్రం గోవాలో జీఎస్టీ కౌన్సిల్ భేటీ జరగడం ఇదే తొలిసారి.

# వచ్చే ఐదేళ్లలో రూ.35 వేల కోట్ల రక్షణరంగం ఎగుమతులు

- ప్రపంచ అగ్రశ్రేణిలో భారత దళాలు : ఆర్మీ చీఫ్

**న్యూఢిల్లీ:** వచ్చే ఐదేళ్లలో భారతీయ రక్షణరంగం ఎగుమతులు ఆధారితంగా రూపుదిద్దుకోనుందని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ శుక్రవారం వ్యాఖ్యానించారు. రానున్న ఐదేళ్లలో భారత రక్షణరంగం ఎగుమతులు రూ.35,000 కోట్లకు పెరగనున్నాయని ఆయన అన్నారు. మనం ఆయుధాలు, విడిభాగాలను తయారుచేస్తున్నది కేవలం మన దళాల వినియోగం కోసమే కాదు. నెమ్మదిగా ఎగుమతి ఆధారిత రక్షణరంగంగా మారనున్నాం. ప్రస్తుతం మన ఎగుమతుల స్థాయి ఏడాదికి కేవలం రూ.11 వేల కోట్లుగా ఉంది. ఐదేళ్లలో అంటే 2024 నాటికి ఏడాదికి రూ.35 వేల కోట్ల మేర ఆయుధాలను ఎగుమతి చేస్తామని ఆయన అంచనావేశారు. శాంతి, స్థిరత్వాలను పరిరక్షించే క్రమంలో సాయుధదళాలు ఆయుధాలను ఎగుమతి చేయగలిగే స్థాయిలో ఉండాలి. ఈ మేరకు సాధికారత సాధించేందుకు సుశిక్షితులైన సిబ్బంది, సైనికులు, నావికులు, పైలెట్లు అవసరమవుతారని ఆయన అన్నారు. మంచి నాణ్యత కలిగిన ఆయుధాలు, సౌకర్యాలతో శిక్షణ ఇస్తే సైనికులు సాధికారతను సాధిస్తారని తాను విశ్వసిస్తున్నానని రావత్ అన్నారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి సాయుధ బలగాలను కలిగివున్న దేశాల్లో భారత్ ఉంది. అయితే ఇది పరిమాణంపరంగా కాదు. యుద్ధంలో పనిచేసిన అనుభవం, యుద్ధంలో తలపడిన విధానం, రాజకీయవాతావరణం వంటి అంశాల ఆధారంగా భారత్ ప్రపంచంలో అగ్రశ్రేణి సాయుధబలగాలను కలిగివుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశీయ రక్షణ పరికరాల ఎగుమతిదారులు అసోసియేషన్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# 2020 వరకూ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాక్

- పాకిస్థాన్‌ను బ్లాక్ లిస్టులో ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న టెర్రర్ ఫండింగ్ వాచ్‌డాగ్

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులకు అందుతున్న నిధులపై చర్యలు తీసుకునేందుకు గ్లోబల్ టెర్రర్ ఫండింగ్ నిఘా సంస్థ ఎఫ్ఏటీఎఫ్ తాజాగా విధించిన గడువు ఫిబ్రవరి 2020వరకూ పాక్ గ్రే లిస్టులో ఉండనుంది. ఇస్లామాబాద్ తమ కార్యాచరణ ప్రణాళికను పూర్తిచేయడంలో విఫలమైతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఎఫ్ఏటీఎఫ్ హెచ్చరిస్తూ పాకిస్థాన్‌కు నాలుగు నెలల సమయం ఇచ్చింది. 2020 ఫిబ్రవరిలో పాకిస్థాన్‌ను అధికారికంగా బ్లాక్‌లిస్టులో ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టెర్రర్ ఫండింగ్ వాచ్‌డాగ్ ఎఫ్ఏటీఎఫ్ తెలిపినట్టు పారిస్‌లో ఐదు రోజుల ప్లీనరీకి హాజరైన భారత అధికారులు వెల్లడించారు. మనీలాండరింగ్, ఉగ్రవాద ఫైనాన్సింగ్ సవాళ్లను పరిష్కరించే దేశీయ చట్టాలు బలహీనంగా ఉన్న దేశాల జాబితా గ్రే లిస్టులో పాకిస్థాన్ ఉందని తెలిపారు. పారిస్‌కు చెందిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్థాన్‌పై తుది నిర్ణయం తీసుకోనుంది. ఉగ్రవాద నిధులను అరికట్టేందుకు తీసుకునే 27 కార్యాచరణ కార్యక్రమాల్లో పాకిస్థాన్ కేవలం ఐదింటిని మాత్రమే తీసుకుందని ఎఫ్ఏటీఎఫ్ గుర్తించిందని భారత అధికారులు తెలిపారు.

కార్యాచరణ ప్రణాళికలో పాక్ పేలవమైన పనితీరు ఆధారంగా గ్రే లిస్టులో ఉంచేందుకు ఏకాభిప్రాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 2020నాటికి పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను వేగంగా పూర్తి చేయాలని గట్టిగా హెచ్చరించినట్టు వివరించారు. తదుపరి ప్లీనరీ నాటికి దాని కార్యాచరణ ప్రణాళికలో స్థిరమైన పురోగతి సాధించకపోతే ఎఫ్ఏటీఎఫ్ తన ఆర్థిక సంస్థలకు సలహా ఇవ్వమని కోరి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్‌తో వ్యాపార సంబంధాలు, లావాదేవీలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ చివరిరోజు శుక్రవారం తెలిపింది. ఈ సమావేశంలో 205దేశాలు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఐక్యరాజ్యసమితి, ప్రపంచబ్యాంకు మరియు ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. హాఫీజ్ సయీద్, మౌలా మసూద్ అజార్‌తోపాటు ఇతర ఉగ్రవాదులపై కఠినమైన చర్యలు తీసుకోవడంలో పాకిస్థాన్ విఫలమైందని భారత్‌తోసహా ఎఫ్ఏటీఎఫ్ ఇతర సభ్య దేశాలు ఆరోపించాయి. పాకిస్థాన్‌లో ఉగ్రవాద నిరోధక చట్టం ఇప్పటికీ నిర్దేశించిన ప్రమాణాలతో ఆధునీకరించలేదని ప్రముఖంగా వ్యాఖ్యానించాయి. కాగా ఇప్పటివరకు ఏఫ్ఏటీఎఫ్ బ్లాక్‌లిస్టులో ఇరాన్, ఉత్తర కొరియా మాత్రమే ఉన్నాయి. పాకిస్థాన్‌ను గత ఏడాది జూన్‌లో ఎఫ్‌టీఎఫ్ గ్రే లిస్టులో ఉంచింది. పాకిస్థాన్ గ్రే లిస్టులో కొనసాగినా ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, యూరోపియన్ యూనియన్ నుంచి ఆర్థిక సహాయం పొందేందుకు కష్టతరమవుతుంది. ఇస్లామాబాద్ ప్రతి మూడు నెలలకు ఒకసారి దాని పనితీరును నివేదించాల్సిన బాధ్యత ఉంది.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు ఆర్నెల్లు జైలు



- దాడి కేసులో కోర్టు తీర్పు
- రుజువైన నేరారోపణలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. అతని కుమారుడు సుమిత్ గోయల్‌ను కూడా నిందితుడిగా తేలుస్తూ ఇద్దరికీ జైలు శిక్షతో పాటు చెరో వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. తండ్రి కుమారుడితో పాటు హితేష్ ఖన్నా, అతుల్ గుప్తా, బల్బీర్ సింగ్‌లకు కూడా ఇదే శిక్షను ఖరారు చేసినట్టు అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమర్ విశాల్ గుప్తా వివరించారు. తీర్పు వెలువరించిన ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేయడానికి వీలు కల్పించేందుకు కోర్టు వారికి లక్షరూపాయల బాండ్‌పై బెయిల్ కూడా మంజూరు చేసింది. 2015లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 6న బిల్డర్ మనీష్ ఘాయి ఇంట్లోకి చొరబడి ఆప్ నేత, ప్రస్తుత స్పీకర్ గోయల్ బీభత్సం సృష్టించారని విచారణలో రుజువైంది. ఎన్నికల నేపథ్యంలో బిల్డర్ మనీష్ ఘాయి.. బ్లాంకెట్‌లు, లిక్కర్, డబ్బులు పంచుతున్నట్టు స్పీకర్ ఆరోపించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను వెంటబెట్టుకుని పోలీసు బృందంతో ఘాయ్ ఇంటికి వెళ్లి రభస సృష్టించినట్టు రుజువైంది. ఈ నేపథ్యంలో మనీష్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పీకర్ గోయల్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఘాయ్ ఇంట్లో కొంత మంది కార్మికులు బస చేశారని, వారు అతని కోసం పని చేసేవారు అని పోలీసులు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. బలవంతంగా ఇంట్లో చొరబడటం, ఆస్తులు ధ్వంసం చేయడం, బెదిరింపులకు గురిచేయడం వంటి సెక్షన్ల కింద గోయల్‌పై కేసు నమోదైంది.



# మా మేనిఫెస్టో చూడండి..!

- ఆర్థిక మందగమనానికి మందు
- మోడీ, నిర్మలాకు రాహుల్ సూచన

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆర్థిక మందగమనంపై ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనం నుంచి బయటపడటానికి, 2019 లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తాము ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని కొన్ని కీలక అంశాలను చోరీ చేయాల్సి ఉంటుందని ఎద్దేవా చేశారు. సాధారణంగా పట్టణాభివృద్ధి కంటే ఎంతో వేగంగా గ్రామీణాభివృద్ధి జరుగుతుందని, కానీ ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామీణ ప్రాంతం ఇప్పుడు తీవ్ర సంకటంలో ఉందని, తాజాగా అందించిన నివేదిక ప్రకారం.. సెప్టెంబర్ త్రైమాసికం నాటికి గ్రామీణాభివృద్ధి రేటు పట్టణాభివృద్ధి రేటుతో పోలిస్తే భారీగా పతనమైందని, ఏడేళ్ల కనిష్టానికి పడిపోయిందని అన్నారు. గ్రామీణ ఆర్థిక వృద్ధి విషయంలో ఏం చేయాలో అన్న డైలమాలో ప్రభుత్వం ఉందని, తమ మేనిఫెస్టోలోని ఆర్థికపరమైన కీలక నిర్ణయాలను తస్కరించి అమలు చేస్తే తప్ప ఆర్థిక మందగమనం నుంచి గట్టెక్కలేమని చెప్పుకొచ్చారు. ఆర్థిక మందగమనం నుంచి ఎలా బయటపడాలో అన్న సమస్యకు పరిష్కారం 2019 లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉందని సూచించారు.



# యూపీలోని వర్సిటీల్లో మొబైల్ ఫోన్స్ నిషేధం

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మొబైల్ ఫోనుల వాడకాన్ని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిషేధించింది. యూపీలోని ఉన్నత విద్యాశాఖ డైరెక్టరేట్ ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లోకి మొబైల్ ఫోన్లను తీసుకురావడం, ఉపయోగించేందుకు విద్యార్థులను ఇకనుంచి అనుమతించరని ఆదేశాల్లో పేర్కొన్నారు.ఈ నిషేధం ఉత్తరప్రదేశ్‌లోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు అదేవిధంగా బోధనా సిబ్బందికి కూడా ఈ నిషేధం వర్తిస్తుంది. యూపీలోని ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన బోధనా వాతావరణం ఉండేలా ఈ చర్య తీసుకున్న విద్యాశాఖ సర్క్యులర్‌లో పేర్కొంది. కాగా ఇప్పటికే సీఎం యోగి తన అధికారిక సమావేశాల్లో, క్యాబినెట్ సమావేశాల్లో మొబైల్ వాడకాన్ని నిషేధించారు. కొంత మంది మంత్రులు, అధికారులు ముఖ్యమైన సమావేశాల్లో వాట్సాప్ సందేశాలను చదవడంలో బిజీగా ఉండటంతో యోగి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

### భోజనం దొంగిలించిన విద్యార్థికి రూ.20వేలు జరిమానా

లక్నో యూనివర్సిటీలో ఓ విద్యార్థి సెంట్రల్ మెస్‌లో అనుమతిలేకుండా భోజనంచేసినందుకు అధికారులు రూ.20వేలు జరిమానా విధించారు. 100రూపాయల స్టాంప్‌పేపర్‌పై అవిడవిట్ సమర్పించాలని విద్యార్థిని కోరారు. సెప్టెంబర్ 3న ఆయూష్‌సింగ్ అనే విద్యార్థి సెంట్రల్ మెస్ వద్దకు వెళ్లి భోజనం చేశాడు. నిబంధనల ప్రకారం సెంట్రల్ మెస్‌లో హాస్టలర్లును మాత్రమే భోజనం చేసేందుకు అనుమతిస్తారు. అనుమతిలేకుండా భోజనం చేస్తున్న విద్యార్థిని పట్టుకున్న మెస్ సిబ్బంది ఉన్నతాధికారికి సమాచారం ఇచ్చారు. ప్రొక్టర్, ప్రొఫెసర్ వినోద్‌కుమార్ సింగ్ విద్యార్థి ఆయూష్‌సింగ్‌కు నోటీసు ఇచ్చి జరిమానా మొత్తాన్ని ఒక వారంలో జమచేయాలని లేదా తదుపరి క్రమశిక్షణ చర్యలను ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. రిజిస్టర్‌లో నకిలీ పేర్లు నమోదు చేస్తూ తరుచూ సెంట్రల్ మెస్‌లో ఆయూష్‌సింగ్ భోజనం చేస్తున్నట్టు తమ వద్ద సమాచారం ఉందని ప్రొక్టర్ తెలిపారు.

# చంద్రుడిపై విలువైన ఖనిజాలు..!

- ఫొటోలు తీసి పంపిన ఆర్బిటర్
- స్టెబిన్, సోమర్‌ఫీల్డ్ లాంటి పదార్థాలు
- ఐఐఆర్ఎస్ ద్వారా చిత్రాలు విడుదల
- విక్రమ్ కోసం గాలింపు ముమ్మరం



**న్యూఢిల్లీ:** చంద్రుడి కక్ష్య చుట్టూ తిరుగుతున్న చంద్రయాన్ - 2లోని ఆర్బిటర్ అక్కడి ఉపరితలంపై తాజా ఫొటోను తీసి పంపింది. చంద్రుడి ఉపరితలంపై ఖనిజాలు, చంద్రుడి ఆవిర్భావం గురించి ఆర్బిటర్‌లోని స్పెక్ట్రోస్కోపిక్ పరికరం తొలి ఫొటోను పంపినట్టు ఇస్రో శుక్రవారం వెల్లడించింది. చంద్రుడి పుట్టుపుర్వోత్తరాల గురించి తెలుసుకోవడానికి ఈ సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆర్బిటర్‌లోని పేలోడ్స్ చంద్రుడి గురించి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. మరోవైపు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఆర్బిటర్ ఎల్‌ఆర్ఓ ప్రస్తుతం చంద్రుడి కక్ష్యలోనే పరిభ్రమిస్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-2కు సంబంధించిన విక్రమ్ హార్డ్ ల్యాండింగ్ అయిన ప్రదేశానికి సంబంధించిన ఫొటోలు ఎల్‌ఆర్ఓ పంపించింది. విక్రమ్ కచ్చితంగా ఎక్కడ ల్యాండ్ అయ్యిందన్న విషయాన్ని తెలుసుకునేందుకు నాసా కూడా తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉంది. చంద్రయాన్-2 ఆర్బిటర్‌లోని ఇమేజింగ్ ఇన్ ఫ్రారెడ్ స్పెక్ట్రోమీటర్ (ఐఐఆర్ఎస్) తొలిసారిగా ఇల్యూమినేటెడ్ చిత్రాలను తీసి పంపించింది. చంద్రుడి ఉత్తరఅర్ధ గోళంలోని ప్రాంతాన్ని ఆర్బిటర్ చిత్రీకరించింది. చంద్రుడిపై స్టెబిన్స్, సోమర్‌ఫీల్డ్, క్రిక్‌వుడ్‌లాంటి అత్యంత అరుదైన పదార్థాలు ఉన్నట్టు స్పష్టం అవుతోంది. చంద్రుడి ఉపరితలంపై 800 నుంచి 5000 మైక్రో మీటర్ల దూరంలో ప్రసరించే సూర్యకాంతి, చంద్రుడి కాంతిని వేర్వేరు స్పెక్ట్రల్ బ్యాండ్లలో కొలిచే సామర్థ్యంతో ఐఐఏఆర్‌ను ఇస్రో రూపొందించింది.

# ఏది మేలో అదే చేయమంటాం: రిజిజు



**న్యూఢిల్లీ:** ఆటకు క్రీడాకారులకు ఏది మేలో అదే చేయాలని భారత బాక్సింగ్ సమాఖ్యను కోరతామని కేంద్ర క్రీడామంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ట్రయల్స్ లేకుండా మేరీకోమ్‌ను ఎంపిక చేసిన విధానంపై జోక్యం చేసుకోవాలని మంత్రికి యువ బాక్సర్ నిఖత్ జరీన్ లేఖ రాసిన నేపథ్యంలో కేంద్ర మంత్రి స్పందించారు. దేశానికి, క్రీడకు, ఆటగాళ్లకు ఏది మంచో అదే చేయమని సమాఖ్యను కోరతామని మంత్రి స్పష్టం చేశారు. వచ్చే నెలలో చైనాలో జరుగనున్న ఒలింపిక్స్ ట్రయల్స్ టోర్నీలో మేరీకోమ్‌కు నేరుగా ఎంపిక చేయడంపై నిఖత్ జరీన్ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. కాగా మేరీ కోమ్ సమాఖ్య నిర్ణయం ఏదైతే దానిని శిరసావహిస్తానని తెలిపింది. గత ఏడాది వరకు వివిధ టోర్నీలలో బంగారు, రజత పతకాలు సాధించిన క్రీడాకారులకే నేరుగా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో అవకాశం కల్పించేది. అయితే ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మేరీ కోమ్‌ను ఎంపిక చేయడం నిఖత్‌ను హతాశురాలిని చేసింది. తనకు న్యాయం చేయాలని ఆమె కేంద్ర మంత్రికి లేఖ రాయగా ఆయన పైవిధంగా స్పందించారు. జరీనా వాదనను ప్రముఖ షూటర్, ఏకైక ఒలింపిక్ పతక విజేత అభినవ్ బింద్రాకూడా సమర్ధించాడు.

## కోమ్‌కు గుడ్‌ఇయర్ బాసట



**న్యూఢిల్లీ :** దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్‌కు ప్రముఖ టైర్ల కంపెనీ గుడ్ ఇయర్ బాసటగా నిలిచింది. మేరీ కోమ్ బాక్సింగ్ అకాడమీలో మరో అధునాత రింగ్ ఏర్పాటుకు గుడ్‌ఇయర్ మద్దతు తెలిపింది. కొత్త రింగ్‌ను మేరీకోమ్ ఆమె భర్త ఆన్లర్ కోమ్ గురువారం ప్రారంభించారు. రింగ్‌తోపాటు డైనింగ్ హాల్, కిచెన్ ఏర్పాటుకు గుడ్‌ఇయర్ సంస్థ ముందుకొచ్చింది. దేశవాళీ క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా మేరీకోమ్ అకాడమీలో కొత్త రింగ్‌ను ఏర్పాటు చేయాలని అందుకనుగుణంగా యువ బాక్సర్లను రూపుదిద్దడంలో దోహదకారిగా నిలవాలని భావించినట్టు గుడ్‌ఇయర్ ఫైనాన్స్ డైరెక్టర్(ఇండియా) మితేష్ మిట్టల్ తెలిపారు. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన 36 ఏళ్ల మేరీకోమ్ ఇటీవల ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన ఎనిమిదో పతకం సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఆమె ఇండియన్ ఓపెన్, ఇండోనేసియాలో జరిగిన ప్రెసిడెంట్స్ కప్‌లో స్వర్ణాలు గెలుచుకుంది.

## సారధులు మన్‌ప్రీత్, రాణి

**హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్**



**న్యూఢిల్లీ :** ఎఫ్ఐహెచ్ హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్ మ్యాచ్‌లలో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను శుక్రవారం ప్రకటించారు. పురుషుల జట్టుకు మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా, ఎస్.వి.సునీల్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. మహిళల జట్టుకు రాణి రాంపాల్ కెప్టెన్‌గా, గోల్‌కీపర్ సవిత వైస్‌కెప్టెన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఒడిషాలో జరిగే రెండంచెల క్వాలిఫయర్స్ టోర్నీలో ప్రపంచ 5వ ర్యాంక్ భారత పురుషుల జట్టు 22వ ర్యాంకర్ రష్యాతో, ప్రపంచ 9వ ర్యాంకర్ మహిళల జట్టు 13వ ర్యాంకర్ అమెరికాతో తలపడనున్నాయి. ఈ క్వాలిఫయర్ మ్యాచ్‌లలో విజేతలు 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.

**పురుషుల జట్టు :** మన్‌ప్రీత్ సింగ్(కెప్టెన్), పి.ఆర్.రాజేష్, క్రిషన్ బహదూర్ పాథక్, హర్మన్‌ప్రీత్ సింగ్, వరుణ్ కుమార్, సురేందర్ కుమార్, గురిందర్ సింగ్, రూపిందర్ పాల్ సింగ్, అమిత్ రోహిదాస్, నీలకంఠ శర్మ, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, ఎస్.వి.సునీల్(వైస్‌కెప్టెన్), మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, సిమ్రన్‌జీత్ సింగ్.

**మహిళల జట్టు :** రాణి రాంపాల్(కెప్టెన్), సవిత(వైస్‌కెప్టెన్), రజని ఎతిమర్పు, దీప్ గ్రేస్ ఎక్కా, గుర్జీత్ కౌర్, రీనా కోఖర్, సలీమా టెటె, సుశీల చాను పుఖ్రంబం, నిక్కి ప్రధాన్, మోనిక, నేహ గోయల్, లిలిమా మింజ్, నమిత టొప్పొ, వందన కటారియ, నవనీత్ కౌర్, లాల్‌రెమ్ సియామి, నవజోత్ కౌర్, షర్మిల దేవి.

## పాక్ క్రికెట్‌లో కుర్చీలాట!

**సర్ఫరాజ్‌పై వేటు • అజర్, బాబర్‌లకు అందలం**

**కరాచి:** పాకిస్తాన్ టెస్టు, టి20 జట్ల నాయకత్వంనుంచి సర్ఫరాజ్ అహ్మద్‌ను తొలగిస్తూ పాక్ బోర్డు శుక్రవారం నిర్ణయం తీసుకుంది. అతని స్థానంలో టెస్టులకు అనుభవజ్ఞుడైన అజర్ అలి టెస్టు జట్టుకు, బాబర్ అజమ్ టి20 జట్టుకు నాయకత్వం వహిస్తారు. తదుపరి ఆస్ట్రేలియా పర్యటనలో పాకిస్తాన్ రెండు టెస్టులు, మూడు టి20 మ్యాచ్‌లు ఆడనున్నది. సర్ఫరాజ్ గత రెండేళ్లుగా మూడు ఫార్మాట్లలో పాక్ జట్టుకు సారథ్యం వహిస్తూ 2017లో పాకిస్తాన్‌ను ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిపాడు. ఆ తరువాత పాక్ జట్టు క్రమంగా టెస్టు ర్యాంకింగ్స్‌లో దిగజారడమేగాక ఇటీవల శ్రీలంకతో స్వదేశంలో జరిగిన టి20 సిరీస్‌లో ఓటమిపాలైంది. దీనితో పాక్ బోర్డుకు సర్ఫరాజ్‌పై వేటువేయక తప్పలేదు. జాతీయ జట్టుకు సారథ్యం కోల్పోయిన సర్ఫరాజ్ దేశవాళీ క్రికెట్‌లోనూ ప్రాధాన్యం కోల్పోయాడు. జాతీయ టి20 చాంపియన్‌షిప్‌లో అతడు నేతృత్వం వహించే సింధ్ జట్టుకు అసద్ షఫీక్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించారు.

## భారత బాక్సర్లకు 21 పతకాలు

**• ఆసియా జూనియర్ బాక్సింగ్**

**న్యూఢిల్లీ :** ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు 21 పతకాలు గెలిచి సత్తా చాటారు. యుఏఈలోని ఫుజైరా నగరంలో జరిగిన ఈ టోర్నీలో 26 దేశాలు పాల్గొనగా, భారత బాక్సర్లు 6 స్వర్ణాలు, 9 రజతాలు, 6 కాంస్యాలు సొంతం చేసుకున్నారు. పురుషుల జట్టు 2 స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్యాలు సాధించగా, మహిళా బాక్సర్లు 4 స్వర్ణాలు, 6 రజతాలు, 3 కాంస్యాలు గెలుచుకున్నారు. సంఖ్యాపరంగా పతకాలు ఎక్కువ సాధించినప్పటికీ, 8 స్వర్ణాలు సాధించిన ఉజ్బెకిస్తాన్ ప్రథమ స్థానంలో నిలిచి, భారత్‌ను రెండో స్థానానికి పరిమితం చేసింది. జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇదే అత్యధిక పతకాల సాధన. పురుషులలో విశ్వనాథ్ సురేష్(46కి.గ్రా.), బిశ్వామిత్ర చోంగ్తమ్(48కి.గ్రా.) స్వర్ణాలు, యోగేష్ కాగ్ర(63కి.గ్రా.), రాహుల్(70కి.గ్రా.) రజతాలు, విజయ్‌సింగ్(50కి.గ్రా.), విక్టర్ సింగ్ షైఖోమ్(52కి.గ్రా.), వంశజ్(60కి.గ్రా.) కాంస్యాలు సాధించారు. మహిళలలో జాతీయ చాంపియన్ కల్పన(46కి.గ్రా.), ప్రీతి దహియా(60కి.గ్రా.), తన్స్‌బీర్ కౌర్ సంధు(80కి.గ్రా.), అల్ఫియా తరన్నుమ్ పఠాన్(ప్లస్ 80కి.గ్రా.) స్వర్ణాలు, తమన్న(48కి.గ్రా.), తన్ను(52కి.గ్రా.), నేహ(54కి.గ్రా.), ఖుషి(63కి.గ్రా.), శర్వారి కల్యాంకర్(70కి.గ్రా.), ఖుషి(75కి.గ్రా.) రజతాలు, రింకు(50కి.గ్రా.), అంబేషోరి దేవి(57కి.గ్రా.), మహి లామ(66కి.గ్రా.) కాంస్య పతకాలు సాధించిపెట్టారు. 26 దేశాలనుంచి 239(170 పురుషులు, 69 మహిళలు) బాక్సర్లు ఈ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డారు.

## ధోనీ వస్తుండు..



రాంచీ వేదికగా శనివారం మొదలుకానున్న చివరి టెస్టుకు టీమిండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ హాజరుకానున్నాడు. ప్రపంచకప్ తర్వాత నుంచి టీమిండియాకు దూరమైన ధోనీ శనివారం తన సొంత మైదానంలో జరుగుతున్న టెస్టు తొలి రోజు ఆటను వీక్షించేందుకు వస్తున్నాడని అతని మేనేజర్, చిన్ననాటి మిత్రుడు మిహిర్ దివాకర్ తెలిపాడు. ధోనీ రాంచీ టెస్టుకు హాజరవుతున్నాడని తెలుసుకున్న అతని అభిమానుల ఆనందానికి హద్దులు లేకుండాపోయింది. అయితే జార్ఖండ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నఫీస్ ఖాన్ ధోనీని రాంచీ టెస్టుకు ఆహ్వానించాడని అతని మేనేజర్ దివాకర్ తెలిపాడు.

## టాస్‌కు డుప్లెసిస్ దూరం



రాంచీ వేదికగా శనివారం ప్రారంభం కానున్న చివరి టెస్టులో సౌతాఫ్రికా సారథి డుప్లెసిస్ టాస్‌కు దూరం ఉండనున్నాడు. తొలి రెండు మ్యాచుల్లో టాస్ ఓడిన తమ జట్టు అందుకు భారీ మూల్యం చెల్లించుకుందని డుప్లెసిస్ అన్నాడు. అయితే తనకు టాస్ అచ్చి రాదని అందుకని శనివారం టాస్‌కు తన బదులు వేరే ఆటగాడిని పంపాలని యోచిస్తున్నట్టు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో డుప్లెసిస్ పేర్కొన్నాడు.

మ్యాచ్ గెలవాలంటే టాస్ ముఖ్యమని, మొదట బ్యాటింగ్ చేసిన జట్టుకు విజయావకాశాలు అధికంగా ఉంటాయని, తొలి రెండు టెస్టుల్లో టాస్ గెలిచిన కోహ్లీ ముందు బ్యాటింగ్ ఎంచుకున్నాడని అదే భారత్ విజయాలకు ముఖ్య కారణమని డుప్లెసిస్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో తాము టాస్ నెగ్గితే తొలుత బ్యాటింగ్‌ఎంచుకొని భారత్ ముందు భారీ స్కోరు ఉంచుతామని డుప్లెసిస్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

## కొత్త రికార్డుపై కోహ్లీసేన గురి

ఇప్పటికే వరుసగా 11 టెస్టు సిరీస్‌లు గెలుచుకొని సొంతగడ్డపై అత్యధిక సిరీసుల్లో విజయాలు సాధించిన జట్టుగా కొత్త చరిత్ర సృష్టించిన టీమిండియా ఇప్పుడు మరో రికార్డుపై కన్నేసింది. శనివారం రాంచీ వేదికగా ప్రారంభం కానున్న చివరి టెస్టులోనూ కోహ్లీసేన గెలిస్తే సఫారీలపై 3-0తో సిరీస్‌ను వైట్‌వాష్ చేస్తోంది. అయితే టెస్ట్ చరిత్రలో భారత్ ఇప్పటివరకు సఫారీలపై ఒక్క టెస్టు సిరీస్ కూడా క్లీన్ స్వీప్ చేయలేదు. దీంతో చివరి టెస్టులో సౌతాఫ్రికాను ఓడిస్తే కోహ్లీ సేన ఖాతాలో కొత్త రికార్డు ఖాయం.

**టెస్టు క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న కోహ్లీసేన మరో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేందుకు అడుగులు వేస్తోంది. ప్రత్యర్థులు ఎవరైనా.. వేదిక ఏదైనా సరే తమ పటిష్ఠమైన బ్యాటింగ్, బౌలింగ్ లైనప్‌తో వారికి చెమటలు పట్టిస్తోంది. ఇప్పటికే 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా చివరి టెస్టులోనూ అదేజోరుతో సఫారీలను మట్టికరిపించాలని చూస్తోంది..**

# టార్గెట్ వైట్‌వాష్!



- నేటి నుంచి చివరి టెస్టు
- మరో విజయంపై కన్నేసిన కోహ్లీసేన
- పరువు కోసం సౌతాఫ్రికా • సమరోత్సాహంతో భారత్
- ఉ.9:30 నుంచి స్టార్ నెట్‌వర్క్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

**రాంచీ:** వరుస విజయాలతో దూసుకెళుతున్న కోహ్లీ సేన మరో విజయంపై కన్నేసింది. ఇప్పటికే 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ చివరి మ్యాచ్‌ను సైతం గెలిచి సౌతాఫ్రికాను వైట్‌వాష్ చేయాలని చూస్తోంది. శనివారం నుంచి రాంచీ వేదికగా భారత్, సౌతాఫ్రికాల మధ్య చివరిదైన మూడో టెస్టు ప్రారంభం కానుంది. విశాఖపట్నం వేదికగా జరిగిన తొలి టెస్టులో 203 పరుగులతో ఘన విజయం సాధించిన టీమిండియా.. రెండో టెస్టులో ఇన్నింగ్స్ 137 పరుగులతో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఫలితంగా స్వదేశంలో వరుసగా 11 టెస్టు సిరీస్‌లను గెలుచుకున్న తొలి జట్టుగా భారత్ కొత్త చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా 10 వరుస టెస్టు సిరీస్‌ల విజయాల రికార్డును టీమిండియా అధిగమించి వరుసగా అత్యధిగా సిరీస్‌లు గెలుచుకున్న జట్టుగా కొత్త ప్రపంచ రికార్డును నమోదు చేసింది. ఇక నేటి నుంచే జరిగే ఆఖరి టెస్టులోనూ టీమిండియా అదే జోష్‌తో బరిలోకి దిగుతోంది. ఇప్పటికే సిరీస్ గెలుచుకున్నా చివరి టెస్టులో ఎలాంటి ప్రయోగాలు చేయదలచుకోలేదని టీమిండియా కెప్టెన్ కోహ్లీ స్పష్టం చేశాడు. ప్రస్తుతం టెస్టు చాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో ఉన్న భారత్ మరిన్ని పాయింట్లు సాధించాలని పట్టుదలతో ఉందని కోహ్లీ అన్నాడు. విండీస్‌పై టెస్టు సిరీస్ గెలుచుకున్న భారత్ ఇప్పుడు సౌతాఫ్రికాపై కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా టీమిండియా 200 పాయింట్లతో నెంబర్‌వన్ స్థానంలో కొనసాగుతోంది.

సుదీర్ఘకాలం జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో ప్రతి మ్యాచ్ కీలకమేనని కోహ్లీ పేర్కొన్నాడు. ఇక సౌతాఫ్రికా విషయానికి వస్తే ప్రపంచకప్ నుంచి ఈ జట్టు పేలవమైన ప్రదర్శనలు చేస్తోంది. సీనియర్ ఆటగాళ్లు డివిలియర్స్, హషీం ఆమ్లాలు రిటైర్మెంట్ ప్రకటించడం.. మరోవైపు స్టార్ పేసర్ డేల్‌స్టెయిన్ గాయంతో జట్టుకు దూరమవడం, ఇక కీలకమైన ఇతర ఆటగాళ్లు ఫామ్‌ను కోల్పవడం ఇవన్ని సఫారీలను కలవరపెడుతున్నాయి. ఇక భారత్‌తో జరిగే చివరి టెస్టులోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని సౌతాఫ్రికా భావిస్తోంది.

**అదే జోరు కొనసాగాలి..**

ప్రస్తుతం టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జట్టుగా కొనసాగుతున్న భారత్ తమ స్థాయికి తగ్గట్టే మెరుగైన ప్రదర్శనలు చేస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో టీమిండియా ప్రత్యర్థి జట్ల కంటే పటిష్ఠంగా కనబడుతున్నది. సౌతాఫ్రికాతో స్వదేశంలో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. టెస్టుల్లో తొలిసారి ఓపెనింగ్ చేస్తున్న రోహిత్ శర్మతో పాటు యువ బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్ కూడా అదరగొడుతున్నాడు. విశాఖ టెస్టులో మయాంక్ డబుల్ సెంచరీతో చెలరేగగా.. హిట్‌మ్యాన్ రోహిత్ రెండు ఇన్నింగ్స్‌లలో అద్భుతమైన శతకాలతో ఔరా అనిపించుకున్నాడు. తర్వాత పుణె టెస్టులో రోహిత్ విఫలమైనా మయాంక్ మాత్రం మరో శతకంతో విజృంభించాడు. ఇక ద్రవిడ్ వారసుడు చతేశ్వర్ పుజారా సైతం పర్వాలేదనిపిస్తున్నాడు. భారీ శతకాలు బాదకపోయినా ఉపయుక్తమైన స్కోర్లతో జట్టుకు అండగా ఉంటున్నాడు. మరోవైపు టీమిండియా సారథి విరాట్ కోహ్లీ రెండో టెస్టులో కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్(254) ఆడాడు. దాంతో పాటు ఎన్నో రికార్డులను తిరగరాశాడు. ఇక నలుగురు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌లు మంచి ఫామ్‌లో ఉండటంతో చివరి టెస్టులోనూ భారత్ మరోసారి భారీ స్కోర్లు చేయడం ఖాయమనిపిస్తోంది. తర్వాతి స్థానాల్లో వైస్ కెప్టెన్ అజింక్య రహానెతో పాటు వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ సాహా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, తెలుగబ్బాయి హనుమ విహారి కూడా ఫామ్‌లో ఉండటం టీమిండియాకు కలిసొచ్చే అంశం.

**బౌలర్లుకు ఎదురుందా..**

టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న భారత బౌలర్లకు ఎదురులేకుండా పోయింది. వీరి ధాటికి సఫారీ బ్యాట్స్‌మెన్ విలవిలలాడుతున్నారు. పేస్ విభాగంలో టాప్ క్లాస్ బౌలర్లు బుమ్రా, భువనేశ్వర్‌లు లేకున్నా షమీ, ఇషాంత్, ఉమేశ్ యాదవ్‌లు నిలకడైన బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నారు. సఫారీ బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపుతూ నిప్పులు చిరుగుతున్నారు. స్పిన్ విభాగంలో సీనియర్ రవిచంద్రన్ అశ్విన్‌తో పాటు రవీంద్ర జడేజా మ్యాజిక్ చేస్తున్నాడు.

**జట్ల వివరాలు :**

**భారత్:** విరాట్ కోహ్లీ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రోహిత్ శర్మ, చతేశ్వర్ పుజారా, అజింక్య రహానె, హనుమ విహారి, వృద్ధిమాన్ సాహా(వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మ, పంత్, శుభ్‌మన్ గిల్, నదీమ్.

**సౌతాఫ్రికా:** ఫాఫ్ డుప్లెసిస్ (కెప్టెన్), టెంబా బవుమా, డిబ్రుయిన్, క్వింటన్ డికాక్ (వికెట్ కీపర్), డీన్ ఎల్గర్, జుబేర్ హంజ, జార్జ్ లిండే, ముత్తుసామి, లుంగి ఎంగిడి, అన్రిచ్ నొర్జే, ఫిలాండర్, డేన్ ఫీట్, కగిసో రబాడ, రూడి సెకండ్.

**సఫారీలకు చివరి అవకాశం..**

వరుస ఓటములతో సతమతమవుతున్న పర్యాటక జట్టు సౌతాఫ్రికాకు పరువుదక్కించుకునేందుకు ఈ మ్యాచ్ చివరి అవకాశంగా మారింది. ఇప్పటికే వరుసగా రెండు ఓటములతో సిరీస్‌ను చేజార్చుకున్న సఫారీలకు రాంచీ టెస్టు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఎలాగైన గెలిచి...కనీసం డ్రా చేసుకుని వైట్‌వాష్‌ను తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే సఫారీ జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో ఘోరంగా విఫలమవుతోంది. ఓపెనర్ మార్క్‌రమ్ కూడా గాయంతో ఈ టెస్టుకు దూరమయ్యాడు. కెప్టెన్ డుప్లెసిస్ పర్వాలేదనిపించినా.. డీన్ ఎల్గర్, డికాక్, బవుమాలు తమ స్థాయికి తగ్గట్టు రాణించలేక పోతున్నారు. బౌలింగ్‌లోనూ రబాడా, ఫిలాండర్, అన్రిచ్ అంచనాలను అందుకోలేక పోతుండటం సఫారీలను కలవరపెడుతోంది.

## చివరి లీగ్ మ్యాచ్ డ్రా

**జోహార్ బహ్రు(మలేసియా) :** సుల్తాన్ జోహార్ కప్ హాకీ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం నామమాత్రంగా సాగిన చివరి లీగ్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. పోటీ పడ్డ ఇరు జట్లు భారత్, బ్రిటన్ ఇప్పటికే ఫైనల్‌కు అర్హత సాధిం చిన నేపథ్యంలో ఏ జట్టూ విజ యంకోసం అంతగా ఉత్సాహం చూపలేదు. భారత జట్టు తరఫున శీలానంద్ లక్ర(33ని.), మన్దీప్ మార్(51ని.), శార్దానంద్(57ని.) గోల్స్ చేయగా, బ్రిటన్ జట్టులో వాల్(17ని.), ఆండ్రూ మెక్‌నీల్(23ని.), మాథ్యూ రెన్‌షా(59ని.) గోల్స్ చేశారు. ఈ ఇరుజట్ల మధ్య ఫైనల్స్ శనివారం జరుగనుంది.

## దబాంగ్, వారియర్స్ తుది సమరం

**ప్రొ కబడ్డీ సీజన్-7 • రాత్రి 8.00గం.నుంచి ప్రత్యక్ష ప్రసారం**



**అహ్మదాబాద్ :** ప్రొ కబడ్డీ సీజన్-7 ముగింపుకొచ్చింది. దబాంగ్ ఢిల్లీ, బెంగాల్ వారియర్స్ జట్లు శనివారం తుది సమరంలో తలపడనున్నాయి. ఇరు జట్లు తొలిసారి ఫైనల్‌కు చేరినందున ఈ సీజన్‌లో కొత్త చాంపియన్ అవతరించనున్నది. నేటి రాత్రి స్థానిక ఎకా ఎరీనాలో ఫైనల్ జరుగనున్నది. ఇరు జట్ల కోచ్‌లు ఫైనల్‌కు చేరడంపట్ల సంతృప్తిని వ్యక్తంచేస్తూ ఫైనల్ మ్యాచ్ అభిమానులను అలరిస్తుందని తెలిపారు. విజేత ఎవరైనా చివరికి గెలిచేది ఆటేనని కోచ్‌లు కృష్ణకుమార్ హుడా(దబాంగ్ ఢిల్లీ), బి.సి.రమేష్(బెంగాల్ వారియర్స్) వ్యాఖ్యానించారు. ఇరు జట్లు సమఉజ్జీగా ఉన్నాయని, తుది సమరంలో గెలుపెవరిదో ముందుగా ఊహించడం కష్టమని కృష్ణకుమార్ అన్నారు. ఈ టోర్నీ ద్వారా కొంతమంది కొత్త ఆటగాళ్లు జాతీయ జట్టులో స్థానం పొందే అవకాశముందన్నారు. హుడా జాతీయ జట్టు కోచ్‌గా ఉన్న తరుణంలో రమేశ్ జట్టు ఆటగాడిగా వ్యవహరించడం గమనార్హం. టైటిల్‌కోసం ఇరు జట్లు హోరాహోరీ తలపడతాయని, కొత్త జట్లు ఫైనల్‌లో తలపడడం ఆనందంగా ఉందని రమేష్ అన్నారు. నిజమైన కబడ్డీని ఎలా ఆడాలో ఇరు జట్లు ప్రదర్శిస్తాయన్న నమ్మకముందన్నారు. దబాంగ్ ఢిల్లీ సెమీస్‌లో బెంగళూరు బుల్స్‌ను, బెంగాల్ వారియర్స్ సెమీస్‌లో యు ముంబాను ఓడించి తుదిపోరుకు చేరుకున్నాయి. నేటితో ప్రొ కబడ్డీ ఏడో సీజన్ ముగుస్తుంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు అంటారు.. నిజమే! కానీ...ఒకే వ్యక్తి కథ,నవల,పరిశోధన అనే మూడు వ్యాసంగాల్లో రాణించడం సాధ్యమా?.. అంటే సాధ్యమే అంటున్నారు...ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన డాక్టర్ చింతకింది శ్రీనివాస రావు.మూడు దశాబ్దాలుగా వృత్తిని,ప్రవృత్తిని ఏకకాలంలో కొనసాగిస్తూ....సాహితీ రంగంలో తనదైన ఒరవడిని సృష్టించుకున్నారు. కళింగాంధ్ర మాండలికంలో కథారచన సాగిస్తూ, ప్రామాణిక తెలుగులో పురాణ గాథల ఆధారంగా రచనలు చేస్తూ....పరిశోధకునిగా పేరు పొందారు. మరి జర్నలిజపు వృత్తిని, సాహితీ ప్రవృత్తిని సాగించడం వెనుక.. శ్రీనివాసరావుకు ఉన్న అభిరుచి ఏమిటి? జోడుగుర్రాల స్వారీలో ఆయన ఎదుర్కొన్న ఒడిదుడుకులు ఏమైనా ఉన్నాయా? పూర్తి వివరాలు చింతకింది మాటల్లోనే...!



## మహిళల రక్షణకు...

# ఊరికో వికర్ణుడు!

- శ్రీనివాసరావు

మా స్వస్థలం విశాఖ జిల్లా చోడవరం.. దిగువ మధ్యతరగతి కుటుంబం...డిగ్రీ వరకు చోడవరంలోనే చదువుకున్నా.నాన్న నాగేశ్వర రావు సంస్కృత పండితుడు. ఆయన శిష్యులు ..ఆముక్తమాల్యద, వసుచరిత్ర లాంటి గ్రంథాల్లో వచ్చిన సందేహాల నివృత్తికోసం ఇంటికి వచ్చేవారు. అలా నాకు నాన్న నుంచి ప్రాచీన సాహిత్యం పట్ల మక్కువ ఏర్పడి, చిన్ననాటి నుంచే వాటిని చదవడం అలవాటు చేసుకున్నాను. మరో పక్క అమ్మ సీత మ్మ నుంచి నాకు కళింగాంధ్ర భాష పట్ల మక్కువ పెరిగింది. మానాన్న నా రచనా వ్యాసంగానికి ఓనమాలు నేర్పితే... మా అమ్మ తన జీవిత అనుభవం నుంచి వచ్చిన అక్షర ఉత్పత్తులు వినడం అనేది పునాదులు వేసింది. అమ్మ మాటలు,పాటలు నా సాహిత్యంపై గొప్ప ప్రభావం చూపింది. ఇటు సాహిత్యానికి తోడు హైస్కూల్ నుంచే నేను నాటకాలు వేశాను.. నాటకాలు చూశాను.. గుర్రం జాషువా లాంటి మహామహులు రాసిన పద్యాలు విన్నాను. ఇక నాన్న,అమ్మల ద్వారా సంస్కృతాంధ్ర, కళింగాంధ్ర మాండలిక భాషలు వినడం,చదవడం వల్ల నా వృత్తి జర్నలిజమైనా, ప్రవృత్తి అయిన రచనా వ్యాసంగానికి దోహదం చేసింది. రావిశాస్త్రి కథలు, రచనలు నన్ను బాగా ఆకర్షించాయి. అలాగే గురజాడ,ఆరుద్ర లాంటి కవుల రచనలు చదివి రచనా వ్యాసంగంపై ప్రభావం చూపింది.







### చిన్ననాటి నుంచే...

పూర్వజన్మ సుకృతమో,అమ్మానాన్నల దీవెనో కానీ...నాకు చిన్ననాటి నుంచి రచనా వ్యాసంగం అలవాటైంది. ఇంటర్లో ఉండగా కాలేజ్ మ్యాగజైన్‌కు కథలు రాసేవాన్ని. స్కూల్ స్థాయి నుంచే నాటకాలు వేసేవాడిని. దానికి తోడు మహామహులు జన్మించిన కళింగాంధ్రలో పుట్టడం కూడా ఆ వాసన కొంత నామీద పడింది. నాకు రచనలు చేయాలనే కోరిక ఉన్నా..ఎలా రాయాలి? ఎవరి పక్కన నిలబడాలి ? అని నిర్ణయించుకోలేని దశలో జర్నలిజం వృత్తిలో ప్రవేశించి.. విశాఖకు వచ్చాను. అంతకు ముందే రావిశాస్త్రి కథలు చదివాను. ఆయనకు వీరాభిమానిగా మారాను. జర్నలిస్టుగా ఆయనను కలిశాను. ఆయన రచనల ప్రభావం వల్లే.. నేను కళింగాంధ్ర యాసలో రచనలు చేయాలని నిర్ణయం తీసుకున్నాను. దానికి తోడు అమ్మ ప్రభావం కూడా ఉందని చెప్పాలి. ఓసారి ఆచార్య ఎన్.గోపి గారు విశాఖకు రావడం..నేను ఆ సభలో పాల్గొనడం జరిగింది. అప్పటికే గోపి రచనలు చదివాను, ఆయనను కలవడం... . నాజీవితంలో కొత్త మలుపు తిప్పిందని చెప్పాలి. ఎందుకంటే నా కథలు చదివితే అక్షరాల వెంట పరుగెత్తిస్తుంది అని అన్నారు. నేను నవలలు రాస్తే ఎక్కడికో వెళ్లిపోతావని చెప్పారు. అప్పుడు నాలో వచ్చిన మార్పు ఏంటంటే.. అలాంటి వారితో కలిసినప్పుడు నాకు చెప్పుకోవడానికి ఒక స్థాయి ఉండాలని అనుకుని..అకడమిక్‌గా అప్‌డేట్ కావాలన్న తపనతో...ఎంఏ చదివాను.. గోపీ గారి నానీల మీద పీహెచ్‌డి చేశాను.



### కళింగాంధ్ర మాండలికంలో..

నేను కథలు కళింగాంధ్ర వాడుక భాషలో రాస్తాను. సరళమైన వాడుక భాషలో రాయడం మూలంగానే నా రచనలు ప్రజల్లోకి వెళ్లడానికి కారణం. ఇక్కడ మీకో విషయం చెప్పాలి.. నేను మాండలిక భాషలో కథలు రాస్తే.. పురాణ గాథ ఆధారంగా రచన చేసినప్పుడు సరళమైన ప్రామాణిక తెలుగు భాషలో రాసేవాడిని. అది నాకు ఆ సరస్వతి కటాక్షంగానే భావిస్తాను. ఇక నేను మూడు దశాబ్దాలుగా కథలు,నాటికలు, నవలలు, మానవీయ కథనాలు, పరిశోధన వ్యాసాలు రాస్తున్నాను. నా రచన ఓ వైపు వృత్తిని కొనసాగిస్తూనే ప్రవృత్తిగా సాహితీ సేద్యం చేస్తున్నాను.ఇప్పటివరకు దాలప్ప తీర్థం( కథాసంపుటి),కాన్పుల దిబ్బ( కథాసంపుటి) కప్పస్తంభం( కథాసంకలనం), పాలమ్మ, మేస్త్రుబాబు మరి నేను, వానతీర్పు, జలగల డాక్టరు తదితర 40కథలు రాశాను. అదీ కళింగాంధ్ర యాసలో..! అలాగే విక్రర్ణ, అదిగో ద్వారకా, ఔటర్ హార్బర్, బొగతల నాటి చుక్కపల్లి అనే నవలలు, గర్భగుడి, ఒప్పుల కుప్ప, శ్రీరాఘవం (పద్యనాటకం) ఎక్కడి వాళ్లు అక్కడే(బాలలనాటిక) తదితర నాటికలతో పాటు..15వరకు రేడియో నాటికలు రాశాను. పలు జ్ఞాపక సంచికలకు సంపాదకునిగా ఉన్నాను. రచయిత పతంజలిపై రాసిన పరిశీలనాత్మక గ్రంథాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది.

### ఊరికో వికర్ణుడు కావాలి

నాకు తెలిసినంత వరకు అవినీతికి అవకాశం లేని చోట నిజాయితీగా ఉండడం గొప్పకాదు.. లంచాలు వచ్చే ఉద్యోగంలో ఉంటూ నిజాయితీగా ఉండడం చాలా గొప్ప అనేది నా ఉద్దేశ్యం. అందుకే భారతంలోని కథ ఆధారంగా విక్రర్ణ రాశాను. కౌరవులలో 19 వాడు అనుకుంటా.. అతను ద్రౌపది వస్త్రాపహరణ సందర్భంగా సభలో ఎందరో మహామహులు,చివరకు పాండవులు సైతం మౌనంగా ఉంటే.. వికర్ణుడు మాత్రం అన్న తండ్రితో వదిన తల్లి తో సమానం.మన తల్లి వస్త్రాలు ఊడదీయం..అందుకే ద్రౌపదిని వివస్త్రను చేస్తే తల్లిని చేసినట్లే అని నిర్భయంగా చెప్పి ధర్మం పక్షాన నిలిచాడు. తాను చెప్పినా ఎవరు వినరని తెలిసి కూడా ఓ ఆడపడుచు పక్షాన నిలిచిన ధైర్యశాలి,నిజాయితీ పరుడు వికర్ణుడు. అందుకే ప్రస్తుతం సమాజంలో నిర్భయ లాంటి సంఘటనలు జరుగుతున్న ఈ రోజుల్లో ఊరికి ఒక వికర్ణుడు అవసరం అనే ఉద్దేశ్యంతోనే విక్రర్ణ నవల రాశాను. అదే విషయాన్ని ముందు మాటలో రాశాను.




### రచయిత చేతిలో పడితే..

వాస్తవానికి ఏదీ ప్రపంచ వస్తువు అంటూ ఉండదు..రచయిత చేతిలో పడితే అది ప్రపంచ వస్తువు అవుతుంది. కృతజ్ఞతగా ఉండడమే సాహిత్యం..అందుకే నా రచనల ద్వారా కృతజ్ఞత తీర్చుకున్నాను. నా కథావస్తువులు అన్నీ చోడవరం చుట్టే తిరుగుతాయి. బ్రాహ్మణ సమాజంలో పుట్టినా కూడా.. వారుచేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం కోసం నేను నా కథల్లో ఈ సామాజిక వర్గాన్ని కథావస్తువుగా చేసుకొని చెండాడాను. పూర్వం అగ్రవర్ణాల వారు విసర్జించిన మలాన్ని మనుషులు ఎత్తిపోయడం చూసాను. అది ఎంత హేయమైందో చెప్పండి. మన గుడ్డలు శుభ్రం చేసేవాళ్ల పండగ పూట ఇంటికి వస్తే..వారి కుండలో అన్నం,కూరలు, పిండి వంటలు పడేయడం చూసిన నేను ఆవిషయం పట్ల స్పందించాను. అలాగే ఈ పురుషాధిక్య సమాజంలో ఎందరో స్త్రీలు తమ కాళ్లమీద తాము నిలబడి, తన వాళ్లను బతికించుకుంటున్నారు. అలాంటి మహిళలు, అమ్మాయిలకు సంబంధించిన కథనాలు రాసాను. వాటన్నిటిని అలివేణి ఆణి ముత్యమా..అనే పుస్తకం తీసుకువచ్చాను. దానికి భరత ముని అవార్డు వచ్చింది. అలాగే పురాణాలలో ఎంతో ప్రాముఖ్యత ఉన్నా..మరుగున పడిపోయిన ఆడపడుచులను 60 మంది కథనాలు తీసుకుని మరువరాని పురాణ మహిళలు..అనే పుస్తకం రాశాను.సరోగసిని వ్యతిరేకిస్తూ.. గర్భసంచిని డబ్బుల సంచిగా మార్చొద్దన్న ఇతివృత్తంతో గర్భగుడి అనే నాటిక రాసాను. మొత్తానికి గత మూడు దశాబ్దాలుగా రచనా వ్యాసంగం సాగిస్తున్నాను. ఓపిక ఉన్నంత వరకు సాగిస్తూనే ఉంటాను.

### తృప్తిగానే ఉన్నా..

మాది పెద్దకుటుంబం అయినందున కొద్దో గొప్పో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాను. అంతేకాని నేను ఉద్యోగ జీవితం మొదలు పెట్టిన తర్వాత ఏనాడు ఆర్థికంగా బాధపడిన సందర్భాలు లేవు. నేను జర్నలిస్టుగా ఎన్ని పత్రికలు మారినా, ఎప్పుడు ఉద్యోగం మానేసినా మా అమ్మ ఏనాడూ ప్రశ్నించలేదు.

పెళ్లయిన తర్వాత సునీత కూడా నాకు ఇబ్బందులు కలిగించలేదు. నా వృత్తి,ప్రవృత్తిని దృష్టిలో పెట్టుకుని,పెళ్లయిన తర్వాతే పై చదువులు చదివి, బీఈడీ చేసి టీచర్ ఉద్యోగం చేసింది తప్ప, ఆర్థికంగా నన్ను ప్రశ్నించలేదు. ఇక ఇద్దరు ఆడపిల్లలు సైతం నన్ను అర్థం చేసుకున్నారు. అందుకే ఈ నలుగురు నా జీవితానికి నాలుగు స్తంభాలు. ఇక సాహితీపరంగా వస్తే..నా రచనలన్నీ నాకు తృప్తినిచ్చినవే. గర్భగుడి నాటిక రచనకు 2017లో నంది నాటకోత్సవాలలో ప్రథమ నంది పురస్కారం లభించింది. కథారచయితగా చాసో పురస్కారం, ఏపీ ప్రభుత్వ ఉగాది పురస్కారం, ఢిల్లీ తెలుగు పురస్కారం, ఉత్తమ పరిశోధనకు ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి త్రిపురనేని గోపీచంద్ స్మారక బంగారు పథకం ..ఇలా చాలా పురస్కారాలు అందుకున్నాను. నేను ఇప్పటి వరకు వృత్తి పరంగా, ప్రవృత్తి పరంగా,కుటుంబ జీవనం పరంగా తృప్తిగానే ఉన్నాను. ఆ దైవ కృపతో తృప్తిగానే ఉంటాను!

# రాచకోటల రాజస్థాన్!

రాజస్థాన్...అనగానే గుర్తుకు వచ్చేది థార్ ఎడారి. భౌగోళిక పరిజ్ఞానం ఉంటే ఆరావళి పర్వతాలు.. కానీ రాచరికపు ఆనవాళ్లు ఉట్టిపడే, చారిత్రక ప్రాధాన్యత కల్గిన కోటలు ఎన్నో ఉన్నాయన్న విషయం మనకు గుర్తుకు రాదు. కానీ రాజస్థాన్‌లో ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వ శిల్పకళకు ఆనవాళ్లయిన రాచరికపు కోటలు, పురాతన భవనాలు, ప్యాచ్ వర్క్‌తో కూడిన అందమైన జాకెట్లు, బ్లాంకెట్లు, పయాజ్ కచోరి, లాల్ మాస్ లాంటి స్థానిక ఆహారం తదితర ఎన్నో ప్రత్యేక అంశాలు చాలా ఉన్నాయి. అయితే ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనకు వెళ్లినప్పుడు తప్పక సందర్శించాల్సిన మూడు కోటల గురించి తెలుసుకుందాం!



✎ రాజస్థాన్ పర్యటనలో తప్పక సందర్శించాల్సిన ప్రదేశం అమర్ ఫోర్ట్! ఇది జైపూర్‌లో ఉంది. చాలా విశాలమైన ఈ కోటను సందర్శించినప్పుడు కలిగే ఆనందంతోపాటు, కోట మీది నుంచి జైపూర్ అందాలను సందర్శించవచ్చు. నగిషీలతో కూడిన ప్రవేశ ద్వారాలు, అందంగా అమర్చిన అద్దాల పై కప్పులు పర్యాటకుల మనస్సులను కట్టిపడేస్తాయి. ఎంతసేపు చూసినా తనివి తీరదు. ఈ పోర్టు వద్ద ఏర్పాటు చేసిన లైట్ అండ్ సౌండ్ షోను తిలకించడం మరిచిపోవద్దు. హిందీలో ఈ షోను సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ ప్రదర్శించడం విశేషం.

✎ రాజస్థాన్ పర్యటనలో చూడాల్సిన మరో ప్రదేశం జోధ్‌పూర్‌లోని మెహరంగర్ కోట. ఈ కోట అందాలు ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. కోటలోని గోడల మీద పురాణ గాథలను వర్ణిస్తూ గీసిన రంగురంగుల చిత్రాలు, అందంగా అలంకరించబడిన గదులు ఎంతగానో ఆకర్షిస్తాయి. నాటి చరిత్రకు,వాస్తు శిల్పానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందీ కోట. నాటి రాజుల రాజసాన్ని ప్రతిబింబిస్తుంది. కోటలోని కేఫేలో రుచికరమైన భోజనం లభిస్తుంది. ముఖ్యంగా ఇందులోని చాముండ ఆలయాన్ని సందర్శించడం మరిచిపోవద్దు. కోట నుంచి చూస్తే బ్లూ సిటీగా పేరుగాంచిన జోధ్ పూర్ అందాలు తిలకించవచ్చు.





✎ రాజస్థాన్ పర్యటనలో తప్పక సందర్శించాల్సిన మరో ప్రదేశం చిత్తోర్‌గడ్ లోని చిత్తోర్ కోట. ఇది ఒకనాడు మేవార్ రాజధాని. అప్పటి రాజులు ఈ కోటనుంచే పాలన సాగించారు. కోటలోపల పద్మినీ ప్యాలెస్, మీరా దేవి ఆలయాలు నిర్మాణాలు అద్భుతం. ఈ కోట నిర్మాణం నాటి రాజుల వైభవానికి ఆనవాలుగా నిలుస్తుంది. ఇది రాజస్థాన్‌లోని కోటలలోకెల్ల అతిపెద్ద కోట!

# చీజ్ నాన్ బాంబ్స్!

సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి రాగానే ఏదైనా వేడివేడిగా తినాలి అనిపి స్తుంది. ఓపిక ఉండదు. రుచికరమైన టిఫిన్ చేసుకోవాలన్నా సమయం పడుతుంది. అందుకే రెడీమేడ్ ఫుడ్ వైపు అడుగులు వేస్తాము. కానీ ఇంటివంట ఇంటి వంటే కదండి. అందుకే సాయంత్రం వేళ తినడం కోసం.. తక్కువ సమయంలో, చాలా సులువుగా తయారు చేసుకోగలిగిన రుచికరమైన అల్పాహారం గురించి తెలుసుకుందాం.



### కావలసిన పదార్థాలు

- 100 గ్రాముల మైదాపిండి
- 20మిల్లీ లీటర్ల నీరు
- 35గ్రాముల జున్ను
- 50గ్రాముల వెల్లుల్లి ముక్కలు
- 5గ్రాముల తురిమిన కొత్తిమీర
- 5మిల్లీ లీటర్ల ట్రఫుల్ ఆయిల్
- తగినంత ఉప్పు

### తయారు చేసే విధానం

మొదట మైదాపిండికి తగినంత ఉప్పు, నీటితో కలిపి మెత్తగా పిసికి ముద్ద చేసుకోవాలి. దానిని 20 నిమిషాలు ఫ్రీజర్‌లో ఉంచాలి. ఆ తర్వాత మైదా ముద్దను వెలికి తీసి, ఆరు భాగాలుగా విభజించి, వాటిని బంతులు చేసుకోవాలి.

ఆ బంతుల మీద వెల్లుల్లి, జున్ను, కొత్తిమీర ఉంచి, కట్‌లెట్ లాగా అదమాలి. అప్పుడు అవి క్యారెమ్ కాయిన్‌లాగా తయారు అవుతాయి. వాటిని ట్రఫుల్ ఆయిల్ చిలకరిస్తూ పెనంమీద వేయించాలి. ఇంకేముంది రుచికరమైన చీజ్ నాన్ బాంబ్స్ రెడీ!

# దాంపత్యం... సాఫీగా సాగాలంటే..!



దీర్ఘకాలికంగా ఒక బంధాన్ని కొనసాగించడం నల్లేరు మీద నడక కాదు. ముఖ్యంగా దాంపత్య బంధాన్ని ఆద్యంతం ఒకేలా సాగించలేము. ప్రేమ, ఆప్యాయతలో హెచ్చుతగ్గులు వస్తుంటాయి. మొదట్లో ఉన్నట్లు ఇప్పుడు ఎందుకు లేదన్న ఆలోచనలు మిమ్ములను చుట్టుముడతాయి. ప్రారంభంలో ఉన్న స్పార్క్ తగ్గిపోతుంది. దీంతో మీ భాగస్వామిని మీరు ఆకర్షించలేరు.. అలాంటప్పుడు ఏమి చేయాలి? ఇప్పుడు తెలుసుకుందాం!

➡ మొదట్లో ఉన్న స్పార్క్ లేనప్పుడు అలా ఎందుకు జరుగుతుందని మిమ్ములను మీరు ప్రశ్నించుకోవాలి. సంసారం అన్నప్పుడు,కుటుంబ భారం,పిల్లలు, చదువులు, ఇతరత్రా కారణాల వల్ల పని భారం పెరిగి ఒత్తిడి కారణంగా ఇలా జరుగుతుందన్న నిజం మీకు అర్థమవుతుంది. లేదంటే ఇతర వ్యాపకాల వల్ల కలిగే విసుగైనా అందుకు కారణమని గ్రహించగల్గుతారు. ఇంకా లేదంటే ఇదో నిరాశాజనకమైన పరిస్థితి అనిగ్రహిస్తారు. పని ఒత్తిడి వల్లనో ఇతర కారణాల వల్లనో అలా జరిగిందని గ్రహిస్తే..ఆ విషయాలు మీ భాగస్వామికి తెలిసేలా చెప్పండి.

➡ మీ భాగస్వామికి ప్రస్తుత నిరాశాజనకమైన పరిస్థితికి కారణాలు చెప్పి దాని గురించి చర్చించండి. ఒకసారి కాదు తరచూ దాని గురించి మాట్లాడాలి. అయితే మాట్లాడేటప్పుడు స్వేచ్ఛగా, స్పష్టంగా అపార్థాలకు తావులేకుండా ఉండాలి. మీ భాగస్వామికి తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా చెప్పేలా అవకాశం కల్పించాలి. అలా చేయడం వల్ల జీవితంలో లోపించిన స్పార్క్ నకు కారణాలు తెలుసుకుంటారు. ఒకరిని ఒకరు అర్థం చేసుకుని..అన్యోన్యంగా ముందుకు సాగుతారు.

➡ అయినా దాంపత్యాన్ని ఆవహించిన నిస్సారం తొలగ కపోతే ఇద్దరు కలిసి ఒకే అభిరుచిని అనుసరించండి. అది మార్నింగ్ వాక్, జిమ్, టీవీ వాచింగ్, క్యారమ్స్,చెస్..ఇలా ఏదైనా ఎంచుకుని దాని కోసం టైం కేటాయించండి. ఇలా చేయడం వల్ల బంధం బలపడుతుంది.

➡ మరో విషయం... జీవితమే ఓ ప్రయాణం అంటారు. అందుకే దంపతులిద్దరు కలిసి ఏదైనా టూర్ ప్లాన్ చేసుకోండి. ఇద్దరికి ఇష్టమైన ప్రదేశాలు తిరిగి రండి. శృంగార భరితమైన టూర్ ప్లాన్ చేసుకుంటే మరీ మంచిది.

# దినఫలాలు

**మేష రాశి**
పనులు విజయవంతంగా సాగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి. ప్రముఖులతో పరిచయాలు. ఆలోచనలు అమలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల కలయిక. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి. ఆహ్వానాలు అందుతాయి.

**వృషభ రాశి**
మిత్రులతో మాటపట్టింపులు. ఆధ్యాత్మిక చింతన. పనులు వాయిదా వేస్తారు. కష్టానికి తగిన ఫలితం కనిపించదు. ఆస్తివివాదాలు. వ్యాపారాలు. ఉద్యోగాలలో కొన్ని మార్పులు జరిగే వీలుంది. అనారోగ్యం.

**మిథున రాశి**
వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆప్తుల నుంచి కీలక సందేశం. విలువైన వస్తువులు కొంటారు. ఆస్తి వివాదాలు పరిష్కారం. శుభవార్తలు. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింతగా కలసి వస్తాయి. సత్కారాలు జరుగుతాయి.

**కర్కాటక రాశి**
శ్రమ మరింత పెరుగుతుంది. ఆస్తివివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో వివాదాలు. అనారోగ్యం. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు. ధనవ్యయం.

**సింహ రాశి**
అందరిలోనూ గుర్తింపు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పనులు చకచకా సాగుతాయి. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. స్థిరాస్తి వివాదాల పరిష్కారం. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడుల నుంచి విముక్తి.

**కన్యా రాశి**
నూతన ఉద్యోగాలు దక్కుతాయి. భూవివాదాలు కొలిక్కి వస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. వాహనయోగం. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత పురోగతి.

**తుల రాశి**
రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. కష్టానికి తగిన ఫలితం దక్కదు. ఆరోగ్య భంగం. పనులలో అవాంతరాలు. బంధువులతో తగాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొన్ని చిక్కులు ఎదురవుతాయి. ఆకస్మిక ప్రయాణాలు.

**వృశ్చిక రాశి**
బంధువులతో వివాదాలు. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగవు. శ్రమ పెరుగుతుంది. ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. అనుకోని ప్రయాణాలు. దైవదర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళం.

**ధనూ రాశి**
మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. అనుకున్న పనులు సకాలంలో పూర్తి. సంఘంలో పేరు ప్రతిష్టలు పొందుతారు. వాహనయోగం. వ్యాపారాలు, ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి.

**మకర రాశి**
వ్యవహారాలలో పురోగతి. ఆస్తుల వివాదాలు పరిష్కారం. వాహన,గృహయోగాలు. కీలక నిర్ణయాలు. ఊహించని ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతనోత్సాహం. దైవదర్శనాలు.

**కుంభ రాశి**
పనులు వాయిదా వేస్తారు. దూరప్రయాణాలు. ఇంటాబయటా సమస్యలు. బంధుమిత్రులతో విభేదాలు. విద్యార్థుల యత్నాలు నిదానిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు. అనారోగ్యం.

**మీన రాశి**
పరిస్థితులు అనుకూలించవు. వ్యయప్రయాసలు. మిత్రుల నుంచి ఒత్తిడులు. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు. ప్రయాణాలు వాయిదా. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొద్దిపాటి ఇబ్బందులు.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# గో గీత

**యత్వగస్థిగతం పాపం దేహే తిష్ఠతి మామకే**
**ప్రాశనాత్ పంచగవ్యస్య దహ్యత్యగ్నిరివేంధనమ్**
**(మహాభారతం, పంచగవ్య ప్రాశన)**

ఇంధనమును అగ్ని దహించినట్లుగా, పంచగవ్యములు శరీరమునందు పాపాన్ని (దోషాన్ని) దహించివేయును. అంతేకాదు గోవునకు అమృతస్యనాభిః అను ప్రవస్తి కలదు. అమృతం గోవులందు కలదని చెప్పారు.



- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

# చింతన

# అతి సర్వత్ర వర్జయేత్




ఆశ అనే దానికి మానవ జీవితంతో ఎంతో సంబంధం ఉంది. రేపు జీవించి ఉంటామన్న ఆశతోనే నేడు జీవన వ్యాపారాలు సాగుతాయి. అయితే ఈ ఆశకు మరో లక్షణం కూడా ఉంది. అదే అంతం లేకపోవడం. అందువల్లనే తరచు ఆశకు అంతం లేదనే మాట మనం తరచు అంటుంటాం లేదా వింటుంటాం. ఈ ఆశ గురించి ఒక సుభాషితం ఎలా విశ్లేషించిందో చూద్దాం.

**గిరిః మహాన్ గిరేః అబ్ధిః**
**మహాన్ అబ్ధేః నభో మహత్**
**నభో సోపి మహద్బ్రహ్మ**
**తతోప్యాశా గరీయసీ**

పర్వతం గొప్పది. పర్వతం కంటె సముద్రం గొప్పది. సముద్రం కంటె ఆకాశం గొప్పది. ఆకాశం కంటె బ్రహ్మము గొప్పది. బ్రహ్మం కంటె ఆశ గొప్పది. ఆశకు అంతంలేదనే దీని భావం. అలాంటి ఆశను ప్రోది చేసుకోవడం సమంజసమా? ప్రతి వ్యక్తిలో ఆశ ఉంటుంది. ఉన్నదానితో సంతృప్తిపడలేకపోవటమే కాక పోటీపడి ఇతరులతో సమానంగా ధనార్జన చేసి సంపదలు పెంచుకోవాలన్నదే ఆశ.

జీవితంలో అతిగా ఏది చేసినా అది హానికరమే అని గ్రహించిన గౌతమ బుద్ధుడు మధ్య పంథాను అవలంబించాలని సూచించాడు. సంపదలు అతిగా సంపాదించడం కాని, అసలు సంపదలు అక్కర్లేదు అనుకోవడం గాని రెండూ నష్టదాయకమే. ఇదే విషయాన్ని మంత్రద్రష్టలైన మునులు, ఋషులు 'అతి సర్వత్ర వర్జమేత్' అని సులభంగా తేల్చి చెప్పారు. కేవలం తన పొట్ట మాత్రమే నింపుకొనేవాడు, తన కోసం మాత్రమే ధనాన్ని దాచుకునేవాడు, పర ధనాలను అనుభవించేవాడు పాపాలను స్వీకరిస్తున్నట్లేనని వేద వచనం. స్వార్థం పనికిరాదని మన సనాతన ధర్మం బోధిస్తుంది . ఈ సంపదలను మనం అనేక ప్రాకృతిక శక్తుల నుంచి, సమాజం నుంచి పొందుతున్నాం. అందువలన దీనిని మనం మాత్రమే అనుభవించడం న్యాయం కాదు. భగవత్ప్రసాదంగా లభించిన దానిని పంచుకుని తినాలి.

ప్రతివ్యక్తి తనకు కావలసినంతే ఆర్జించాలి. ఎక్కువా ఆర్జించవచ్చు అయితే దానిలో కొంతైనా తోటివారికి పంచాలి. అంతేకాని భావితరాల కోసం దాచుకోవాలనుకోవడం దొంగతనంతో సమానం.

**యావత్ భ్రియేత జఠరం**
**తావత్ సత్వం హి దేహినామ్**
**అధికం యోభి మన్యేత**
**యస్తేనో దండమర్హతి**

తన అవసరానికి మించిన దానిని ఆశించేవాడు, సేకరించేవాడు దొంగ అనిపించుకుంటాడు. అతడు శిక్షార్హుడు అని ఆ శ్లోక భావం. అధిక సంపదలను పోగు చేసేవారు, ఇతరుల హక్కులను కాలరాచిన వారు దొంగలే అవుతారు. నల్లబజారు వ్యాపారులు సరుకులను దాచి అధిక ధరలకు అమ్ముతుంటారు. వారికి ధనేషణే కాని ఆత్మాభిమానం లేదు. ప్రతి వారికి ఆత్మాభిమానం ఉండాలి. ఆత్మాభిమానం గురించి సనాతన ధర్మం ఇలా చెబుతుంది.

ఏక ఏవ ఖగో మానీ, చిరంజీవతు చాతకః
మ్రియతే వా పిపాసాయాం యాచతే నా పురంధరమ్

పక్షులలో ఆత్మాభిమానం ఎక్కువగా గల ఒకే ఒక్క పక్షి చాతక పక్షి. దాని ఆత్మాభిమానం ఎటువంటిదంటే దప్పికతో చావనైనా చస్తుంది కానీ ఇంద్రుడిని తప్ప మరెవరినీ నీళ్లిమ్మని అడగదు. అది పూర్తిగా ఆకాశం నుంచి రాలిపడే నీటిపైనే ఆధారపడి జీవిస్తుంది. కానీ ఎట్టి పరిస్థితుల్లోను రాజీపడి భూమి మీది నీటిని తాగదు. అలాగే ఆత్మాభిమానం ఉన్న వారు ఇతరులకు చెందవలసిన దానిని తమ స్వార్థం కోసం వాడుకోరాదు. ఒక వ్యాపారస్థుడు లారీలోకి బియ్యాన్ని ఎక్కించి ఒక చోటు నుంచి మరో చోటికి వెడుతున్నాడు. దారంతా గతుకుతమయంగా ఉంది. లారీ చక్రం ఒక గోతిలో పడి లేచింది. ఈ అదురుకు ఒక బియ్యం బస్తా లారీలో నుంచి కిందపడింది. ఆ విషయాన్ని లారీ డ్రైవర్, క్లీనర్ గమనించలేదు. వారు వెళ్ళిపోయారు. నేల మీద పడి ఉన్న బస్తాను ఒక చీమ చూసింది. తన తోటి చీమలను పిలిచింది. అలా సుమారు వంద చీమలు బస్తాలో ఉన్న బియ్యంలో తలా రెండు గింజల్ని తిని వెళ్ళిపోయాయి. ఆ తరువాత ఒక ఎలుక ఆ బస్తాను చూసింది. మిత్రులకు చెప్పింది. పాతిక ఎలుకలు వచ్చి సుమారు పది గ్రాముల బియ్యం తిని వెళ్ళాయి. ఆకాశంలోఎగురుతున్న పక్షులు బియ్యం బస్తాను చూసాయి. అవి గుంపుగా వచ్చి కొన్ని బియ్యం తిని ఎగిరిపోయాయి. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి దారిలో పడి ఉన్న బస్తాను చూసాడు. అతడు మిగతా జంతువుల్లా తన తోటివారిని పిలవలేదు. ఆ బియ్యం బస్తాను భుజాన వేసుకుని సంతోషంగా ఇంటికెళ్ళిపోయాడు. ఇతర జీవులు ఆ బియ్యం మీద తమ ఒక్కరికే అధికారంలేదనుకుని తోటివారిని పిలిచి వారితో పంచుకున్నాయి. మనిషి మాత్రం స్వార్థంతో ఆ బియ్యం తనవి అనుకున్నాడు.

ఇక్కడ గమనించవలసిన అంశం ఏమంటే ఆ బియ్యం, ఆ మనిషి స్వార్జితం కాదు. తనది కానిది తన వద్ద నిల్వ ఉంచుకోవడాన్ని వేదం అంగీకరించదు. ఆ వ్యక్తి వీలైతే బియ్యం బస్తాను దాని యజమానికి అందించాలి. అది వీలుకాని పక్షంలో తన తోటి వారితో పంచుకోవాలి. స్వార్థపూరితమైన మనిషి అంతదూరం అలోచించడు. అతనిలోని ఆశ అతనిని అలోచించనివ్వదు.

మహాభారతం శాంతిపర్వంలోని ఈ శ్లోకాన్ని చూడండి, కోరికలతో మనిషి ఎంత దిగజారిపోయాడో తెలుస్తుంది.

**అంతోనాస్తి పిపాసాయాః తుష్టిస్తు పరమం సుఖమ్**
**తస్మాత్ సంతోష మేనేహ ధనం పశ్యన్తి పండితాః**

కోరికలకు అంతు ఉండదు కాబట్టి సంతృప్తి పరమ సుఖకారిణి. అందువలన విజ్ఞులైన వారు సంతృప్తి ద్వారా కలిగే సంతోషాన్నే సంపదగా భావిస్తారు.

గుమ్మా ప్రసాదరావు (భిలాయ్)
9755110398

# హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం



అవధూత, దత్తపీఠాధిపతి, జగద్గురు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నేటి సాయంత్రం ఐదు గంటలకు హైదరా బాద్‌లోని ఇందిరా పార్కులో గల ఎన్‌టిఆర్ స్టేడియంలో జరగనుంది. విశ్వ శాంతి లోక కల్యాణాలను కాంక్షిస్తూ ఈ యజ్ఞం నిర్వహిస్తున్నారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు స్వామి దివ్య సన్నిధిలో శారీరక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికై బృహత్ దత్త క్రియా యోగ శిబిరం జరగనుంది. ఇక్కడకు ప్రవేశం ఉచితమని, యోగ సాధకులు వదులుగా ఉండే తెల్లటి దుస్తులు ధరించాలని, శిబిరంలో పాల్గొనేవారు దుప్పటి లేదా యోగా మ్యాట్ వెంట తెచ్చుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# భగవద్గీత

అధ్యాయం- 18
శ్లోకం- 74



**ఇత్యహం వాసుదేవస్య**
**ప్రార్థస్య చ మహాత్మనః।**
**సంవాదమిమమశ్రౌషమ్**
**అద్భుతం రోమహర్షణమ్ ॥**

## గీతా శ్రవణంతో పులకితుడనయ్యాను

### సంజయ ఉవాచ

**తాత్పర్యం**

**సంజయుడు పలికెను :** ఈ విధముగా మహాత్ములైన శ్రీకృష్ణుడు మరియు అర్జునుని నడుమ జరిగిన సంవాదమును నేను శ్రవణము చేసితిని. అద్భుతమైన ఆ సంవాదముచే నాకు రోమాంచమగుచున్నది.

**భాష్యం**

సంజయుడు, తన గురువైన వ్యాసదేవుని కృప వలన కురుక్షేత్ర రణ రంగమును హస్తినాపురములో ఉండి దర్శించగలిగెను. అందువలన ధృతరాష్ట్రుడు, సంజయుడిని ''కురుక్షేత్ర రణ రంగమున ఏమి జరుగుచున్నది?'' అని ప్రశ్నించెను. ఇద్దరు మహాత్ములైన కృష్ణార్జునుల మధ్య జరుగుచున్న అటువంటి ఆ సంవాదము ఎన్నడునూ జరిగి యుండలేదు, ఎన్నడునూ జరుగబోదు. శ్రీకృష్ణుడే స్వయంగా తన గురించి, తన శక్తుల గురించి తన భక్తుడైన అర్జునునికి బోధించెను. మనము కూడా అర్జునుని అడుగుజాడలలో నడచినట్లైతే మన జీవితము కూడా ఉల్లాసభరితమై, జన్మ సార్థకమవుతుంది. ఈ విషయమును అర్థము చేసుకున్న సంజయుడు ధృతరాష్ట్రునికి వారి సంవాదము వివరించి కృష్ణార్జునులున్న చోట విజయము ఉంటుందని తెలిపి తన సమాధానమును ముగించెను.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యధాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

# శివప్రసాదం రుద్రాక్ష



(గత శనివారం నాటి వ్యాసం తరువాయి భాగం)

రుద్రాక్షల మహిమ, మహత్తు మాటలకందనిది. రుద్రాక్షలకు ముఖాలు ఉంటాయి. ఆ ముఖాల సంఖ్యను బట్టి వాటిని ఆయా రకాలకు చెందినవిగా పేర్కొంటుంటారు. రుద్రాక్షకు ఉన్నముఖాలను బట్టి వాటి రూపం, మహత్తు, తత్త్వం వేరుగా ఉంటాయి.

**ఏకముఖి రుద్రాక్ష:** దీనిని స్వయంగా ఈశ్వరుని స్వరూపంగా భావిస్తారు. ఇది పరమ తత్త్వ ప్రకాశము. దీనిని ధరించడం వల్ల పరమ తత్త్వ జ్ఞానం కలుగుతుందని భావిస్తారు.

**ద్విముఖి:** రెండు ముఖాలు గల ఈ రుద్రాక్షను శంకర పార్వతీ స్వరూపమని అంటారు. దీనిని ధరించడం వల్ల అర్ధనారీశ్వరుడు ప్రసన్నుడవుతాడు.

**త్రిముఖి:** ఇది సాక్షాత్తు అగ్ని స్వరూపం. దీని ప్రభావాన బ్రహ్మహత్యాదోషం సైతం భస్మమవుతుంది. ఈ రుద్రాక్ష మూడు అగ్నుల స్వరూపమైనందున దీని ధారణ వల్ల అగ్ని దేవుడు ప్రసన్నుడవుతాడు.

**చతుర్ముఖి:** నాలుగు ముఖాలున్న ఈ రుద్రాక్షను సాక్షాత్ బ్రహ్మ స్వరూపంగా పరిగణిస్తారు. దీనిని ధరించిన వారికి ఆరోగ్యం, ధనం చేకూరుతుందని, అంతేకాక వారి హృదయం అపారమైన జ్ఞాన సంపదకు నిలయమవుతుందని భావిస్తారు. అంతశ్శుద్ధికి చతుర్ముఖ రుద్రాక్ష ధరించడం శ్రేష్ఠం.

**పంచముఖి:** దీనిని కాలాగ్ని అనే పేరు గల రుద్రునిగా భావిస్తారు. దీనిని ధరిస్తే శంకరుడు ప్రసన్నుడవుతాడు.

**షణ్ముఖి:** ఆరు ముఖాలు గల ఈ రుద్రాక్ష కార్తికేయుని స్వరూపం. దీని అధిదేవత కార్తికేయుడు. దీనిని దక్షిణ హస్తమందు ధరించాలి. కొందరు విద్వాంసులు దీనిని గణేశుని రూపంగా చెబుతారు.

**సప్తముఖి:**ఈ రుద్రాక్షకు అధిదేవతలు సప్తమాతృకలు, సప్తాశ్వములు, సప్త ఋషులు. దీనిని ధరించిన వారికి మహాలక్ష్మి అనుగ్రహం ప్రాప్తిస్తుందని భావిస్తారు. అంతేకాదు అపారమైన జ్ఞానం, మహా ఆరోగ్యం చేకూరుతాయని అందరికీ ఆదరణీయుడవుతారని అంటారు.

**అష్టముఖి:** దీనిని సాక్షాత్తు గణేశుని స్వరూపంగా భావిస్తారు. దీనికి అధిదేవతలు అష్టమాతృకలు. ఈ రుద్రాక్ష అష్టవసువులు, గంగ అనుగ్రహాన్నిస్తుందని అంటారు. అంతేకాక దీని ధారణ వల్ల సత్యదేవులు ప్రసన్నులవుతారని, సమస్త సద్గుణాలు వీరికి సులభంగా ప్రాప్తిస్తాయని నమ్మకం.

**నవముఖి:** దీనిని భైరవ స్వరూపమని కొందరు, ధర్మరాజు స్వరూపమని మరికొందరు అంటారు. దీనిని ఎడమ భుజాన ధరించాలి. దీని ధారణ వలన మరణభయం, యముని భయం నివారణై ప్రశాంతత లభిస్తుంది.

**దశముఖి:** దీనిని సాక్షాత్తు జగన్నాథుని స్వరూపంగా భావిస్తారు. దీనిని ధరించిన వారు అన్ని దిశలా ప్రేమపాత్రులవుతారు.

**ఏకాదశముఖి:** దీనికి ఏకాదశ రుద్రులు అధిదేవతలు. దీనిని వారి స్వరూపంగా భావిస్తారు. మరికొందరు దీనికి ఇంద్రుడు ప్రముఖ దైవమని చెబుతారు. దీని ధారణ వలన సుఖ సమృద్ధి కలుగుతుందని విశ్వాసం.

**ద్వాదశముఖి:** ఇది సాక్షాత్తు విష్ణు స్వరూపం. దీనికి అధిదేవతలు ద్వాదశాదిత్యులు. ఈ రుద్రాక్షలను చెవులకు ధరించాలి. దీనిని ధరిస్తే ఈ పన్నెండుమంది సూర్యులు సదా రక్షిస్తుంటారని భావిస్తారు.

**త్రయోదశముఖి:**దీనిని కూడా సకల సిద్ధి ప్రదాతయైన కార్తికేయునితో సమానమని భావిస్తారు. ఈ రుద్రాక్షసమస్త కోర్కెలు తీర్చి సిద్ధిని ప్రసాదిస్తుందని నమ్మకం.

**చతుర్దశముఖి:** పద్నాలుగు ముఖాలుగల ఈ రుద్రాక్షస్వయంగా ఈశ్వరుని నేత్రముల నుంచి ప్రకటితమయిందని చెబుతారు. దీనిని ధరిస్తే మన మనో నేత్ర చక్రం బలీయమై అన్ని విషయాలను మనం వీక్షించగలిగే ఆధ్యాత్మిక బలం, శక్తియుక్తులు మనలో పెంపొందుతాయంటారు. అంతేకాక సర్వ రోగాలు తొలగిపోయి ఆరోగ్యం లభిస్తుంది. సకల పాపాలు నశించి, సర్వ శుభాలు చేకూరుతాయి. ఇది లభించడం కష్టమే. అదృష్టవశాత్తు లభిస్తే దీనినితలపైన ధరించాలి.

ఇవికాక 15, 16, 17, 18, 19, 20 ముఖాలుగల రుద్రాక్షలు కూడా ఉన్నాయి. అంతేకాక మహాకాళి రుద్రాక్ష, గర్భగౌరి, గౌరీశంకర్, గణేశ్ రుద్రాక్షలు వంటివి కూడా ఉన్నాయని పెద్దలు చెబుతారు.

వ్యాపారధోరణి బాగా ప్రబలిపోయిన ప్రస్తుత కాలంలో ఎన్నో రకాలైన నకిలీ రుద్రాక్షలు కూడా రాజ్యమేలుతున్నాయి. అందువలన ఈ రంగంలో నిపుణుల సాయంతో అసలైన వాటిని ఎంచుకోవాలి.

రుద్రాక్షలు నేపాల్లోను, ఇండొనేషియా (జావాదీవి)లోను దొరుకుతాయి. ఇండొనేషియా వాటితో పోలిస్తే నేపాల్ రుద్రాక్షలు కొంచెం పెద్దవిగా, స్పష్టంగా ముఖాలు కలిగి ఉంటాయి.

**(రుద్రాక్షల మరిన్ని విశేషాలు వచ్చే శనివారం సంచికలో)**



'రమ'ణీయం

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

epaper.prabhanews.com

# బాల ప్రభ

# అవ్వ బువ్వ

కథ

**సిం**హపురి సామ్రాజ్య నేత సింహబలుడు ఒక రోజు సాయంత్రం మారు వేషంలో బంగాళాఖాతం సముద్ర తీరాన వ్యాహ్యాళికి వెళ్ళాడు. పౌర్ణమి రోజు కావడంతో ఆకాశంలోని చందమామను చూస్తూ వందలాది జనం సముద్ర తీరాన నడుస్తున్నారు. నడకకు వచ్చిన వారు ''తింటే కోమలవ్వ బువ్వ తినాలి, వింటే భారతం వినాలి'' అని మాట్లాడుకోవడం రాజు చెవిన పడింది.

కోమలవ్వ భోజనశాలకు అంత మంచి పేరు ఎలా వచ్చిందో చూడాలని రాజుకు కుతూహలం కలిగింది. రాత్రి భోజనానికి వేళ కావడంతో వెంటనే సముద్రతీరం నుంచి నడుచుకొంటూ మారు వేషంలోనే కోమలవ్వ భోజనశాలకు వెళ్ళాడు. రాజును కోమలవ్వ ఆప్యాయంగా ఆహ్వానించి పీట వేసి కూర్చోబెట్టి అరటిఆకులో అన్నం, కూరలు, గడ్డ పెరుగు వడ్డించింది. రాజు తృప్తిగా తిన్నాడు.

శుభ్రంగా తిని చేతులు కడుక్కొని నారమంచం పైన కూర్చొని తాంబూలం వేసుకొంటున్నాడు. మంచంపైన కూర్చొన్న వ్యక్తి ఠీవి చూసిన కోమలవ్వకు భోజనానికి వచ్చిన వ్యక్తి రాజేమోనని అనుమానపడింది. పక్కనున్న వారి సహాయంతో అతడే రాజని గుర్తించింది. అరిటాకు ముళ్ళు మీద పడ్డా, ముళ్ళు అరిటాకు మీద పడ్డా అరిటాకుకే నష్టం అన్న విషయం ఆమెకు గుర్తొచ్చింది. వంట విషయంలో, వడ్డన విషయంలో తప్పులేవైనా జరిగినాయేమోనని ఆలోచించింది. రాజు కత్తికి రెండు వైపులా పదునే కదా అనుకొంటూ భయభయంగా రాజు వద్దకు వచ్చి నిలబడింది.

రాజు చిరునవ్వు చిందిస్తూ అభిమానంగా అవ్వతో '' అవ్వా, నీ బువ్వకు ఇంత రుచి ఎలా వచ్చింది'' అని అడిగాడు.

''రాజా, ఔషధ గుణాలున్న అరిటాకులో అన్నం వడ్డిస్తే తిన్న వారు ఆరోగ్యవంతులవుతారన్న విషయాన్ని నమ్మినవాళ్ళం. మనం బంగారు పళ్లెంలో తిన్నా కలగని తృప్తి, అరిటాకు భోజనంలో వుంటుందని విశ్వసించేవాళ్ళం. అందుకోసం గొలగమూడి గ్రామం వద్ద అయిదు ఎకరాల అరటి తోటలు పెంచాము. సరైన నీటి వసతి లేక, సేద్యం చేయలేక నేలను అమ్మివేశాము. అయినా అరిటాకులో భోజనం వడ్డించడం మాత్రం మానలేదు. సమయానికి మన ఊరిలో అరిటాకులు దొరకక పోతే దూర ప్రాంతాలకైనా వెళ్లి అరిటాకులు తెచ్చి వడ్డిస్తున్నాము. ఎండైనా వానైనా, కరువైనా వరదయినా మా కష్టాలు మేము పడి అరిటాకులు సమకూరుస్తున్నాము. అవకాశం వున్నంత వరకు కొన ఆకులే తెప్పిస్తాము.అందులోనే వడ్డిస్తాము.

పచ్చటి ఆకులో వేడివేడి తెల్ల అన్నం, కూరలు వడ్డిస్తే తినేవారి కళ్ళకు మంచి ఆహారం తింటున్నామన్న భావన కలుగుతుంది. సహజమైన అరిటాకులో వేడివేడి ఆహారం తినడం వల్ల భోజనం చేసిన వారు ఆరోగ్యంగా వుంటున్నారని కూడా మాకు పేరు వచ్చింది. ఎలాగంటే అరటి ఆకులో వుండే ప్రాణ వాయువు, ఇతర ఔషధ గుణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఆహార పదార్థాల వేడికి ఆకులోని పోషకాలు భోజన పదార్థాల్లోకి చేరుతుంది. వంటల రుచి పెరుగుతుంది.

అలాగే పొరబాటుగా ఆహారంలో ఏమైనా విషపదార్థం చేరితే ఆకు రంగు కూడా మారుతుంది కాబట్టి విషాహారాన్ని వెంటనే కనిపెట్టి పక్కన పెట్టేస్తాం.

అంతే కాకుండా భోజనానంతరం ఆ అరటి ఆకులను మా పశువులకు ఆహారంగా పెట్టడం ద్వారా అవి మంచి పాలు ఇస్తున్నాయి. అందువల్ల భోజనానికి వచ్చినవారికి మేము మంచి గడ్డ పెరుగు అందించగలుగుతున్నాము. దీనితో భోజనం చేసేవారి కళ్ళల్లో తృప్తి, భోజనం చేసేసిన వారిలో సంతృప్తి చూడగలుగుతున్నాము.

మా కన్నా వంటలు రుచిగా చేసేవాళ్ళు ఈ రాజ్యంలో ఎందరో వున్నారు. నిపుణులైన వంట మనుష్యులుగానీ, ఆధునాతన వంట సామగ్రిగానీ మా వద్ద లేదు. కట్టెల పొయ్యిపైన చేసిన వంటను మేము అరిటాకుల్లో వడ్డిస్తాము. మిగతా వాళ్ళు కంచాల్లో వడ్డిస్తారు. అంతే తేడా. మేము చేసే అరిటాకు వడ్డనే మాకు మంచి పేరు తెచ్చి పెడుతోంది. అంతకు మించి మా ప్రత్యేకతలు ఏమీ లేవు మహారాజా, అందరిలాగే మేము కూడా వంటలు వండుతున్నాము, వడ్డిస్తున్నాము ''అని బదులిచ్చింది.

అరటి ఆకు విశిష్టత తెలుసుకున్న రాజు అరటితోటలకు అనువైన, నీటి సదుపాయం వున్న నేలను ఆమెకు బహుమతిగా వ్రాసి ఇచ్చాడు. సంప్రదాయబద్ధంగా అరటి ఆకులో భోజనం వడ్డించే కోమలమ్మ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. జనం ఆహా ఓహో అంటూ లొట్టలేసుకొంటూ అవ్వ బువ్వ తినసాగారు.



- ఆర్ సి కృష్ణస్వామి రాజు
తిరుపతి 9393662821

## పక పక

### నేను చూశా.. నేను చూశా..

**నాన్న:** ఐసిఐసిఐ అంటే ఏంటీ?

**అమాయకరావ్:** ఓస్, అదికూడా తెలిదట్రా? నేను చూశా. నేను చూశా.. నేను అని అర్థం



### చెప్పుల జత



**సోము:** నీ చెప్పుల జత ఒకటి ఎర్ర రంగులో, మరోటి పచ్చరంగులో భలే వింతగా ఉందేంటి?

**పప్పూ:** అచ్చం ఇలాంటి వింత జతే మా ఇంట్లో మరోటి ఉంది..!

## బంగారు పలుకు



బలాఢ్యుడవై, ధైర్యశాలివై నిలబడు...
బాధ్యనంతా నీ మీదే పెట్టుకో..
నీ విధికి నీవే విధాతవని తెలుసుకో..

- స్వామి వివేకానంద

# బాబోయ్ ఇదేమి చెట్టు

**ప్ర**పంచంలో ఎత్తయిన చెట్టు కాలిఫోర్నియా అడవుల్లో ఉంది. దీన్ని జెయింట్ సెకోయ్, జెయింట్ రెడ్ వుడ్, సెర్రా రెడ్ వుడ్, బిగ్ ట్రీ అంటూ రకరకాల పేర్లతో పిలిచేస్తారు. దాదాపు 250 అడుగుల ఎత్తువరకు పెరిగింది. అంటే 25 అంతస్థుల ఎత్తువరకు ఉంది. మరికొన్ని 300 అడుగుల వరకూ పెరుగుతాయి. ఈ చెట్టు మొదలు ఏకంగా 35 అడుగుల విస్తీర్ణాన్ని ఆక్రమిస్తుంది. పెద్ద కాండం ఉంటుంది. ఇంచుమించు 650 టన్నుల బరువు ఉంటుంది. చెట్టు బెరడు మందంగా, మూడు అడుగుల వరకు ఉంటుంది. వంద అడుగుల ఎత్తు నుంచి కొమ్మలు పెరుగుతాయి. చిన్న ఆకులతో ఎప్పుడూ పచ్చగా కనిపిస్తుంది. మూడు అంగుళాల పరిమాణంతో ఉండే కాయల్లో బోలెడు విత్తనాలుంటాయి. అడవుల్లో చెలరేగే మంటల ద్వారా వేడికి ఈ విత్తనాలు బయటకు వచ్చి మళ్లీ మొలకెత్తుతాయి. ఇంత పెద్ద చెట్టు కదా విత్తనాలు కూడా భారీ సైజులో ఉంటాయనుకోకండి. దీని విత్తనాలు చిన్నవిగానే ఉంటాయి.

### లాభాలు

☞ ఈ చెట్టు నుంచి పెద్ద పెద్ద దుంగలు వస్తాయి. కానీ ఇవి కాస్త పెళుసుగా ఉండటం వల్ల నిర్మాణాల్లో నన్ను వాడరు. కంచె, టూత్ పిక్స్ తయారీల్లో ఉపయోగిస్తుంటారు.

☞ చెట్టు భారీ రూపాన్ని చూడ్డానికి పర్యాటకులు ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు. ఎంతో ఎత్తు పెరిగిన కొన్ని చెట్లకు జెయింట్ షర్మెన్, జనరల్ గ్రాంట్, ప్రెసిడెంట్, లింకన్, స్టాజ్ అంటూ రకరకాల పేర్లు పెట్టేశారు.

### ప్రత్యేకత

ఈ వృక్షం అతిపురాతనమైంది. అంతే కాదూ త్వరగా పెరిగేస్తుంది. సుమారు 2వేల ఏళ్లకు పైగా బతుకుతాం.





# అగ్నిపునీత సీత




సాధ్వీమణి
సీతయున్న
సత్యము
జనులకు తెలుపగ
అగ్ని ప్రవేశము చేయుగ
అయోనిజను శ్రీరాముడు
ఆదేశించగ వెంటనె
ఆ దేవియు అగ్నిదూకె!
సీత అగ్నిపునీతయై
శ్రీరాముని చెంతచేరె!
పులకితయై అయోధ్యకే
పుష్పకమున బయలుదేరె!
రావణ
బ్రహ్మను
చంపిన
బ్రహ్మ హత్యపాతకాన్ని
అణగించగ శ్రీరాముడు
అంబుధి దాటిన స్థలమున
లింగాభిషేకముతో
లీలగ శివు ప్రార్థించగ
రామలింగేశ్వరముగ
నిలిచెను!



డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్:9246541699

## క్విజ్ కొశ్చన్స్

ఎ. మొదటి క్రికెట్ ప్రపంచ కప్‌లో ఏ రంగు బంతుల్ని వాడారు?



బి. ఏ ప్రపంచ కప్‌లో ఎక్కువ జట్లు పోటీ పడ్డాయి? ఎన్ని?



సి. భారత్ తరపున ప్రపంచ కప్‌లో సెంచరీ చేసిన తొలి ఆటగాడు ఎవరు?



జవాబులు: ఎ. ఎరుపు,
బి. 2007, సి.కపిల్ దేవ్ (1983)

## తేడా కనుక్కోండి

### బ్రషింగ్ ఇట్ రైట్

పళ్లు తళతళ కనబడాలంటే ప్రతిరోజు రెండు పూటలా బ్రషింగ్ చేయాలి. ఈ రెండు చిత్రాల్లోని తేడా కనుక్కోండి.



epaper.prabhanews.com

## రాజు గారి గది 3

# నేలబారు హారర్ కామెడీ...




దెయ్యాల సినిమాలంటే ఒకప్పుడు భయంతో వణికిపోయేవారు ప్రేక్షకులు. అంత తీవ్రంగా ఉండేవి. ఈ కథల్లో నవ్వుకు చోటే లేదు. రజినీ చంద్రముఖి సినిమాలో వడివేలు చేసిన హాస్య సన్నివేశాలకు పేరొచ్చాక...కొందరు దర్శకులు ఆ వినోదం వైపు దృష్టిసారించారు. హారర్ కథల్లో అతి తక్కువ స్థానముంటే హాస్యాన్ని, ప్రధానంగా తీసుకుంటూ ఇవాళ్టి భయానక చిత్రాలు రూపొందిస్తున్నారు. ఇవాళ మన సినిమాల్లో దెయ్యం కూడా ఒక హాస్యనటుడే. ప్రేమ కథా చిత్రమ్, కాంచన ఇలా రూపొంది విజయం సాధించినవే. ఏదో ఒక సినిమా జనాలకు నచ్చిందని, పుంకాను పుంకాలుగా ఈ హారర్ కామెడీ చిత్రాలు తెరపైకి వస్తున్నాయి. వాటిలో ఒకటే రాజుగారి గది 3.

**నటీనటులు -** అవికా గోర్, అశ్విన్, అలీ, బ్రహ్మాజీ, ప్రభాస్ శీను, హరితేజ, అజయ్ ఘోష్, ఊర్వశి తదితరులు
**సాంకేతిక వర్గం :** సంగీతం - షబీర్, సినిమాటోగ్రఫీ - ఛోటా కె నాయుడు, ఎడిటర్ - గౌతంరాజు, ఆర్ట్ - సాహి సురేష్, మాటలు - సాయి మాధవ్ బుర్రా, స్టంట్స్ - వెంకట్, నిర్మాణం - ఓక్ ఎంటర్‌టైన్‌మెంట్స్, దర్శకుడు - ఓంకార్.

**కథ:** మాయ (అవికా గోర్) ఒక వైద్యురాలు. ఆమెకు దగ్గరవ్వాలని ప్రయత్నించే అబ్బాయిలను ఓ దెయ్యం పీడిస్తుంటుంది. సహ వైద్యుడు (బ్రహ్మాజీ) మాయను వలలో వేసుకోవాలి ప్రయత్నించి ఇలాగే దెయ్యం బాధితుడు అవుతాడు. అశ్విన్ (అశ్విన్) ఆటో డ్రైవర్, తనుండే కాలనీలో విపరీత చేష్టలతో మిగతా వాళ్లను ఇబ్బందిపెడుతుంటాడు. కాలనీ వాళ్లంతా అశ్విన్ పీడ విరగడ చేయించుకోవడం కోసం మాయ ప్రేమలో పడేలా చేస్తారు. మాయను ప్రేమిస్తున్న అశ్విన్‌ను కూడా దెయ్యం వేధిస్తుంది. ఇంతకీ మాయను ఆత్మ ఎందుకు కాపాడుతోంది. దీని వెనక కథేంటి అనేది సినిమాలో చూడాలి..

### ఆకర్షణలు..

హారర్ కామెడీ చిత్రాల్లో ఉండే హాస్యానికి ఎక్కువ అవకాశమిచ్చిందీ సినిమా. అలీ, అజయ్ ఘోష్, ఊర్వశీ పాత్రలతో ఆ నవ్వులను పండించాడు. ప్రధాన పాత్రలన్నీ పాత బంగ్లాలోకి వెళ్లినప్పుడు వచ్చే ఇరవై నిమిషాల హాస్య సన్నివేశాలు నవ్విస్తాయి. ఇవి తప్ప సినిమాలో ఆసక్తికర అంశాలు లేవు. ఇలాంటి హారర్ సన్నివేశాలు కనీసం వంద సినిమాల్లో చూసుంటాం. ఛోటా కె నాయుడు సినిమాటోగ్రఫీ బాగుంది. సెట్ ప్రాపర్టీస్ సహజత్వంతో, భయపెట్టేలా రూపకల్పన చేశారు.

### వికర్షణలు..

చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీద అనే సామెత ఒకటుంది. చేసే పనొక చోట, మనసు మరో చోటా ఉంటే ఫలితం ఆశించినట్లు రాదు. రాజు గారి గది 3లో దర్శకుడు ఓంకార్ పనితనం ఇలాగే ఉంది. కథను భయానక నేపథ్యంలో రాసుకుని, నవ్వులకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. దాంతో ప్రథమార్థం అంతా కథ మొదలే కాదు. మాయను ఆత్మ ఎందుకు కాపాడుతోంది అనేది ఆసక్తికర మలుపు కావాల్సిన అంశం. కానీ ఇక్కడే దాన్ని చెప్పేందుకు మొదటి అర్థభాగం కథను సాగదీశాడు దర్శకుడు. ఈ మధ్యలో ఖాళీగా ఉన్న కథలో నేలబారు వినోదాన్ని చూపించారు. నాయిక అవికా గోర్‌కు చేసేందుకేం లేదు. బహుశా ఈ కారణం వల్లే తమన్నా ఈ సినిమా నుంచి తప్పుకుందేమో. అశ్విన్ నటుడిగా ఫర్వాలేదనిపించాడు. సాయి మాధవ్ మాటల్లో పదను తగ్గిపోయింది.

### చివరగా..

అతి పల్చని కథతో, ఏవో మలుపులు ఉంటాయని ఊహించేలా చేసి, చివరకు ఉసూరుమనిపించింది రాజు గారి గది 3. జబర్దస్త్ తరహా రెండు మూడు హాస్య సన్నివేశాలు పెడుతూ కథను లాగించాడు దర్శకుడు. ఈ కాసేపు నవ్వుకునేందుకు తప్ప రెండు గంటల చిత్రంలో ఆకర్షణీయమేదీ లేదు.

**రేటింగ్ 1.5/5**



ఘాజీని, అతని ఉగ్రవాద బృందాన్ని ఎలా మట్టుపెట్టాడు అనేది కథాంశం..

**ఆకర్షణలు..** దర్శకుడు ఎంచుకున్న అంశం విభిన్నమైంది. ఇందులో దేశభక్తి మిళితమైంది. కశ్మీరీ పండిట్‌ల కథతో మన దగ్గర సినిమాలు రాలేదు. ఈ కథను ఎంచుకోవడం సినిమాకు కొత్తదనం తీసుకొచ్చింది. ఉగ్రవాది ఘాజీని పట్టుకోవాలనే అర్జున్ లక్ష్యం, పట్టుకునే క్రమం ఆసక్తికరంగా సాగుతాయి. అర్జున్ పండిట్ పాత్రలో ఆది, ఘాజీ బాబాగా రచయిత అబ్బూరి రవి ఆకట్టుకునేలా నటించారు. రావు రమేష్ పోషించిన పాత్ర సహజంగా ఉంది. ఉన్న కొద్ది వనరుల్లో కథకు న్యాయం చేసేందుకు సాంకేతిక నిపుణులు కష్టపడ్డారు. బడ్జెట్ లేకపోవడం నిర్మాణ విలువల్లో కనిపిస్తూ ఉంది.

## ఆపరేషన్ గోల్డ్ ఫిష్

# దమ్ములేని యాక్షన్ డ్రామా...

దర్శకుడిలో సత్తా ఉంటే ఏ కథనైనా అద్భుతంగా తెరకెక్కిస్తాడు. ఆ దమ్ము లేనప్పుడు సినిమా ఫలితం అలాగే వస్తుంటుంది. సాయి కిరణ్ అడవిలో దర్శకుడిగా అరుదైన ప్రతిభేం కనిపించదు. అతనో సాధారణ దర్శకుడు. రుజువు కావాలంటే అతని గత సినిమా కేరింత చూడండి. అలాంటి దర్శకుడు కాశ్మీరీ పండిట్ల సమస్యల ఇతివృత్తంతో సినిమా చేస్తే, గొప్ప అంచనాలు ఏర్పడలేదు. అందుకు తగినట్లే ఉంది ఆపరేషన్ గోల్డ్ ఫిష్.

**నటీనటులు**
ఆది సాయికుమార్, రావు రమేష్, కృష్ణుడు, అబ్బూరి రవి, సాషా చెత్రి, నిత్యా నరేష్, కార్తీక్ రాజు, పార్వతీశం, అనీష్ కురువిల్లా తదితరులు...

**కథ..** అర్జున్ పండిట్ (ఆది సాయికుమార్) కశ్మీరీ పండిట్‌ల కుటుంబానికి చెందినవాడు. కశ్మీర్ వదిలి వెళ్లాలని అతని తల్లిదండ్రులను ఘాజీ బాబా ఉగ్రవాద బృందం చంపేస్తారు. ఘాజీ బాబా మీద పగతో అతన్ని పట్టుకోవాలని ఎన్ఎస్‌జీ కమాండర్ అవుతాడు అర్జున్. ఎంతో సాహసంతో ఘాజీ బాబాను పట్టుకుంటాడు. ఘాజీని విడిపించేందుకు అతని ఉగ్రవాద బృందం ప్రయత్నిస్తుంటుంది. కేంద్రమంత్రి కూతురును అపహరించి, తమ నాయకుడిని విడిపించుకోవాలని పథకం వేస్తుంది. ఈ ప్రణాళికను అర్జున్ ఎలా అడ్డుకున్నాడు.

**వికర్షణలు..** ఉట్టికి ఎగరలేనమ్మ, ఆకాశానికి ఎగిరిందట అన్నట్లు దర్శకుడి ప్రతిభకు ఈ కథ చాలా పెద్దది. ఆయన ఇలాంటి క్లిష్టమైన కథను ఎంచుకోవడమే సరికాదు. దేశ రక్షణ, దేశభక్తి, ఉగ్రవాదుల ఏరివేత లాంటి అంశాలున్న కథలను ప్రేక్షకులను నచ్చేలా రూపొందించాలంటే చాలా మేధస్సు, నాటకీయత కావాలి ఆ రెండూ ఆపరేషన్ గోల్డ్ ఫిష్‌లో లోపించాయి. ఈ కథకు కావాల్సిన భారీతనం లేదు. ఉన్నంతలో అటు కథను ఏకాగ్రతగా చెప్పడం, ఇటు వాణిజ్య అంశాలైన ప్రేమ, వినోదాన్ని చూపించడంలో దర్శకుడు రెండు పడవల మీద కాలేసి గమ్యానికి దూరంగా వెళ్లిపోయాడు.

**చివరగా..** ఆపరేషన్ గోల్డ్ ఫిష్ కథ కోసం దర్శకుడు చేసిన కసరత్తు, కథనం మీద కనిపించలేదు. మీరెంత గొప్ప కథైనా, ఆసక్తికరంగా చెప్పకపోతే థియేటర్‌లో ఎవరూ ఉండరు అనేది నిజం.

**రేటింగ్ 2/5**



శ్రీనివాస్ కానూరు, రఘు కుంచె,దేవి శ్రీ ప్రసాద్ ,శ్రీనివాసరెడ్డి

# ఆకట్టుకునే థ్రిల్లర్...

సత్యదేవ్, ఈషా రెబ్బ, శ్రీరాం, గణేష్, ముస్కాన్ సేథీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం రాగల 24 గంటల్లో. ఢమరుకం శ్రీనివాసరెడ్డి దర్శకత్వంలో శ్రీనివాస్ కానూరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా వచ్చే నెల విడుదలకు సిద్ధమవుతోంది. రాగల 24 గంటల్లో సినిమా ప్రచార గీతం విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు ఢమరుకం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...దేవి స్ఫూర్తితోనే ప్రచార గీతాన్ని రూపొందించాం. రఘు కుంచె మంచి స్వరాన్ని అందించారు. కృష్ణ భగవాన్ ఆకట్టుకునే సంభాషణలు రాశారు. మా నిర్మాతకు అభిరుచి ఉంది. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. సాంకేతిక నిపుణులు నా కథను రూపకల్పన చేయడంలో శ్రమించారు. అన్నారు. నిర్మాత శ్రీనివాస్ కానూరు మాట్లాడుతూ...మాకు ఇతర వ్యాపారాలు ఉన్నా, సినిమా మీద ఇష్టంతో నిర్మాతను అయ్యాను. నా స్నేహితుడు శ్రీనివాసరెడ్డితో సినిమా చేయ డం సంతోషంగా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చేలా ఉంటుంది. అన్నారు. అతిథిగా వచ్చిన దేవి శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ...ఢమరుకం సినిమా నుంచి శ్రీనివాసరెడ్డి నాకు మిత్రులు అయ్యారు. వా కుటుం బ సభ్యుడిగా భావిస్తుంటా. రాగల 24 గంటల్లో సినిమా ట్రైలర్, టీజర్ బాగున్నాయి. సినిమాను ప్రచారం చేసుకో వాల్సిన బాధ్యత అందరిదీ. దీనివల్ల నిర్మాతకు మేలు జరుగు తుంది. ఈ సినిమా విజయంతో శ్రీనివాస రెడ్డికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నా. అన్నారు.ఈ కార్యక్రమంలో రఘు కుంచె, కృష్ణ భగవాన్, గీత రచయిత శ్రీమణి తదితరులు పాల్గొన్నారు.



డిస్కో రాజాలో రవితేజ

# రొమాంటిక్ పాటల్లో...



మౌనీరాయ్

నటిగా, డాన్సర్‌గా పేరు తెచ్చుకుంటోంది మౌనీరాయ్. ఆమె చేసే ప్రత్యేక గీతాలు సినిమాల్లో ఆకర్షణగా మారుతున్నాయి. రన్, తుమ్ బిన్ 2, కేజీఎఫ్ చాప్టర్ 1 సినిమాల్లో ఆమె ఆడిపాడిన పాటలు విజయవంతమయ్యాయి. మౌనీ రాయ్‌కు వచ్చిన ఈ పేరుతో మరిన్ని అలాంటి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా రాజ్‌కుమార్ రావు హీరోగా నటిస్తున్న మేడిన్ చైనా చిత్రంలో వాలమ్ అనే పాటలో ఆడిపాడుతోంది మౌనీ. ఆమె ఈ పాట గురించి మాట్లాడుతూ...ప్రేక్షకులు తమకు నచ్చే మంచి పాటల్లో నేను నృత్యాలు కోరుకుంటారు. వాలమ్ పాట విన్న తొలిసారే బాగా నచ్చింది. అలా వింటూనే ఉన్నాను. నా పాట నుంచి మీరు కోరుకునే నాణ్యత వాలమ్‌లో ఉంది.అని చెప్పింది. హిందీలో నాగిన్ అనే సీరియల్‌లో నటించి, గుర్తింపు తెచ్చుకుంది మౌనీ రాయ్. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించిన గోల్డ్ అనే చిత్రంతో తెరంగేట్రం చేసింది. తన కెరీర్ గురించి మౌనీ రాయ్ మాట్లాడుతూ....పేరు తెచ్చుకునేందుకు దగ్గరి దారులు ఉండవు. కూడలిలో ఉన్నప్పుడు నేను శ్రమించే దారినే ఎంచుకున్నాను. మనమే ఎక్కువ కష్టపడుతున్నాం అనుకోవద్దు. ఇతరులతో పోల్చి చూసుకున్నప్పుడు వాళ్ల శ్రమ మనకంటే తక్కువేం కాదని తెలుసుకుంటాం. చిత్ర పరిశ్రమలో ఇదే స్ఫూర్తి తీసుకోవాలి. అని చెప్పింది.

# పాత బాకీ...4దశాబ్దాల తర్వాత చెల్లింపు



ఆంటోని,శారద

సినిమా పరిశ్రమలో ఒక అరుదైన, ఆసక్తికరమైన సంఘటన జరిగింది. ఒక నటికి ఇవ్వాల్సిన పారితోషికాన్ని నలభై సంవత్సరాల తర్వాత నిర్మాత చెల్లించడం జరిగింది. ఇది వినడానికి ఆశ్చర్యం అనిపించినా నిజమే. కొంత మంది ఆర్టిస్టులు తమ పారితోషికాన్ని నిర్మాత పూర్తిగా చెల్లించలేదని ఆరోపిస్తుంటారు. నిర్మాతలు కమిటైన మొత్తం ఇవ్వకపోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. వాటిలో ప్రధానమైంది సినిమాకు ఆర్థిక నష్టాలు రావడం. ఇలాంటి అనుభవం ఎదురైన ఓ నిర్మాత నలభై సంవత్సరాల తర్వాత ఆర్థికంగా పుంజుకుని బ్యాలెన్స్ పారితోషికం చెల్లించారు.

వివరాల్లోకి వెళితే....

తెలుగు నటి శారద మలయాళ సినిమాల్లో కూడా నటించేవారనే విషయం తెలిసిందే. ఆమెకు ఊర్వశి పురస్కారం లభించింది కూడా అక్కడే. సుమారు నలభై ఏళ్ల క్రితం ఆమె 'పుష్యరాగం' (1979) అనే సినిమాలో నటించారు. ఇందులో శ్రీవిద్య కూడా నటించారు. ఈ చిత్రాన్ని వీవీ.ఆంటోని నిర్మించారు. పుష్యరాగం సినిమా అనుకున్న రీతిలో వ్యాపారం జరుపుకోలేదు. దాంతో ఆంటోనికి నష్టం వచ్చింది. ఈ కారణం వల్ల శారదకు చెల్లించాల్సిన బ్యాలెన్స్ పారితోషికం ఇవ్వలేకపోయారట. ఆ తర్వాత చెల్లించాలని ప్రయత్నించినా ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోయారు. ఆ తర్వాత క్రమక్రమంగా పుంజుకున్నారు. దాంతో ఆంటోని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. పాత బాకీ తిరిగివ్వడానికి సిద్ధమయ్యారు. ఒక వేడుకలో పాల్గొనేందుకు నటి శారద కేరళ వస్తున్నారని తెలుసుకున్న అంటోని ఆమెను కలుసుకున్నారు. ఎప్పుడో నలభై ఏళ్ల క్రితం తనతో సినిమా తీసిన నిర్మాతను గుర్తుపట్టి వివరాలు కనుక్కున్నారు. మాటల మధ్యలో పుష్యరాగం బ్యాలెన్స్ పారితోషికాన్ని ఆమెకు అందజేశారు. శారద ఆశ్చర్యపోయారు. పాతబాకీ తీరడంతో అంటోని కుదుటపడ్డారు. నలభై ఏళ్ల క్రితం పాతబాకీని తీర్చేశారు. ఈ అనుభవాన్ని శారద తన సహచరులతో పంచుకున్నారు.



నేహా సోలంకి కార్తికేయ

# బాలీవుడ్ చిత్రాల లొకేషన్‌లో...

దేవదాసు ఎంబిఏ గోల్డ్ మెడలిస్ట్. అంతటి విద్యావంతుడు ఆథరైజ్డ్ తాగుబోతుగా ఎందుకు అయ్యాడు అనేది తెలియాలంటే '90 ఎంఎల్' సినిమా చూడాల్సిందే. కార్తికేయ, నేహా సోలంకి జంటగా నటిస్తున్న ఈ చిత్రం మొదటిపాటని ఇటీవల విడుదల చేశారు. అలాగే టీజర్‌ను సైతం రిలీజ్ చేయడం యువతని ఆకట్టుకుం టోందని చిత్ర బృందం తెలిపింది. 'ఆర్ఎక్స్ 100' వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై అశోక్ రెడ్డి గుమ్మకొండ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

చిత్ర దర్శకుడు శేఖర రెడ్డి ఎర్ర మాట్లాడుతూ ''యువతనే కాకుండా కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే అంశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇటీవల జానీ నేతృత్వంలో పాట చిత్రీకరించాం. ఇందుకోసం ప్రత్యేకంగా సెట్ వేయడం జరిగింది'' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ ''రెండు పాటల చిత్రీకరణ కోసం అజర్ బేజాన్ రాజధాని బాకు వెళుతున్నాం. ఇక్కడ అనేక బాలీవుడ్ చిత్రాల షూటింగ్ జరిగింది'' అని తెలిపారు. ఈ చిత్రంలో ఇంకా రావు రమేష్, రోల్ రైడ, అలీ, పోసాని ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఛాయాగ్రహణం: జె.యువరాజ్.

# సస్పెన్స్ థ్రిల్లర్ కథతో...



సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా 'నేత్ర'. హుస్సేన్ (ఎఎండి) దర్శకత్వంలో బి.వి.సుబ్బారెడ్డి నిర్మిస్తున్నారు. లతా సంగరాజు, గీతాసింగ్, బద్రం, కేదార్ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవల పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తిచేశారు. సెన్సార్ జరిపి విడుదల తేదీని ప్రకటిస్తారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సీనియర్ నటుడు నరేష్, శివబాలాజీ విడుదల చేశారు.

దర్శకుడు మాట్లాడుతూ ''ఇది ఓ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా. టైటిల్‌కు మంచి స్పందన వచ్చింది. సినిమాలో ప్రతి పాత్రకి మంచి ప్రధాన్యత ఉంటుంది. రఘునాథన్ ఛాయాగ్రహణం, రాజ్ కిరణ్ మ్యూజిక్ హైలెట్ అవుతాయి'' అని చెప్పారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్ఖలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076